www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 23-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 204

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా.10.47 తదుపరి తదియ; నక్షత్రం: విశాఖ తె. 4.51 తదుపరి అనూరాధ; వర్జ్యం: ఉ.8.09-9.57; దుర్ముహూర్తం: ఉ.10.04-10.50, మ.2.40-3.26; అమృతఘడియలు: రా.6.57-8.45; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 5.44

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## గోరక్షక్ దళ సభ్యుడిపై కాల్పులు

గోవుల తరలింపును అడ్డుకున్నారన్న కక్షతో..

ఆస్పత్రిలో బాధితుడు.. నిలకడగా ఆరోగ్యం

పరారీలో నిందితుడు.. మేడ్చల్ జిల్లాలో ఘటన

బాధితుడు ప్రశాంత్ సింగ్‌ను పరామర్శించిన కిషన్ రెడ్డి, రాంచందర్‌రావు, ఈటల

13

## ఇక పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇల్లు

400 చదరపు అడుగుల కంటే తక్కువ స్థలం ఉన్నా నిర్మించుకునే వెసులుబాటు

జీ+1 విధానంలో ఇంటి నిర్మాణం

నాలుగు దశల్లో రూ.5 లక్షలు అందజేత

జీవో 69 విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

13



## జూబ్లీహిల్స్ తర్వాతే..

# స్థానికం!

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణంపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష



నేడు మంత్రివర్గ సమావేశంలో స్పష్టత

ముందస్తుగా మంత్రులతో సీఎం జూమ్ కాన్ఫరెన్స్

42 శాతం కోసం చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశామనే భావనలో పలువురు మంత్రులు

రిజర్వేషన్లు 50% మించొద్దన్న సుప్రీంకోర్టు

పార్టీ పరంగా ఇవ్వాలనుకుంటే బీసీలకు 42 శాతం కేటాయించాలని యోచన

ఎన్నికలు జరపలేదనే అపవాదు రావొద్దనే..

ఎన్నికలకు వెళ్లాలన్నది మెజారిటీ అభిప్రాయం

చట్టపరంగా 42%.. సీఎంకు ఆర్.కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముగిసిన తరువాతే జరిగే అవకాశం కనిపిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో డైలమా నెలకొనడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అధికారికంగా 42 శాతం కల్పించే వీలు కనిపించడం లేదని, దీంతో కాంగ్రెస్ పార్టీ పరంగా కల్పించాలని ప్రభుత్వ పెద్దలు యోచిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ అంశంపై హైకోర్టు నాలుగు వారాలు గడువు ఇచ్చినందున అప్పటివరకు వేచి చూద్దామా? అనే కోణంలోనూ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. గురువారం జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ విషయంలో స్పష్టత రానుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలోని ఆరో అంతస్తులో మంత్రివర్గం

మిగతా 13వ పేజీలో...

### రెండేళ్లలో ఉస్మానియా ఆస్పత్రి పూర్తవ్వాలి

13 వందేళ్ల అవసరాలకు తగినట్లు వసతుల కల్పన

పనుల వేగవంతానికి సమన్వయ కమిటీ: సీఎం రేవంత్



జహీరాబాద్ ఆర్టీఏ చెక్‌పోస్టును తొలగిస్తున్న సిబ్బంది

## రవాణా శాఖ చెక్‌పోస్టుల తొలగింపు

సీఎం ఆదేశాలను అమలు చేస్తూ ఉత్తర్వు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెక్‌పోస్టుల ఎత్తివేత

సిబ్బందికి ఇతర బాధ్యతలు: కమిషనర్

రవాణా శాఖ ప్రక్షాళనకు చర్యలు

ఏఐతో దళారీలకు అడ్డుకట్ట: పొన్నం

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రహదారులపై ఉన్న రవాణా(ఆర్టీఏ) చెక్‌పోస్టులన్నింటినీ ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రహదారులపై రవాణా శాఖ చెక్‌పోస్టులను ఎత్తివేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రానికల్లా అన్ని చెక్‌పోస్టులను తొలగించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. దీంతో తక్షణమే చెక్‌పోస్టుల ఎత్తివేత నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా చెక్‌పోస్టులను మూసివేసి, రికార్డులు, ఫర్నిచర్‌ను జిల్లా రవాణా కార్యాలయానికి తరలించి, ప్రధాన కార్యాలయానికి సమగ్ర నివేదిక అందించాలని రవాణాశాఖ కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చెక్‌పోస్టుల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఇతర బాధ్యతలు అప్పగించాలన్నారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్‌పోస్టుల

మిగతా 13వ పేజీలో...

## ప్రతి 100 మందిలో ఏడుగురికి

# కిడ్నీ సమస్య

దేశంలోనే తెలంగాణలో అత్యధికం

7.4% మందికి కిడ్నీ పనితీరులో లోపం.. జాతీయ సగటుతో పోలిస్తే రెండింతలు

బిహార్‌లో అతి తక్కువగా 0.8%.. ఐసీఎంఆర్-ఇండియాబీ అధ్యయనంలో వెల్లడి

అధిక రక్తపోటు, నియంత్రణలో లేని మధుమేహమే కిడ్నీ సమస్యలకు కారణం

విచ్చలవిడిగా యాంటీ ఎసిడిటీ, నొప్పి నివారణ మాత్రల వినియోగంతో ప్రమాదం

ఆహారం, జీవనశైలిలో మార్పులతో ముప్పును తప్పించుకోవచ్చని వైద్యుల సలహా



హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం మూత్రపిండాల (కిడ్నీ) సమస్యలకు రాజధానిగా మారుతోంది. ప్రతి వంద మందిలో ఏడుగురు ఏదో ఒక కిడ్నీ సంబంధిత సమస్య(ఇంపెయిర్డ్ కిడ్నీ ఫంక్షన్ - ఐకేఎఫ్)తో బాధపడుతున్నారు. బయటికి ఏమీ తెలియకుండానే ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్)- ఇండియాబీ సంయుక్తంగా చేపట్టిన అధ్యయనంలో ఈ అంశం వెల్లడైంది. కిడ్నీ సమస్యల విషయంలో దేశంలోనే తెలంగాణ టాప్‌లో ఉందని తేలింది. ఇటీవల ఆరోగ్యశ్రీ విడుదల చేసిన గణాంకాల్లో కూడా రాష్ట్రంలో అత్యధిక కేసులు కిడ్నీలకు సంబంధించినవేనని వెల్లడికావడం గమనార్హం. దేశంలోని 31 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 25,408 మందిపై అధ్యయనం చేశామని.. దేశవ్యాప్తంగా సగటున 3.2శాతం మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని ఐసీఎంఆర్-ఇండియాబీ అధ్యయనం వెల్లడించింది. అదే తెలంగాణలో 7.4 శాతంగా తేలిందని, జాతీయ సగటు కంటే ఇది 2.3 రెట్లు ఎక్కువని వెల్లడించింది. చిన్న రాష్ట్రం గోవా

మిగతా 10వ పేజీలో...

## ఐఫోన్ ఆర్డర్ చేస్తే.. ఐకూ ఫోన్ డెలివరీ!

అమెజాన్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంట్లు

నోటీసులకు స్పందించకపోవడంతో వినియోగదారుల కమిషన్ తీవ్ర చర్య

14

ఏపీలోని కర్నూలు జిల్లాలో ఘటన

### అమెజాన్‌లో రోబోలు!

2

ఉద్యోగులను తగ్గించుకునే ప్రణాళికలు?



## బంగారం తగ్గుముఖం

2

ఒక్కరోజులోనే రూ.4,690 తగ్గిన ధర

హైదరాబాద్‌లో తులం రూ.1,25,890

## ఆబ్కారీ శాఖలో రిజ్వీ మంటలు

నా ఆదేశాలను ముఖ్య కార్యదర్శి రిజ్వీ, కమిషనర్ హరికిరణ్ పెడచెవిన పెట్టారు

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారు

అనవసరంగా సీఎంవోకు ఫైళ్లు పంపారు

నివేదికల పేరిట తీవ్ర జాప్యం చేశారు

రాష్ట్ర ఖజానాకు నష్టం కలిగించారు

సీఎస్‌కు మంత్రి జూపల్లి ఫిర్యాదు

స్వచ్ఛంద పదవీ విరమణకు రిజ్వీ దరఖాస్తు

ఆమోదించవద్దని సీఎస్‌కు మంత్రి లేఖ

మంత్రిగా తన విధులు నిర్వహించకుండా రిజ్వీ ఆటంకం కలిగించారని ఆరోపణ

ఆయనపై ఏఐఎస్ సర్వీస్ రూల్స్, బీఎస్ఎస్ ప్రకారం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి



మంత్రి జూపల్లి కృష్ణారావు



సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆబ్కారీ శాఖలో 'అనుచిత ప్రవర్తన' అంశం మంటలు రేపుతోంది. కీలకమైన ఎక్సైజ్ శాఖలో మంత్రి, ఉన్నతాధికారుల మధ్య కొన్ని నెలలుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. తాను ఇచ్చిన ఆదేశాలను ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ, కమిషనర్ హరికిరణ్ పెడచెవిన పెట్టారంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మంత్రి జూపల్లి కృష్ణారావు ఫిర్యాదు చేయడం, దీనితో రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) కోసం దరఖాస్తు చేసుకోవడం, ఆ వీఆర్ఎస్‌ను ఆమోదించవద్దంటూ సీఎస్‌కు మంత్రి మరో లేఖ రాయడం.. పైగా అనుచిత ప్రవర్తన, క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడ్డ రిజ్వీపై కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేయడం వంటి వరుస పరిణామాలు

మిగతా 12వ పేజీలో...

# సుంకాలు 16% లోపే!

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై తుది దశలో చర్చలు

జన్యుమార్పిడి చేయని మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులు పెంచుకునేందుకు భారత్ అంగీకారం!

ఈ నెలాఖరులోనే ప్రకటన వెలువడే అవకాశం

కేంద్ర అధికారవర్గాలను ఉటంకిస్తూ 'మింట్' కథనం

అమెరికా శ్వేతసౌధంలో ఘనంగా దీపావళి వేడుకలు

ప్రధాని మోదీకి ఫోన్.. భారతీయులకు శుభాకాంక్షలు

రష్యా చమురు కొనుగోళ్లు భారత్ తగ్గిస్తుందని వ్యాఖ్య

ట్రంప్‌కు మోదీ కృతజ్ఞతలు.. ఇరు ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచానికి ఆశల వెలుగులు అందించాలని ఆకాంక్ష



వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల్లో దీపాలు వెలిగిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్/ న్యూఢిల్లీ, అక్టోబరు 22: భారత్‌కు అమెరికా అడ్డగోలు సుంకాల బాధ తప్పనుంది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంతో ఈ సమస్యకు పరిష్కారం రానుంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలతో సంబంధమున్న ముగ్గురు అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా సంస్థ 'మింట్' ఈ మేరకు కథనం ప్రచురించింది. దానికితోడు భారత్, అమెరికాలలో తాజా పరిణామాలు కూడా సుంకాల బాధ తొలగిపోయి, ఇరు దేశాల మధ్య సంబంధాలు తిరిగి బలపడతాయనే సంకేతాలు ఇస్తుండటం గమనార్హం. మొత్తానికి భారత్‌పై సుంకాలు 15%-16%కు దిగివస్తాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై

మిగతా 2వ పేజీలో...

## డీప్‌ఫేక్‌లపై కేంద్రం కొరడా

ఏఐ ద్వారా సృష్టించే కంటెంట్ మీద 'ఇది కృత్రిమం' అనే లేబుల్ తప్పనిసరి

వీడియోకైతే తెర మీద 10% మేర..

ఆడియోకు తొలి 10 శాతం వ్యవధిలో..

కృత్రిమ కంటెంట్ అప్‌లోడ్ చేసే వారి నుంచి అంగీకార పత్రం

2

ఐటీ చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర ఐటీ శాఖ ముసాయిదా పత్రం

## 'వంట'యూరు!

కమ్మనైన వంటలకు మంచిర్యాల జిల్లా జనకాపూర్ ప్రసిద్ధి

వంట ఉపాధిగా 300 మంది..

విందుల్లో వారి వంటలకు ఆదరణ

చుట్టుపక్కల జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఆర్డర్లు

నిల్వ పచ్చళ్ల తయారీలోనూ మేటి.. విదేశాలకూ ఎగుమతి

మంచిర్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం జనకాపూర్ గ్రామంలో ఎక్కడ చూసినా వంటవాళ్లే దర్శనమిస్తారు. గ్రామంలో ఏకంగా 300 వరకు వంటవాళ్లు ఉండగా, మంచిర్యాలతోపాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తాయని చెబుతున్నారు. నలభై ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన మంచర్ల సీతారాం

మిగతా 10వ పేజీలో...

## రాష్ట్రపతికి త్రుటిలో తప్పిన ముప్పు!

- హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా కుంగిన కాంక్రీట్
- ఇరుక్కుపోయిన హెలికాప్టర్ చక్రం
- సురక్షితంగా రాష్ట్రపతిని కిందికి దించిన భద్రతా సిబ్బంది
- కేరళలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో ఘటన
- హెలీప్యాడ్‌ను చివరి నిమిషంలో మార్చడం వల్లే..!
- ఇరుముడితో అయ్యప్పను దర్శించుకున్న రాష్ట్రపతి

2



## మావోయిస్టు మద్దతుదారులపై నజర్!

సోషల్ మీడియా పోస్టులపై కేంద్ర బృందాలు, రాష్ట్ర పోలీసుల నిఘా

నక్సల్స్ ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్ల తర్వాత స్పందించిన వారిపై కన్ను

పోలీసుల రాడార్‌లో కొన్ని ఎన్‌జీవో సంస్థలు

మావోయిస్టు అనుబంధ ప్రజాసంఘాల్లో పని చేస్తున్న వారిపైనా ఆరా

సికాసలో కదలిక.. పోలీస్‌ల అప్రమత్తతతో వెనక్కి

14

# హెచ్-1బీ గందరగోళం.. వాల్‌మార్ట్‌లో నియామకాలు బంద్

న్యూఢిల్లీ, అక్టోబరు 22: హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచిన నేపథ్యంలో అమెరికా రిటైల్ దిగ్గజ సంస్థ వాల్‌మార్ట్.. ఉద్యోగ నియామకాల అంశంలో కీలక నిర్ణయం తీసుకుంది. హెచ్-1బీ వీసా స్పాన్సర్‌షిప్ అవసరమున్న వారికి ఉద్యోగాలు ఇవ్వడాన్ని తాత్కాలికంగా ఆపేసింది. అయితే, హెచ్-1బీ వీసా నూతన నిబంధనల నేపథ్యంలో దీనిపై పునరాలోచనలు చేస్తున్నామని వాల్‌మార్ట్ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. తమ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు అవసరమైన నియామకాలు చేపట్టేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. వాల్‌మార్ట్ ఇప్పటిదాకా 2,390 హెచ్-1బీ వీసాదారులకు ఉద్యోగాలు ఇచ్చింది. అయితే, వాల్‌మార్ట్ తీసుకున్న నిర్ణయం విదేశీ ఉద్యోగుల నియామకం అంశంలో అమెరికన్ సంస్థలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న గందరగోళానికి నిదర్శనమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అమెజాన్‌లో రోబోలు!

▸ 6లక్షల మంది ఉద్యోగుల స్థానంలో నియామకం!



న్యూఢిల్లీ, అక్టోబరు 22: ప్రముఖ దిగ్గజ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్.. తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకునే ప్రయత్నం చేస్తోంది. రోబోల ద్వారా ఆ స్థానాలను భర్తీ చేసుకోవాలని యోచిస్తోంది. 2033 నాటికి 6లక్షల మంది దాకా ఉద్యోగులను తగ్గించుకొని.. రోబోలతో ఆ పనులు చేయించే ఆలోచనలో ఉంది. ఇందుకు సంబంధించి అమెజాన్‌కు చెందిన కీలక సమాచారంతో కూడిన పత్రాలు లీకైనట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. ఇప్పటికే వేర్‌హౌస్‌లలో భారీగా రోబోలను వినియోగిస్తున్న అమెజాన్.. రానున్న రోజుల్లో వాటిని మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపింది. 75 శాతం పనులను ఆటోమేషన్ చేసేందుకు రోబోటిక్స్ బృందం పనిచేస్తోందని పేర్కొంది. అయితే దీనిపై అమెజాన్ సూటిగా స్పందించలేదు. లీకైన పత్రాలు పూర్తిగా సంస్థ ప్రణాళికను వెల్లడించేవి కావని అమెజాన్ అధికార ప్రతినిధి కెల్లీ నాంటెల్ అన్నారు. సంస్థలోని ఒక బృందం అభిప్రాయాలనే తెలియజేస్తాయని పేర్కొన్నారు. రానున్న హాలిడే సీజన్‌లో 2.5 లక్షల మంది ఉద్యోగులను నియమించుకునే ప్రణాళికను వెల్లడించినట్లు తెలిపారు.

# బంగారం ధర తగ్గుముఖం

▸ మంగళవారంతో పోలిస్తే రూ.4,690తగ్గిన రేటు

▸ హైదరాబాద్‌లో 10గ్రాములకు రూ.1,25,890

న్యూఢిల్లీ, అక్టోబరు 22: బంగారం ధర క్రమంగా దిగివస్తోంది. మంగళవారంతో పోలిస్తే బుధవారం పసిడి రేటు 10గ్రాములకు రూ.4,690తగ్గిపోయింది. 24క్యారట్ల బంగారం ధర హైదరాబాద్‌లో రూ.1,25,890గా ఉంది. మంగళవారం ఇది రూ.1,30,580గా ఉంది. అక్టోబరు 17న బంగారం ధర రికార్డు స్థాయిలో రూ.1,32,770కి చేరుకున్న సంగతి తెలిసిందే. దీనితో పోలిస్తే బంగారం రేటు బుధవారానికి రూ.6,880 తగ్గింది. ఇక, అంతర్జాతీయ విపణిలో ఔన్సు(31.10గ్రాముల) బంగారం రేటు 4,053డాలర్లకు పడిపోయింది. డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టడంతోనే బంగారం ధర తగ్గుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, వెండి ధర బుధవారం ఇండియాలో కిలోకు రూ.1.60లక్షలుగా ఉంది.

## లోకం తీరు




# హిందూ వారసత్వ చట్టం ఎస్టీలకు వర్తించదు!

▸ హిమాచల్ గిరిజనుల కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హిందూ వారసత్వ చట్టం షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు వర్తించదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో కుమార్తెలు గిరిజన ఆచారాల ప్రకారం కాకుండా హిందూ వారసత్వ చట్టం (హెచ్‌ఎస్‌ఏ) ప్రకారం ఆస్తిని పొందేందుకు అనర్హులని స్పష్టం చేసింది. హెచ్ఎస్ఏ ప్రకారం గిరిజనులు ఆస్తిని పొందేందుకు అర్హులేనంటూ హిమాచల్ హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. హెచ్‌ఎస్‌ఏలోని సెక్షన్ 2(2)కి హైకోర్టు తీర్పు విరుద్ధంగా ఉందని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 336లో నిబంధన(25) ప్రకారం ఏ షెడ్యూల్డ్ తెగ సభ్యులకూ హెచ్‌ఎస్‌ఏ వర్తించదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, హెచ్‌ఎస్‌ఏను ఎస్టీలకు వర్తింపజేయాలంటూ సుప్రీంకోర్టు గతంలోనే కేంద్రానికి సూచించిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించింది.

## బ్యాంకు తనఖా హక్కులకు.. అట్రాసిటీ చట్టం నిబంధనలు అడ్డు కాదు

న్యూఢిల్లీ, అక్టోబరు 22 : బ్యాంకులు చట్టబద్ధంగా తనఖా పెట్టుకున్న ఆస్తులను స్వాధీనం చేసుకోకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టంలోని ఎస్సీ, ఎస్టీల ఆస్తులు, భూముల రక్షణ నిబంధనలు అడ్డుకోవని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. సన్‌దేవ్ అప్లయెన్సెస్ లిమిటెడ్ అనే సంస్థకు 2013లో యాక్సిస్ బ్యాంకు రూ.16.69 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. ఇందుకు మహారాష్ట్ర వాసాయిలోని స్థిరాస్తులను తనఖా పెట్టారు. అయితే ఆ రుణాన్ని చెల్లించడంలో విఫలమవడంతో 2017లో బ్యాంకు.. తనఖా పెట్టిన ఆస్తుల స్వాధీనానికి ఉపక్రమించింది. ఇది సివిల్ వివాదానికి దారితీసింది. ఈ వివాదంలో ఉన్న ఒక వ్యక్తి జాతీయ షెడ్యూలు తెగల కమిషన్‌ను ఆశ్రయించగా కమిషన్ యాక్సిస్ బ్యాంకు ఎండీ, సీఈవోలు తన ముందు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో యాక్సిస్ బ్యాంకు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా విచారణ చేపట్టిన కోర్టు జాతీయ షెడ్యూలు తెగల కమిషన్ ఆదేశాలపై స్టే ఇచ్చి, కమిషన్‌కు ఈ అంశంపై విచారణ పరిధి లేదని స్పష్టం చేసింది.

## రాజకీయ చరమాంకంలో మా నాన్న!

▸ సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర సంచలన వ్యాఖ్యలు



బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో నాయకత్వ మార్పుపై జోరుగా ఊహాగానాలు కొనసాగుతున్న సమయంలో సీఎం సిద్ధరామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. తన తండ్రి సిద్ధరామయ్య రాజకీయ చరమాంకంలో ఉన్నారని, ఆయన తర్వాత కాంగ్రెస్ పార్టీని నడిపించేందుకు సతీశ్ జార్కిహొళి సమర్థుడని యతీంద్ర పేర్కొన్నారు. బెళగావి జిల్లా రాయభాగ తాలూకా కప్పలగుడ్డిలో బుధవారం జరిగిన కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీంతో, రాష్ట్రంలో త్వరలో నాయకత్వ మార్పు ఉంటుందని యతీంద్ర సంకేతం ఇచ్చారంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, యతీంద్ర కొంతసేపటికే యూటర్న్ తీసుకున్నారు. నాయకత్వ మార్పు ఊహాగానమే అంటూ కొట్టిపారేశారు. ఈ విషయంలో తమ పార్టీ అధిష్ఠానం ఇప్పటికే స్పష్టత ఇచ్చిందని తెలిపారు.

## ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త ఏక్‌నాథ్ చిట్నిస్ కన్నుమూత



పుణె, అక్టోబరు 22: భారత అంతరిక్ష పరిశోధన రంగానికి విశేష సేవలందించిన ప్రముఖ శాస్త్రవేత్త, పద్మ భూషణ్ గ్రహీత డాక్టర్ ఏక్‌నాథ్ వసంత్ చిట్నిస్ (100) కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న చిట్నిస్, బుధవారం నాడు గుండెపోటు రావడంతో పుణెలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ చివరి సహచరులలో చిట్నిస్ ఒకరు. ప్రస్తుతం ఇస్రోగా రూపాంతరం చెందిన ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ తొలి నాళ్లలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. భారతదేశపు మొట్టమొదటి రాకెట్ ప్రయోగ కేంద్రం కోసం కేరళలోని తుంబాను ఎంపిక చేయడంలో కూడా చిట్నిస్ కీలకంగా వ్యవహరించారు. అప్పటి యువ శాస్త్రవేత్త అబ్దుల్‌కలాంకు మార్గనిర్దేశం చేశారు.

## 4 కోట్ల గడియారం ఆర్డరిస్తే.. రూ.400 విలువైనది వచ్చింది

▸ ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసం.. చెన్నైలో పోలీసులకు ఫిర్యాదు

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ షాపింగ్‌లో బడా మోసం చెన్నైలో వెలుగుచూసింది. ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్‌లో రూ.4 కోట్ల విలువైన చేతి గడియారాన్ని చూసి కొనుగోలు చేసిన ఓ వ్యాపారి కుమారుడు.. తనకు అందిన రూ.400 విలువైన గడియారం చూసి షాక్ తిన్నాడు. దీనిపై కొట్టూరుపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఓ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఆ గడియారాన్ని చూసి ప్రముఖ వస్త్రదుకాణం యజమాని కుమారుడు ముచ్చట పడ్డాడు. వెంటనే దానిని కొనుగోలు చేయడానికి స్థానిక బోట్‌క్లబ్‌కు చెందిన ఓ ఏజెంట్‌ను సంప్రదించాడు. నిబంధనల్లో భాగంగా ఆ గడియారం కోసం ఆన్‌లైన్‌లో రూ.2.3 కోట్లు చెల్లించాడు. కానీ మంగళవారం అతనికి వచ్చిన పార్శిల్‌లో కేవలం రూ.400 విలువైన గడియారం మాత్రమే ఉండటం చూసి మోసపోయినట్లు గ్రహించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## బిహార్‌లో కూటమి సీట్ల సర్దుబాటు కొలిక్కి!

న్యూఢిల్లీ/పట్నా, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో మహాగఠ్‌బంధన్ కూటమిలోని పార్టీల మధ్య ఏర్పడిన సీట్ల సర్దుబాటు పంచాయితీ ఓ కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తోంది. 13 సీట్లపై ఆర్జేడీ, కాంగ్రెస్, సీపీఐ(ఎం) పార్టీల మధ్య ఏర్పడిన వివాదం చిలికిచిలికి గాలివానగా మారడంతో సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోత్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దింపింది. ఆయన బుధవారం పట్నాలోని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ నివాసానికి వెళ్లి అక్కడ తేజస్వితో పాటు లాలూ యాదవ్, రాబరీదేవిలతో దాదాపు గంటపాటు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో సీట్ల సర్దుబాటు విషయంలో స్పష్టత ఏర్పడిందని, మహా అయితే అయిదారు సీట్లలో కాంగ్రెస్, ఆర్జేడీల మధ్య స్నేహపూర్వక పోటీ ఉంటుందని గెహ్లోత్ చెప్పారు. ఇప్పటి వరకు ఆర్జేడీ 143, కాంగ్రెస్ 61 సీట్లలో పోటీ చేయనున్నట్లు ప్రకటించాయి. మిగతా 39 సీట్లను సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్), వికాస్ శీల్ ఇన్సాఫ్ పార్టీలకు కేటాయించనున్నారు. గురువారం కూటమి నేతలంతా విలేకరుల సమావేశంలో పాల్గొని వారి మధ్య కుదిరిన సీట్ల సర్దుబాటును ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. కాగా, సీఎం అభ్యర్థిగా తేజస్వీ పేరునే కూటమి నేతలు ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

# రాష్ట్రపతికి త్రుటిలో తప్పిన ముప్పు!

**హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా కుంగిన కాంక్రీట్.. కాంక్రీట్‌లో ఇరుక్కుపోయిన హెలికాప్టర్ చక్రం**

పథనంథిట్ట, అక్టోబరు 22: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు త్రుటిలో ప్రమాదం తప్పింది. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం సాయంత్రం ముర్ము తిరువనంతపురం చేరుకున్నారు. బుధవారం ఉదయం ఆమె శబరిమల బయల్దేరారు. ప్రమదంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రపతి హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా.. హెలీప్యాడ్‌లోని కాంక్రీట్ ఒక్కసారిగా కుంగిపోయింది. హెలికాప్టర్ చక్రం ఒకటి లోపలికి దిగిపోయింది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది రాష్ట్రపతిని సురక్షితంగా హెలికాప్టర్ నుంచి కిందకు దించారు. ఈ ఘటనలో రాష్ట్రపతికి ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించారు. అనంతరం ఆమె రోడ్డు మార్గంలో పంబకు బయల్దేరారు. హెలికాప్టర్ చక్రాన్ని బయటకు తీసేందుకు పలువురు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దాన్ని తోస్తున్న చిత్రాలు పలు టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి. వాస్తవానికి రాష్ట్రపతి హెలికాప్టర్ పంబ సమీపంలోని నీలక్కల్ వద్ద దిగాల్సి ఉంది. కానీ, ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండింగ్ స్థలాన్ని ప్రమదం ప్రాంతానికి మార్చారు. "ప్రమదం ప్రాంతంలో హెలికాప్టర్‌ను ల్యాండ్ చేయాలని చివరి నిమిషంలో నిర్ణయించారు. అందువల్ల మంగళవారం రాత్రే ఇక్కడ హెలీప్యాడ్‌ను నిర్మించారు. దీంతో కాంక్రీట్ పూర్తిగా గట్టిపడలేదు. బుధవారం ఉదయం హెలికాప్టర్ దిగిన తర్వాత ఆ బరువును మోయలేక అది కుంగిపోయింది. చక్రం ఒకటి కాంక్రీట్‌లో ఇరుక్కుపోయింది" అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. రాష్ట్రపతి ముర్ము హెలికాప్టర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పడంపై కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్ తీవ్రంగా స్పందించారు. ఇది పూర్తిగా భద్రతా వైఫల్యమేనన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



శబరిమలలో ఇరుముడితో పదునెట్టాంబడిపై రాష్ట్రపతి ముర్ము



కుంగిన హెలికాప్టర్‌ను పక్కకు తోస్తున్న సిబ్బంది

### ఇరుముడితో శబరిమలకు ముర్ము

రాష్ట్రపతి ముర్ము ప్రత్యేక కాన్వాయ్‌లో ఉదయం 11 గంటలకు పంబ చేరుకున్నారు. అక్కడి నదిలో కాళ్లు కడుక్కున్న ఆమె.. గణపతి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన పూజారి విష్ణు నంబూద్రి ముర్ముకు ఇరుముడి కట్టారు. భద్రతాధికారులు సౌరభ్ నాయర్, వినయ్ మాథుర్‌లతో పాటు ముర్ము అల్లుడు గణేశ్‌చంద్ర హోంబ్రమ్‌కు కూడా ఇరుముడు కట్టారు. నల్ల చీరతో తలపై ఇరుముడి పెట్టుకొని రాష్ట్రపతి ముర్ము ప్రత్యేక వాహనంలో సన్నిధానానికి చేరుకున్నారు. పవిత్రమైన 18 బంగారు మెట్లు ఎక్కారు. అయ్యప్ప స్వామిని దర్శించుకొని, ఇరుముడి సమర్పించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్న తొలి మహిళా రాష్ట్రపతిగా నిలిచారు. అంతకుముందు 1970ల్లో అప్పటి రాష్ట్రపతి వీవీ గిరి శబరిమల అయ్యప్పను దర్శించుకున్నారు. ఆయన డోలీలో సన్నిధానానికి చేరుకున్నారు. తాజాగా ముర్ము ఫోర్ వీల్ డ్రైవ్ వాహనంలో సన్నిధానానికి వెళ్లారు.

## మహిళల పథకంలో మగాళ్లు!

**మహారాష్ట్రలో 'లడకీ బహిన్ యోజన'లో 12,431 మంది పురుషులకు లబ్ధి**

**వారిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా**

ముంబై, అక్టోబరు 22: మహారాష్ట్రలో ప్రత్యేకించి మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకం 'ముఖ్యమంత్రి మాఝీ లడకీ బహిన్ యోజన'లో ఏకంగా 12 వేలమందికి పైగా పురుషులు అక్రమంగా లబ్ధిపొందారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. 13 నెలల పాటు ప్రతినెలా రూ.1500 చొప్పున నగదు అందుకున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. మహారాష్ట్రలో కుటుంబ వార్షికాదాయం 2.5 లక్షల లోపు ఉన్న 21-65 ఏళ్ల మధ్య వయసు మహిళలకు ఈ పథకం కింద ప్రతినెలా రూ.1500 ఇస్తున్నారు. అయితే 12,431 మంది పురుషులతో పాటు అనర్హులైన 77,980 మంది మహిళలు (12 నెలల పాటు) ఈ జాబితాలో ఉన్నట్లు బయటపడింది. మొత్తం రూ.164.52 కోట్ల నిధులు దుర్వినియోగం అయినట్లు తేలింది. వీరందరూ అనర్హులుగా తేలడంతో ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించినట్లు మహారాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. లబ్ధిపొందిన వారిలో పురుషులతో కలిపి కనీసం 2400 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వారిపై క్రమశిక్షణా చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇంకా వెరిఫికేషన్ కొనసాగుతోందని, అనర్హుల సంఖ్య మరింత పెరగవచ్చని పేర్కొన్నారు. అక్రమ చెల్లింపులకు సంబంధించి ఎలాంటి రికవరీ చేయలేదన్నారు.

## నిపుణులను స్వదేశానికి రప్పిద్దాం!

**విదేశాల్లో స్థిరపడిన భారత సంతతి నిపుణులను ఆకర్షించేందుకు కేంద్రం ప్లాన్**

న్యూఢిల్లీ, అక్టోబరు 22: ఉన్నత విద్యపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న విధానాలతో పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ నేపథ్యంలో అమెరికా సహా విదేశాల్లో స్థిరపడిన భారతీయ, భారత సంతతి పరిశోధకులు, విద్యా నిపుణులను స్వదేశానికి రప్పించి.. వారిని ఇక్కడి విద్యా సంస్థల్లో బోధించేలా, పరిశోధనలు చేసేలా కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దేశ పరిశోధన, సృజనాత్మక రంగాలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇలాంటి ప్రణాళికను పరిశీలించినప్పటికీ.. విధానపరమైన జాప్యం, అనిశ్చిత పరిస్థితులు వంటి అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. అయితే అమెరికాలో ఇటీవలి పరిణామాల నేపథ్యంలో మోదీ సర్కారు.. ఈ ప్రణాళికను కొత్తగా పరిశీలిస్తోంది. పరిశోధనలు లేదా బోధన కోసం నిర్దిష్ట కాలంపాటు భారత్‌లో గడిపేందుకు సిద్ధంగా ఉన్న వారిని తిరిగి తీసుకురావడం కోసం విద్య, శాస్త్ర సాంకేతిక శాఖలతో సంప్రదించి ఒక పథకాన్ని రూపొందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో వారికి ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నాయి. ప్రస్తుతం సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ విజిటింగ్ అడ్వాన్స్‌డ్ జాయింట్ రిసెర్చ్(వజ్ర) ఫ్యాకల్టీ స్కీమ్‌ను నిర్వహిస్తోంది. దీని ద్వారా ప్రవాస భారతీయులు, భారత సంతతికి చెందిన విదేశీ శాస్త్రవేత్తలను స్వదేశానికి తీసుకొచ్చి ప్రభుత్వసంస్థలు, యూనివర్సిటీల్లో నిర్దిష్ట కాలంపాటు పనిచేసేలా చర్యలు తీసుకుంటోంది. అలాగే రామానుజమ్ ఫెలోషిప్ కూడా విదేశాల్లో నివసిస్తున్న భారతీయపరిశోధకులు ఇండియాలోని వర్సిటీల్లో పనిచేయడానికి అవకాశం కల్పిస్తోంది.

# సుంకాలు 16% లోపే!

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 26-27 తేదీల్లో మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరగనున్న ఆసియాన్ సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ ప్రకటన చేసే అవకాశం ఉందని అంటున్నాయి.

**ఇరువర్గాలు దిగొస్తుండటంతో**

అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై కొన్ని నెలలుగా చర్చలు జరుగుతున్నా.. వ్యవసాయ, పాడి రంగాలకు సంబంధించిన అంశాలపై పీటముడి పడింది. అదే సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని కూడా అమెరికా డిమాండ్ చేస్తోంది. ఈ కారణంతో చూపుతూనే భారత్‌పై ఏకంగా 50శాతం సుంకాలను విధించింది. అయితే ఇరువర్గాల కొంతమేర దిగివచ్చాయని, దీనితోవాణిజ్య ఒప్పందంపై తుది చర్చలు కొలిక్కి వచ్చినట్టేనని తెలిసింది. చవకగా వచ్చే అమెరికా మొక్కజొన్న, పాల ఉత్పత్తులను అనుమతిస్తే తమ రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఇటీవలి వరకు భారత్ వాదిస్తూ వచ్చింది. దానికితోడు అమెరికా జన్యుమార్పిడి ఉత్పత్తులు, మాంసాహార పదార్థాలు వేసే ఆవులు/గేదెల నుంచి తీసిన పాల ఉత్పత్తులను సెంటిమెంట్, పర్యావరణపరంగా అనుమతించలేమని స్పష్టం చేసింది. అయితే చర్చల సందర్భంగా అమెరికా నుంచి జన్యుమార్పిడి చేయని సాధారణ మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులను పెంచుకునేందుకు.. రష్యా నుంచి చమురు దిగుమతి తగ్గించి, అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులు పెంచుకునేందుకు భారత్ అంగీకరించినట్లు సమాచారం. దీనికి అమెరికా కూడా అంగీకరించడంతో ప్రతిష్ఠంభనకు తెరపడిందని చర్చలతో సంబంధం ఉన్న అధికార వర్గాలు వెల్లడించాయి. మోదీతో ట్రంప్ ఫోన్ చర్చలు, ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాల దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొనడం కూడా.. వాణిజ్య ఒప్పందం దిశగా సంకేతాలేనని పేర్కొన్నాయి. మొత్తంగా భారత్‌పై అమెరికా సుంకాలు 15%-16% మేరకు దిగిరానున్నాయన్నారు.

**శ్వేత సౌధంలో దీపావళి వేడుకలు**

హిందువులు ఘనంగా జరుపుకొనే దీపావళి పండుగ సందర్భంగా అమెరికా అధ్యక్ష కార్యాలయం శ్వేతసౌధంలో వేడుకలు నిర్వహించారు. అక్కడి కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి భారతీయ అమెరికన్ వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖులతో కలిసి అధ్యక్షుడు దీపాలను వెలిగించారు. భారతీయులకు, భారతీయ అమెరికన్లకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీకి ఫోన్ చేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపానని ఈ సందర్భంగా ట్రంప్ వెల్లడించారు. మోదీ గొప్ప వ్యక్తి అని, తన స్నేహితుడని పేర్కొన్నారు. వాణిజ్యం, భారత్-పాక్ సంబంధాలు సహా తాము చాలా విషయాలు మాట్లాడుకున్నామని చెప్పారు. పాకిస్థాన్‌తో యుద్ధం వద్దని చెప్పానని ట్రంప్ పేర్కొన్నారు. "భారతీయులకు దీపావళి శుభాకాంక్షలు. ఇంతకుముందే ప్రధాని మోదీతో మాట్లాడాను. ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాల దిశగా అడుగులు పడుతున్నాయి. నా లాగే మోదీ కూడా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియాలని కోరుకుంటున్నారు. అందుకే రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేయబోవడం లేదు. ఇప్పటికే కొనుగోళ్లు తగ్గిస్తూ వస్తోంది" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, అమెరికాలోని భారతీయ అమెరికన్లు నేతృత్వం వహిస్తున్న సంస్థలు ప్రపంచంలోనే పెద్దవని, వారు అమెరికా ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని పేర్కొన్నారు.



వైట్ హౌస్‌లో దీపావళి వేడుకల్లో ట్రంప్, భారత సంతతికి చెందిన వ్యాపారవేత్తలు


**ప్రపంచంలో ఆశల వెలుగులు అందించాలి: మోదీ**

కాగా, తనకు ప్రత్యేకంగా ఫోన్ చేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ట్రంప్‌కు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు విదేశాంగశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. "మోదీకి ట్రంప్ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం కావాలని, రెండు ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచానికి ఆశ అనే వెలుగును ఇవ్వాలని మోదీ ఆకాంక్షించారు. అదే సమయంలో ఉగ్రవాదంపై పోరాటానికి, అంతర్జాతీయంగా పరస్పర సహకారానికి భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు" అని వెల్లడించింది.

# డీప్‌ఫేక్‌లపై కేంద్రం కొరడా

▸ ఏఐ ద్వారా సృష్టించే కంటెంట్ మీద 'ఇది కృత్రిమం' అనే లేబుల్ తప్పనిసరి

▸ ఐటీ చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర ఐటీ శాఖ ముసాయిదా పత్రం



న్యూఢిల్లీ, అక్టోబరు 22: కృత్రిమమేధ (ఏఐ) సహాయంతో తప్పుడు సమాచారాన్ని, డీప్‌ఫేక్ ఆడియో, వీడియోలను రూపొందించి జనాల్ని మోసగిస్తున్న ఘటనలు పెరిగిపోతున్న దృష్ట్యా.. వాటి కట్టడికి కేంద్రం నడుంబిగించింది. ఈ మేరకు ఐటీ నిబంధనల చట్టం, 2021కి సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర ఐటీ శాఖ బుధవారం ముసాయిదాను విడుదల చేసింది. ఏఐ ద్వారా సృష్టిస్తున్న డీప్‌ఫేక్ వంటివి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి ప్రజలను మోసగిస్తున్నాయని, వ్యక్తులను అప్రతిష్ఠపాలు చేస్తున్నాయని, ఆర్థిక మోసాలకు కారణమవుతున్నాయని, ఎన్నికలను కూడా ప్రభావితం చేస్తున్నాయని ఐటీ శాఖ ఈ సందర్భంగా వెల్లడించింది. దీనిని నివారించటం కోసం ముసాయిదా ప్రతిపాదనలు తయారుచేశామని తెలిపింది. కనీసం 50లక్షల ఖాతాదారులున్న సోషల్ మీడియా సంస్థలు, ఇతర ప్లాట్‌ఫామ్స్‌కు ఈ నియంత్రణలు వర్తిస్తాయని పేర్కొంది. ఈ ముసాయిదా నిబంధనల ప్రకారం.. నిజమైన సమాచారంలాగే భ్రమింపజేసేలా అల్గారిథమ్ ఆధారంగా, కంప్యూటర్ ద్వారా తయారుచేసే కంటెంట్‌ను 'సింథటిక్‌లీ జెనరేటెడ్ కంటెంట్' (కృత్రిమంగా సృష్టించిన అంశాలు)గా పిలుస్తారు. ఈ తరహా కంటెంట్‌ను అప్‌లోడ్ చేసే వ్యక్తుల నుంచి ఇది కృత్రిమ కంటెంట్ అనే అంగీకారపత్రాన్ని సోషల్ మీడియా సంస్థలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక ఈ ఫేక్ ఆడియో, వీడియో సమాచారాన్ని వినియోగదారులు గుర్తించి జాగ్రత్తపడేలా.. వాటి మీద 'ఇది కృత్రిమ కంటెంట్' అనే హెచ్చరిక కనిపించాలి/వినిపించాలి. వీడియో అయితే.. అది కనిపించే తెర మీద 10 శాతం స్థలంలో ఈ హెచ్చరిక ఉండాలి. ఆడియో అయితే మొత్తం వ్యవధిలో తొలి 10 శాతం వ్యవధి మేర హెచ్చరిక వినిపిస్తూ ఉండాలి. కృత్రిమ కంటెంట్‌ను గుర్తించి, దానిపై నిర్దేశితస్థాయిలో హెచ్చరిక లేబుల్ ఉండేలా సోషల్ మీడియా సంస్థలు సాంకేతికపరంగా చర్యలు తీసుకోవాలి. ఈ ముసాయిదా ప్రతిపాదనలపై అభిప్రాయాల్ని, సూచనల్ని నవంబరు 6వ తేదీ వరకూ తమకు పంపించవచ్చని ఐటీ శాఖ ప్రజలకు పిలుపునిచ్చింది. కాగా, సైబర్‌మోసాల నుంచి వినియోగదారుల్ని రక్షించటానికి కొత్త యాంటీ స్కామ్ ఫీచర్లను ప్రవేశపెట్టినట్లు మెటా ప్రకటించింది.

# విదేశీ కార్మికులకు వీడిన 'కఫాలా' పీడ

▸ సౌదీలో వారి శ్రమదోపిడీకి స్వస్తి

▸ 1.3 కోట్ల మందికి తక్షణ ఊరట

రియాద్, అక్టోబరు 22: విదేశీ కార్మికులను తీవ్ర వివక్షకు, శ్రమదోపిడీకి గురిచేస్తున్న కఫాలా వ్యవస్థను సౌదీ అరేబియా ప్రభుత్వం రద్దుచేసింది. సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ రూపొందించిన విజన్-2030లో భాగంగా ఈ వ్యవస్థను తొలగించారు. భారత్, నేపాల్, బంగ్లాదేశ్ తదితర దక్షిణాసియా దేశాలకు, ఫిలిప్పైన్స్ వంటి ఆగ్నేయాసియా దేశాలకు చెందిన కార్మికులే సౌదీలో అత్యధికంగా పనిచేస్తున్నారు. ఈ నిర్ణయంతో దాదాపు 1.3 కోట్లమందికి కఠినమైన నిబంధనల నుంచి ఊరట లభించింది. స్పాన్సర్‌షిప్ ఆధారంగా విదేశీ కార్మికులను నియమించుకునే కఫాలా వ్యవస్థ 1950 నుంచి సౌదీలో అమల్లో ఉంది. గల్ఫ్ ఆయిల్ బూమ్ కాలంలో ఉబ్బడిముబ్బడిగా వచ్చిపడుతున్న విదేశీ కార్మికులను నియంత్రించడం కోసం ఈ వ్యవస్థను రూపొందించారు. కఫాలా అనే అరబిక్ పదానికి అర్థం స్పాన్సర్‌షిప్. ఈ విధానంలో ప్రతి విదేశీ కార్మికుడు స్థానిక స్పాన్సర్ అదుపాజ్ఞల్లో ఉండాలి. కఫీల్ అని పిలిచే ఈ స్పాన్సరే విదేశీ కార్మికుడి పని, నివాసం, చట్ట హోదా విషయంలో నిర్ణయాలు తీసుకుంటాడు. స్పాన్సర్లు తమ అదుపులోని కార్మికుల పాస్‌పోర్టులను తమ దగ్గర ఉంచుకోవడంతోపాటు వారికి భత్యాలను సకాలంలో చెల్లించేవారుకాదు. విదేశీ కార్మికుల కదలికలపై ఆంక్షలు విధించేవారు.

## యూకే విద్యార్థులకు ఫీజుల షాక్!

**ఇకపై ఏటా పెరుగుదల**

న్యూఢిల్లీ, అక్టోబరు 22: ఇంగ్లాండ్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఫీజుల షాక్ తగలనుంది. అక్కడి వర్సిటీలు ట్యూషన్ ఫీజులను ఇకపై ఏటా పెంచేందుకు సిద్ధమయ్యాయి. 2026 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించి, ఈ ఫీజులు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరుగుతాయని యూకే విద్యా కార్యదర్శి బ్రిడ్జెట్ ఫిలిప్‌సన్ తెలిపారు. ఈ నిర్ణయంతో కేవలం ట్యూషన్ ఫీజులే కాక, విద్యార్థులు జీవన వ్యయాల కోసం తీసుకునే మెయింటెనెన్స్ లోన్‌లు కూడా ప్రతి సంవత్సరం పెరుగుతాయి. ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో వార్షిక ట్యూషన్ ఫీజు 9,535 పౌండ్లుగా ఉంది.

# రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ డౌన్!

- సాంకేతిక సమస్యలతో మొరాయించిన ఆ శాఖ వెబ్‌సైట్
- నిలిచిపోయిన క్రయవిక్రయాలు
- స్లాట్ బుకింగ్, ఈసీ, చలానాల చెల్లింపుల్లో ఇబ్బందులు
- గంటల తరబడి ప్రజల అవస్థలు
- అధికారుల తీరుపై విమర్శలు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని అందించే శాఖల్లో ఒక్కటైన రిజిస్ట్రేషన్ శాఖలో రెండ్రోజులుగా అనేక సేవలు నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ మంగళవారం నుంచి మొరాయించింది. దీంతో చలానాలు కట్టేందుకు, ఈసీ తీసుకునేందుకు, మార్కెట్ విలువలు చూసుకునేందుకు, చివరికి స్లాట్ బుకింగ్‌కు కూడా వీలుపడడం లేదు. సర్వర్ సహకరించకపోవడంతో చిన్నచిన్న పనులకు కూడా ప్రజలు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. వెబ్‌సైట్ పనిచేయకపోవడం, సర్వర్ మొరాయించడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం ఆగిపోయే పరిస్థితి నెలకొంది. అయితే, సాంకేతిక సమస్యలను పరిష్కరించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాల్సిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తమకేం పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి.

ఒరాకిల్ సంస్థ 20 ఏళ్ల క్రితం రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ పనిచేస్తోంది. సాంకేతికంగా ఎన్నో మార్పులు జరిగినా వాటికి అనుగుణంగా ఈ వెబ్‌సైట్‌లో మార్పులు జరగలేదనే ఆరోపణలు ఉన్నాయి. మంగళవారం నుంచి వెబ్‌సైట్ మొరాయించగా బుధవారం సర్వర్ పూర్తిగా డౌన్ అయింది. దీంతో చలానాలు కట్టేందుకు క్యూలో ఉన్న వారు గంటల కొద్దీ నిరీక్షించారు. రాష్ట్రంలో సగటున ప్రతి రోజు 5వేల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. వీటన్నింటికీ చలానాలు తియ్యాల్సి ఉంటుంది. వందల మంది ఈసీలు డౌన్‌లోడ్ చేసుకుంటుంటారు. ఈసీ డేటా బ్యాకప్ రాకపోవడంతో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా చాలామందికి ఎదురుచూపులే మిగిలాయి. ఇక, స్లాట్ బుకింగ్‌కు కూడా వెబ్‌సైట్ సహకరించలేదు. మార్కెట్ విలువలు చూసుకోవాలన్నా వీలు కాని పరిస్థితి. రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌ను గత ఏడాది నగటున రోజుకి 5లక్షల మంది సందర్శించగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 10 లక్షల వరకు ఉందని అధికారులు చెబుతున్నారు. వెబ్‌సైట్ సందర్శించే వారి సంఖ్య రోజురోజుకి పెరుగుతున్నా.. ఆ ట్రాఫిక్‌కు అనుగుణంగా వెబ్‌సైట్ నిర్వహణ లేదనే విమర్శలు ఉన్నాయి. వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యల వల్ల రిజిస్ట్రేషన్ పత్రాల అప్‌లోడ్‌లో సమస్యలు తలెత్తుతున్నాయని, కొన్నిసార్లు ఒకే దస్త్రం రెండు, మూడుసార్లు అప్‌లోడ్ అవుతోందని, ఓటీపీలు రావడం లేదని, డిజిటల్ సంతకాలు అథంటికేషన్‌లోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. అలాగే, వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న పీడీఎఫ్ ఫైల్స్ కొన్నిసార్లు కరెప్ట్ అని వస్తున్నాయని అంటున్నారు. అయితే, ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు సర్వర్ సామర్థ్యం పెంచాలని, బ్యాకప్ సర్వర్లు ఏర్పాటు చేసుకోవాలని, రియల్ టైం మానిటరింగ్ సిస్టమ్ సమకూర్చుకోవాలని సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు.

## మత్స్యకార సొసైటీలకు ఎన్నికల జాప్యంపై
# కోర్టు ధిక్కరణ నోటీసులు

- 11కు విచారణ వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్య సహకార సొసైటీలకు సంబంధించిన ఎన్నికలు నిర్వహించడంలో జాప్యంపై చీఫ్ సెక్రటరీ, పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సహకారశాఖ ముఖ్యకార్యదర్శి, ఫిషరీస్ విభాగం ఎండీ, సహకార సొసైటీల కమిషనర్, మత్స్య సహకార సంఘాల ఫెడరేషన్ జనరల్ మేనేజర్ తదితరులకు హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. మత్స్య సహకార సొసైటీలకు ప్రభుత్వం సమర్పించిన తాత్కాలిక షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని.. ఒకవేళ వాయిదా వేయాల్సివచ్చినా మళ్లీ షెడ్యూల్ జారీచేసి త్వరగా ఎన్నికలు పెట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాలు ఇచ్చి రెండు నెలలు అవుతున్నా ఎన్నికలు పెట్టడం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది డీఎల్ పాండు హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టి జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ నవంబరు 11కు వాయిదా పడింది. మరోవైపు సీనియర్ నేషనల్స్, జూనియర్ నేషనల్స్ ఆల్ ఇండియా యూనివర్సిటీ స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో పాల్గొన్న క్రీడాకారులను కూడా 2 శాతం స్పోర్ట్స్ కోటాకు అర్హులుగా గుర్తించాలని హైకోర్టు టీజీపీఎస్సీకి స్పష్టం చేసింది. అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్నవారు మాత్రమే స్పోర్ట్స్ కోటాకు అర్హులు అని టీజీపీఎస్సీ నిబంధనలు విధించింది. దీనిని సవాల్ చేస్తూ 25 మంది క్రీడాకారులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల పట్ల వివక్ష చూపడం సరికాదని.. క్రీడాకారుల కోటా ప్రాముఖ్యాన్ని కమిషన్ సరిగా అర్థం చేసుకోలేదని పేర్కొంది. అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్నారా? లేదా ముఖ్యంకాదని.. నకిలీ సర్టిఫికెట్లు కాకుండా నిజమైన క్రీడాకారులకు అవకాశం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. క్రీడా ధ్రువీకరణ పత్రంతోపాటు వాటి నిజాయితీని నిరూపించేలా కాంపిటెంట్ అథారిటీ జారీచేసిన ధ్రువీకరణ పత్రం ఉండాలని పేర్కొంది. స్పోర్ట్స్ కోటా కింద పోస్టుల భర్తీకి పలు మార్గదర్శకాలు జారీచేసింది. ఈ మేరకు గ్రూప్-1 పోస్టుల్లో క్రీడల కోటా అభ్యర్థుల ఫలితాలు విడుదల చేయాలని పేర్కొంది.

# ఆస్ట్రేలియా వర్సిటీ ఆర్‌ఎంఐటీతో ఎల్‌వోఐ

**తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మారుస్తాం.. త్వరలోనే లైఫ్ సైన్సెస్ స్కూల్‌ను ప్రారంభిస్తాం**

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మహదేవపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. అందులో భాగంగానే అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్' గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లోని ప్రముఖ యూనివర్సిటీ 'ఆర్‌ఎంఐటీ'తో రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ)ను కుదుర్చుకుందని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్, పరిశోధన, అభివృద్ధి, ఉన్నత విద్య, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారానికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. రేపటి జీనోమ్ వ్యాలీకి ఇది ఒక బ్లూ ప్రింట్‌గా మార్గనిర్దేశం చేస్తుందన్నారు. ఆసియాలోనే అగ్రగామిగా ఎదిగిన తెలంగాణ 'లైఫ్ సైన్సెస్' ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 80 బిలియన్ డాలర్ల విలువ చేసే 2వేలకు పైగా జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ ఫార్మా, బయోటెక్ కంపెనీలు ఇక్కడ ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే ఔషధాల్లో మన వాటా 40 శాతంగా ఉందన్నారు. ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లలో మూడింట ఒక వంతును మనమే అందిస్తున్నామన్నారు. త్వరలోనే ప్రత్యేకంగా తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శ్రీధర్ బాబు సమక్షంలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈఓ శక్తి నాగప్పన్, ఆర్‌ఎంఐటీ యూనివర్సిటీ డిప్యూటీ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు చేశారు.



'ఒరికా' కంపెనీ ప్రతినిధులతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

### తెలంగాణలో ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ

కాగా, తెలంగాణలో 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ'ని ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యా సంస్థ విక్టోరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ) ముందుకొచ్చింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబుతో మెల్ బోర్న్‌లో బుధవారం వీఐటీ బోర్డు సభ్యుడు, ఆస్ట్రేలియా ప్రధాని సన్నిహితుడు అలన్ గ్రిఫిన్ భేటీ అయ్యారు. అలన్ గ్రిఫిన్ ప్రతిపాదనను ఆహ్వానించిన శ్రీధర్‌బాబు.. స్థల పరిశీలన, తదుపరి చర్చల కోసం తెలంగాణకు రావాలని ఆహ్వానించారు.

### మరిన్ని పెట్టుబడులతో రండి: 'ఒరికా'కు శ్రీధర్ బాబు ఆహ్వానం

దేశంలోనే పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజ సంస్థ 'ఒరికా' ప్రతినిధులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. 'ఆస్ బయోటెక్ 2025 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్'లో కీలకోపన్యాసం చేసేందుకు ఆస్ట్రేలియాకు వెళ్లిన ఆయనను కంపెనీ ప్రతినిధులు బుధవారం ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీధర్‌బాబు.. ఆ సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. సంజీవ్ గాంధీ మాట్లాడుతూ.. 'పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ, అమలు చేస్తున్న ప్రోత్సాహకర, ప్రగతిశీల విధానాలు అభినందనీయం. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని తెలిపారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో 10.30 కేజీల హైడ్రోఫోనిక్ గంజాయి పట్టివేత

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో రూ. 10 కోట్ల విలువైన హైడ్రోఫోనిక్ గంజాయిని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం దుబాయ్ నుంచి ఈకె358 విమానంలో హైదరాబాద్ వచ్చిన కోటల్ మహితల్ హసీబ్ అనే ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా దానిలో గంజాయి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని, 10.30 కేజీల హైడ్రోఫోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అతడు నేరాన్ని అంగీకరించగా.. తదుపరి విచారణ నిమిత్తం అధికారులు అతడిని కస్టమ్స్ కార్యాలయానికి తరలించారు. వారం క్రితం కూడా శంషాబాద్ విమానాశ్రయంలో హైడ్రోఫోనిక్ గంజాయి పట్టుబడిన విషయం తెలిసిందే.

## 'ఆపరేషన్ సిందూర్' వీరుల శౌర్యం గెజిట్‌లోకి

న్యూఢిల్లీ, అక్టోబరు 21: ఆపరేషన్ సిందూర్ సహా వివిధ సైనిక ఆపరేషన్లలో భారత రక్షణ సిబ్బంది వీరత్వానికి సంబంధించిన కథనాలను అధికారికంగా ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. విధి నిర్వహణలో భారత సైన్యం, వైమానిక సిబ్బంది ప్రదర్శించిన ధైర్యసాహసాలు, వారిలోని నాయకత్వ ప్రతిభను అందులో ప్రముఖంగా ప్రస్తావించింది.

## నీరజ్ చోప్రాకు లెఫ్టినెంట్ కల్నల్ హోదా

న్యూఢిల్లీ, అక్టోబరు 21: ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో భారత ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ హోదాను ఆయనకు ప్రదానం చేశారు. ప్రభుత్వ గెజిట్‌లో నమోదైన ఈ నియామకం ఏప్రిల్ 16 నుంచి అమల్లోకి వచ్చింది. 2016 ఆగస్టు 26న భారత సైన్యంలో నాయబ్ సుబేదార్‌గా నీరజ్ చేరారు. 2021లో మేజర్‌గా పదోన్నతి పొందారు. 2018లో అర్జున అవార్డు, 2021లో మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారం, 2022లో పరమ విశిష్ట సేవా పతకాన్ని అందుకున్నారు. ఇప్పుడు మేజర్ నుంచి లెఫ్టినెంట్ కల్నల్ హోదాకు పదోన్నతి పొందారు.

## టాయిలెట్ వినియోగించేందుకు నో...

- ట్రావెల్స్ సంస్థకు రూ.10వేలు జరిమానా
- బస్సు ప్రయాణికుడి పిటిషన్‌పై ఫోరం తీర్పు

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బస్సులో టాయిలెట్ కూడా ఉందని ప్రకటనలు గుప్పించి, ఆ తరువాత ప్రయాణికుడి వినియోగానికి అభ్యంతరం తెలిపిన ఓ ప్రైవేటు ట్రావెల్స్ సంస్థకు చెన్నైనార్త్ వినియోగదారుల ఫోరం రూ.10 వేలు జరిమానా విధించింది. తాను ఇటీవల కోయంబత్తూరు వెళ్లేందుకు ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలో టిక్కెట్ బుక్ చేసుకున్నానని, బస్సులోనే టాయిలెట్ కూడా ఉందన్న ఆ సంస్థ ప్రకటనను చూసే తాను దానిని ఎంపిక చేసుకున్నానని, కానీ ప్రయాణంలో మలవిసర్జన కోసం టాయిలెట్ వెళ్లేందుకు సిబ్బంది అంగీకరించలేదంటూ చెన్నైకి చెందిన సతీష్‌కుమార్ అనే వ్యక్తి వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. తప్పుడు ప్రకటనలతో ఆ ప్రైవేటు ట్రావెల్స్ సంస్థ తనను మోసగించిందని ఆరోపించారు. బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన వినియోగదారుల ఫోరం.. సదరు ప్రైవేటు ట్రావెల్స్ సంస్థకు రూ.10 వేలు జరిమానా విధించింది.



## సృష్టి ఫెర్టిలిటీ స్కామ్‌లో ఈడీ లోతైన విచారణ

- జైల్లో వారం పాటు నిందితుల విచారణకు ఈడీకి అనుమతి
- తొలిరోజు డాక్టర్ నమ్రత సహా ఆరుగురిని ప్రశ్నించిన ఈడీ

హైదరాబాద్, సైదాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) సృష్టి ఫెర్టిలిటీ స్కామ్‌కు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు లోతైన విచారణ ప్రారంభించారు. ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన 25మంది నిందితుల్లో కొందరిని ప్రశ్నించడానికి ఈడీ అధికారులు కోర్టు అనుమతి పొందారు. బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు చంచల్‌గూడ జైల్లో ఉన్న నిందితులను విచారించడానికి ఈడీకి కోర్టు అనుమతించింది. ఈ క్రమంలో ఈడీ అధికారులు బుధవారం చంచల్‌గూడ జైలుకు వెళ్లి డాక్టర్ నమ్రత, ఆమె కుమారుడు జయంత్ కృష్ణ, నందిని, సంతోషి, కల్యాణిలను వేర్వేరుగా ప్రశ్నించారు. ఇటీవల సృష్టి ఫెర్టిలిటీ స్కామ్‌కు సంబంధించి ఈడీ అధికారులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పది చోట్ల సోదాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర మెట్రో నగరాలైన కోల్‌కతా, బెంగళూరులో డాక్టర్ నమ్రత పటిష్టమైన నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. పదేళ్ల నుంచి డాక్టర్ నమ్రత పక్కా పథకం ప్రకారం ఫెర్టిలిటీ కేంద్రాలకు వచ్చిన వారిని నమ్మించి మోసాలకు పాల్పడుతోందని, శిశువుల క్రయవిక్రయాలకు సంబంధించిన ఆధారాలను ఈడీ అధికారులు సేకరించారు. డాక్టర్ నమ్రతతో పాటు మరికొందరిపై గోపాలపురం పోలీసులు నమోదు చేసిన కేసును తదుపరి దర్యాప్తు నిమిత్తం సిట్‌కు అప్పగించారు. ఆ తర్వాత మనీలాండరింగ్ కోణంలో విచారణ ప్రారంభించిన అధికారులు పలుచోట్ల సోదాలు నిర్వహించి డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.

## స్కూల్‌కు అని చెప్పి చర్చికి తీసుకెళ్లిన పాస్టర్

- విద్యార్థులతో ప్రార్థనలు.. కోడిగుడ్లతో భోజనం

వెల్దుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో సమావేశం ఉందని తల్లిదండ్రులకు చెప్పి.. దీపావళి పండుగ రోజున ఓ పాస్టర్ విద్యార్థులను చర్చికి తీసుకెళ్లిన ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. మెదక్ జిల్లా వెల్దుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం ఉందని శెట్టిపల్లికి చెందిన పలువురు విద్యార్థులను ఏసు అనే పాస్టర్ స్థానిక చర్చికి తీసుకెళ్లాడు. అక్కడ విద్యార్థులతో ప్రార్థనలు చేయించి కోడిగుడ్డుతో భోజనాన్ని తినిపించారు. అనంతరం ఆ వీడియోలను ఏసు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో.. ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు పంచాయితీ పెట్టించి క్షమాపణలు చెప్పించారు. ఘటనపై ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల ఫిర్యాదు మేరకు, వెల్దుర్తి ఎస్‌ఐ రాజు ఇరుపక్షాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. తప్పు ఒప్పుకున్న పాస్టర్.. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడనని మాటివ్వడంతో వివాదం సద్దుమణిగింది.

## బంగ్లాదేశ్‌లో సైనికాధికారులపై విచారణ

- 15 మందికి జైలు శిక్ష

ఢాకా, అక్టోబర్ 22: బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్(ఐసీటీ) బుధవారం సంచలన నిర్ణయం తీసుకుంది. మాజీ ప్రధాని షేక్ హసీనా పాలనలో బలవంతపు అదృశ్యాలు, హత్యలు, కస్టోడియల్ చిత్రహింసలకు పాల్పడ్డారన్న అభియోగాలతో 15మంది ఆర్మీ అధికారులను జైలుకు తరలించాలని ఆదేశించింది. మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో అక్టోబర్ 11న ఆర్మీ వారిని కస్టడీలోకి తీసుకోగా.. బుధవారం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ట్రైబ్యునల్ ముందు హాజరు పరిచింది. వీరి బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన ట్రైబ్యునల్.. విచారణను వచ్చేనెల 5కు వాయిదా వేసింది. విచారణ అనంతరం వారిని సైనిక కంటోన్మెంట్‌లో ఉన్న తాత్కాలిక సబ్ జైలుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. అయితే, సొంత అధికారుల్ని అరెస్ట్ చేయడం పట్ల బంగ్లా సైన్యం అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. సైనిక చట్టాల ప్రకారం కాకుండా.. 1971 విమోచన యుద్ధ నేరాలను విచారించడానికి షేక్ హసీనా ప్రభుత్వం రూపొందించిన ఐసీటీ బీడీ చట్టాల కింద విచారణ జరపడం సాయుధ దళాల మనోధైర్యాన్ని ప్రభావితం చేస్తుందని పలువురు మాజీ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

## తదుపరి దర్యాప్తునకు ఆదేశించండి

- వివేకాహత్య కేసులో సీబీఐ కోర్టులో సునీతారెడ్డి పిటిషన్

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో మరింత లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని.. తదుపరి దర్యాప్తు చేపట్టే విధంగా సీబీఐకి ఆదేశాలు జారీచేయాలంటూ నర్రెడ్డి సునీతారెడ్డి హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. తదుపరి దర్యాప్తు కావాలనుకుంటే ట్రయల్ కోర్టులోనే పిటిషన్ దాఖలు చేసుకోవాలని ఇటీవల సుప్రీంకోర్టు సునీతారెడ్డికి సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమె తాజాగా సీబీఐ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో లోతైన దర్యాప్తు జరగకపోతే అసలు వ్యక్తులు తప్పించుకునే ప్రమాదం ఉందని.. ఇప్పటికే తండ్రిని కోల్పోయిన తనకు మరింత అన్యాయం జరుగుతుందని తన పిటిషన్‌లో ఆమె అభ్యర్థించారు. సప్లిమెంటరీ చార్జిషీటు దాఖలుచేయాలని సీబీఐని ఆదేశించాలని కోరారు. ఈ కేసులో 5వ నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డి కడప జైల్లో 4వ నిందితుడు దస్తగిరిని (అప్రూవర్) కలిసి ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేశారని, దీనిపై దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు తెలుస్తాయని పిటిషన్‌లో కోరారు. సాక్షులను ప్రభావితం చేయడానికి చాలా ప్రయత్నాలు జరిగాయని స్వయంగా సీబీఐ, ఏపీ పోలీసులు సుప్రీంకోర్టుకు తెలిపారని సునీత పేర్కొన్నారు. వివేకా హత్యపై మొదట ఫిర్యాదు చేసిన పీఏ ఎంవీ కృష్ణారెడ్డి తనపైనా, తన భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అప్పటి సీబీఐ దర్యాప్తు అధికారి రాంసింగ్‌పైనా కేసు పెట్టారని, అయితే ఇది తప్పుడు కేసు అని ఏపీ పోలీసులు తుది నివేదికలో తేల్చారని ఆ పిటిషన్‌లో సునీత పేర్కొన్నారు.



ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

## 38 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

- పేట్‌బషీరాబాద్‌లోని భూమి చుట్టూ ఫెన్సింగ్
- ఇది 2008లో జర్నలిస్టులకు కేటాయించిన స్థలం

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్‌బషీరాబాద్‌లో 38 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా హైడ్రా కాపాడి.. చుట్టూ ఫెన్సింగ్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం 2008లో ఈ భూమిని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి కేటాయించింది. అయితే దీనిపై కొంత మంది కోర్టుకు వెళ్లడంతో జర్నలిస్టులకు ప్లాట్ల పంపిణీ నిలిచిపోయింది. ప్రభుత్వం ఈ భూమిని హెచ్‌ఎండీఏ ఆధీనంలో ఉంచింది. ఇదిలా ఉండగా ఈ భూమిలో ఆక్రమణలు జరుగుతున్నాయని సొసైటీ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో ఆ విభాగంతో పాటు రెవెన్యూ, మునిసిపల్, హెచ్‌ఎండీఏ అధికారులు కలిసి పరిశీలించారు. అక్కడ ఆక్రమణలు జరిగినట్లు, ఇప్పటికే కొంతమంది ఇళ్లు కట్టుకుని ఉన్నట్లు గుర్తించారు. ఇళ్ల జోలికి వెళ్లకుండా, ఖాళీగా ఉన్న భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయించారు. దీనిపై కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేయగా కోర్టు తీర్పు ప్రకారం స్థలం కేటాయింపులు జరుగుతాయని, ఈలోగా ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని హైడ్రా స్పష్టం చేసింది. ఆ స్థలంలో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారితో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలిస్తామని రంగనాథ్ తెలిపారు.

## శ్రీశైలం ప్రాజెక్టును ఖాళీ చేయొద్దు!

- విద్యుదుత్పాదన నిలిపివేయాలని ఏపీని కోరనున్న తెలంగాణ

హైదరాబాద్/నాగార్జునసాగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలను కాపాడాలని, దీనికోసం కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్పాదనను నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టులో నీటి మట్టం కొనసాగించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వంతో పాటు తెలంగాణ, ఏపీ జెన్‌కోలకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయనుంది. ఈ ఏడాది శ్రీశైలం ప్రాజెక్టుకు 2200 టీఎంసీలకు పైగా గరిష్ఠ వరద వచ్చింది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 194.76 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇక బుధవారం ప్రాజెక్టుకు 23 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... ఔట్ ఫ్లో 43 వేల క్యూసెక్కులుగా రికార్డయింది. ఇక నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నిల్వ 312.05 టీఎంసీలు కాగా... ప్రాజెక్టులో 305.86 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 36 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అంతే ఔట్‌ఫ్లో ఉంది. శ్రీశైలంలో 21 టీఎంసీల మేర, సాగర్‌లో మరో 6.19 టీఎంసీల మేర నిల్వ చేసుకునే అవకాశాలున్నా.. జలవిద్యుత్ ఉత్పాదనతో నీరంతా సముద్రంలోకి వృథాగా పోతుండటంతో దీన్ని అడ్డుకునే యత్నాలను ప్రభుత్వం ప్రారంభించింది. కాగా, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి జరిగింది. సంవత్సర కాలానికి పెట్టుకున్న లక్ష్యాన్ని కేవలం 3నెలల్లో చేరుకున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. 2025-26 సంవత్సరానికి 70మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని మంగళవారం నాటికే చేరుకోవడంతో ఇంజనీర్లు బుధవారం జెన్‌కో ఆఫీసులో కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ ఏడాది జూలై 21న విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించామని అధికారులు తెలిపారు.

## జగన్ మా భూములు లాక్కున్నారు

- న్యాయపరమైన చిక్కుల్లో పడేశారు
- ఇప్పుడు ఏపీలో పెట్టుబడి పెట్టడం సాధ్యమా?
- పారిశ్రామికవేత్త శ్రావణ్‌కుమార్ ఆవేదన

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ వేదికగా మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనా విధ్వంసం బహిర్గతమైంది. బుధవారం మంత్రి లోకేశ్ పాల్గొన్న బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో శ్రావణ్‌కుమార్ అనే పారిశ్రామికవేత్త జగన్ హయాంలో తాము పడిన బాధలు వెల్లడించారు. తమ భూములు లాక్కున్నారని.. న్యాయపరమైన చిక్కులు కల్పించారని తెలిపారు. రాజకీయంగానూ దాడి చేశారని.. గత పాలకుల వేధింపుల కారణంగా చివరకు తన తండ్రిని కూడా కోల్పోయానని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో మళ్లీ పెట్టుబడులు పెట్టడం సాధ్యమేనా?అని ప్రశ్నించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. జగన్ ఇలాంటి విధ్వంస పాలన సాగించినందునే గత ఎన్నికల్లో 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు పారిశ్రామిక ప్రోత్సాహక విధానం అమల్లో ఉందని.. పెట్టుబడులకు స్నేహపూర్వకంగా ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు రావాలని శ్రావణ్‌కుమార్ సహా పెట్టుబడిదారులను ఆహ్వానించారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

# ఐరన్‌లేడీ నీడలో జపాన్

జపాన్‌లో చీటికీమాటికీ ప్రధానులు ఎందుకు దిగిపోతారన్నది వేరే చర్చ కానీ, మంగళవారం ఆ దేశం తన తొలి మహిళా ప్రధానిని ఎన్నుకొని చరిత్ర సృష్టించింది. పురుషాధిక్య రాజకీయాలకు మారుపేరైన జపాన్‌లో నూటముగ్గురు పురుష ప్రధానుల తరువాత, సనే తకైచీకి గద్దె నెక్కే అవకాశం దక్కింది. ఆ దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడూ, అధికార పార్టీ ఎల్‌డీపీ గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్న స్థితిలోనూ ఈమె చేతిలో అధికారం పెట్టి తోటివారంతా అద్భుతాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవలివరకూ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా నేతృత్వంలో ఆ పార్టీ ఎగువసభ ఎన్నికల్లో ఘోరపరాజయం చవిచూడడంతో, ఉభయసభల్లోనూ బలం మరింత క్షీణించింది. ఏడాదిమాత్రమే పదవిలో కొనసాగిన ఆయన విధిలేక రాజీనామా చేయడంతో ఈ రక్షకురాలు కావలసివచ్చింది. ఈ నెలారంభంలో అనేకమంది దిగ్గజాలను ఓడించి ఎల్‌డీపీ నేతగా ఆమె ఎన్నిక కావడమే నిజానికి ఒక చరిత్ర. ఐదేళ్ళలో నాలుగోప్రధానిగా ప్రజలముందుకు వచ్చిన అరవైనాలుగేళ్ళ ఈ అతివాద నాయకురాలు రాజకీయంగానూ, ఆర్థికంగానూ చేయాల్సింది చాలా ఉంది.

ఎన్నికల సంస్కరణలకు సంబంధించి తలెత్తిన వివాదంతో ఎల్‌డీపీకి సుదీర్ఘకాలంగా మద్దతు ఇస్తున్న కొమిటో పార్టీ భాగస్వామ్యం నుంచి తప్పుకోవడంతో ఇప్పుడు కొత్త ప్రధాని మరో మితవాద పార్టీని భాగస్వామిగా తెచ్చుకొని పార్లమెంట్‌లో స్వల్పమెజారిటీతో గట్టెక్కేశారు. మాజీ ప్రధాని షింజో అబే ఆర్థికవిధానాలను సమర్థించే ఈ మాజీ ఆర్థికమంత్రికి ఐరన్‌లేడీగా ప్రజల్లో గుర్తింపు ఉంది. ప్రభుత్వం తన భారీ వ్యయంతో పారిశ్రామికవేత్తలకు అండగా నిలవాలనే ఈమె బ్యాంక్ ఆఫ్ జపాన్‌ను పిసినారిగా తరచూ ఆడిపోసుకొనేవారట. ఆమె అనుసరించబోయే ఆర్థికవిధానాలు ఏమిటన్నవి సుస్పష్టం. తదనుగుణంగానే ఆమె తానుమెచ్చిన మరో మహిళను ఆర్థికమంత్రిగా తెచ్చిపెట్టుకుంటారన్నదీ నిజమే అయింది. అయితే, పరమ ఛాందస జపాన్ సమాజంలో మహిళల హక్కులు, వారి నెలసరి సమస్యల గురించి కూడా బహిరంగంగా మాట్లాడే ఈ మహిళా ప్రధాని తన మంత్రివర్గంలో పెద్దసంఖ్యలో మహిళలకు స్థానం కల్పిస్తారన్న ఆశలు మాత్రం తలకిందులైనాయి. ఇరవైమంది మంత్రివర్గంలో ఆమె ఇద్దరికి మాత్రమే చోటిచ్చారు. దీంతో ఆమె మహిళా పక్షపాతి కాదంటూ గతంలో చేసిన కొన్ని వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో మళ్ళీ చక్కర్లు కొట్టడం ఆరంభించాయి. మగాళ్ళు గుర్రాల్లా కష్టపడి సంపాదించాలనీ, ఆడవాళ్ళు వారికి వెన్నుదన్నుగా నిలవాలనీ, అలాగే, పెళ్ళయిన జంట ఒకే ఇంటిపేరుతో వ్యవహరించాలనే వాదనలు చేసే ఈమె నుంచి విప్లవాలు ఆశించలేమని కొందరు విమర్శలు చేస్తున్నారు. మహిళల్లో కంటే పురుషుల్లోనే అధిక క్రేజ్ ఉన్నందున, స్త్రీ పక్షపాతిగా కనిపించి పార్టీలోని మిగతా నాయకులను, జపాన్ పురుషాధిక్య సమాజాన్ని ఆమె ఇబ్బంది పెట్టదల్చుకోలేదేమో. ఒక స్త్రీ ఈ అత్యున్నత స్థానాన్ని అధిరోహించడానికి 120 సంవత్సరాలు పట్టిన చోట, ఆమె పార్టీ సైతం మహిళాప్రాతినిధ్యాన్ని వెనకపట్టుపట్టించిన స్థితిలో తక్షణ పరిష్కారాలు అసాధ్యం.

అంతర్గత వైరాలు, ఆధిపత్యపోరుతో సతమతమవుతున్న ఆమె పార్టీ ఒక్కటిగా లేదు. ప్రజలు కూడా ఎల్‌డీపీ పట్ల సానుకూలంగా లేరు. జపాన్ గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్న స్థితిలో, దేశీయంగా కొత్త ప్రధాని చేపట్టబోయే సంస్కరణలతో పాటు, అమెరికా అధ్యక్షుడి కరుణాకటాక్షాలు కూడా ఎంతో ముఖ్యం. పేరుకు మిత్రదేశమే అయినప్పటికీ, భారీ సుంకాలతో డోనాల్డ్ ట్రంప్ జపాన్‌మీద కూడా కక్షతీర్చుకున్నారు. తదనంతరం వాణిజ్య ఒప్పందం కుదిరినప్పటికీ, ట్రంప్ ఒత్తిడిమేరకు దిగుమతులు కూడా పెంచుకున్న జపాన్ ఎగుమతులు పడిపోయి కుదేలైంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంలో భాగంగా, ట్రంప్ తనకు నచ్చిన చోట ఖర్చుచేయగలిగేందుకు వీలుగా ప్రభుత్వనిధుల్లో 550 బిలియన్ డాలర్లు పెట్టుబడిపెట్టేందుకు జపాన్ గతంలో అవగాహన కుదర్చుకుందట. ఈ నెలాఖరులో జపాన్ వస్తున్న ట్రంప్ ఆ విషయాన్ని గుర్తుచేయవచ్చు. వ్యక్తిగత స్నేహాలే దౌత్య సంబంధాలను నిర్ణయించే ట్రంప్ వైఖరి కొత్త ప్రధానికి తెలియనిదేమీ కాదు. ఈనెలారంభంలో ఆమె ఎల్‌డీపీ నేతగా ఎన్నికకాగానే జపాన్ నుంచి శుభవార్త అందింది అంటూ తనలాగానే మరో మితవాది మిత్రదేశానికి నాయకత్వం వహిస్తున్నందుకు ట్రంప్ సంతోషించారు. ఆమె ఎంతో తెలివైనదనీ, గౌరవనీయురాలనీ ప్రశంసించారు. ఎంతోకాలంగా ఆశిస్తున్న ప్రధాని స్థానాన్ని మూడోప్రయత్నంలో కానీ దక్కించుకోలేకపోయిన తకైచీని ట్రంప్ సైతం ఇబ్బందిపెట్టకపోవచ్చు.

# స్మార్ట్ ఫోన్ల శకం ముగిసిపోతుందా!?

చార్లెస్ డార్విన్ వివరించిన సహజ పరిణామ ఎంపిక (Natural Selection) థియరీ ఇప్పటి మన ఆధునిక జీవితాలకూ వర్తిస్తుంది. ఆ థియరీ ప్రకారం– భూమిపై బలం కలిగిన లేదా అత్యంత తెలివైన జీవజాతులే శాశ్వతంగా కొనసాగుతాయని చెప్పలేం. మార్పులను అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా మారిన జీవజాతులే మనుగడను కొనసాగిస్తాయి. దీన్నే అడాప్టేషన్ అంటారు. ఇది జీవజాతులకే గాక, మనుషులు సృష్టించిన టెక్నాలజీలకు కూడా వర్తిస్తుంది. టెక్నాలజీలో ఊహించనంత వేగంగా చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా స్మార్ట్ ఫోన్ శకం కూడా త్వరలో ముగుస్తుంది అంటున్నారు నిపుణులు.

అంటే ఇప్పటికిప్పుడు స్మార్ట్ ఫోన్లు మాయమైపోతాయని కాదు. ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది సమాచార వినిమయంతో పాటు చెల్లింపులు, ఉద్యోగం, వినోదాల కోసం స్మార్ట్ ఫోన్ల పైనే ఆధారపడుతున్నారు. కానీ కొంతమంది వ్యాఖ్యాతల అంచనాల ప్రకారం డెస్క్‌టాప్ పీసీల స్థానాన్ని ల్యాప్‌టాప్‌లు ఆక్రమించినట్టే స్మార్ట్ ఫోన్లను ఇంకో అత్యాధునిక టెక్నాలజీ మింగేస్తుందని అంటున్నారు. ఈ టెక్నాలజీ ఏదైనా కావచ్చు.



చేతులకు, తలకు అమర్చుకునే పరికరాలు (వేరబుల్స్) కావచ్చు. యాపిల్, మెటా వంటి కంపెనీలు ఇప్పటికే కొన్ని స్మార్ట్ కళ్లజోళ్లు తయారు చేస్తుండగా, ఇంకొన్ని కంపెనీలు కాంటాక్ట్ లెన్సుల్లోనే కంప్యూటర్ స్క్రీన్లను చేరుస్తున్నాయి. కాలక్రమంలో మొబైల్స్‌పై ఆధారపడటాన్ని కృత్రిమ మేధతో పనిచేసే ఇయర్ ఫోన్స్ తగ్గించవచ్చునని అంచనా. ఇలాంటివి కాకపోతే, గొంతు విని పనిచేసే కృత్రిమ మేధ సహాయకులు (ఏఐ అసిస్టెంట్లు) కూడా స్మార్ట్ ఫోన్లకు ప్రత్యామ్నాయాలు కావచ్చు. చాట్ జీపీటీ వంటి వాటిని ఇప్పటికే వేరబుల్స్‌లో చేర్చారు. ఇది టచ్ స్క్రీన్ల స్థానంలో మాటలతో పనిచేసే కంప్యూటింగ్ వ్యవస్థకు దారి తీయవచ్చు. ఫోన్లు చేసే అనేకానేక పనులను ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) కళ్లజోళ్లు చక్కబెట్టేస్తాయి. అది నావిగేషన్ కావచ్చు, కాల్స్ కావచ్చు, బ్రౌజింగ్ కావచ్చు. ఇవేగాక, ప్రస్తుతం పరిశోధన దశలో ఉన్న న్యూరాలింక్ ప్రాజెక్టు వంటివి కంప్యూటర్లను నేరుగా మన మెదడుకు అనుసంధానించే ప్రయత్నం చేస్తున్నాయి. అంటే మెదడుతో ఆలోచించగానే పనులైపోతాయన్నమాట!

స్మార్ట్ ఫోన్లు పూర్తిగా కనుమరుగయ్యేందుకు ఎంత సమయం పడుతుందన్న విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొంతమంది ఐదు నుంచి పదేళ్లని అంచనా వేస్తుంటే... ఇంకొంతమంది స్మార్ట్ ఫోన్ల వాడకం కొనసాగుతుందని, కాకపోతే ఏఆర్, ఏఐ పరికరాల కారణంగా వాటిపై నిత్యం ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని అంటున్నారు. పదీ ఇరవై ఏళ్ల కాలంలో స్మార్ట్ ఫోన్ల స్థానంలో ఏఐ ఆధారిత కళ్లజోళ్లు, ఇయర్‌బడ్స్, వాయిస్ అసిస్టెంట్లు చేరతాయని, ఐపాడ్‌లు, ల్యాండ్‌లైన్ ఫోన్ల మాదిరిగా అప్పటికి స్మార్ట్‌ఫోన్లు అవశేషాలుగా మిగిలిపోతాయని మరికొంతమంది అంచనా. స్మార్ట్ ఫోన్లు కనిపించకుండా పోయే ముందు ఏఆర్, బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్ఫేస్ వంటి టెక్నాలజీలు సామాన్యుడికి కూడా అందుబాటులోకి రావాల్సిన అవసరముందని, క్వాంటమ్ ప్రాసెసింగ్, 5జీ/ 6జీ+, అతిసూక్ష్మమైన బ్యాటరీల వంటి టెక్నాలజీలు పరిపక్వమయ్యేందుకు రెండు మూడు దశాబ్దాలు పట్టవచ్చు అన్నది కూడా ఒక దీర్ఘకాలిక అంచనా.




స్మార్ట్ ఫోన్ల ఆధిపత్యం 2030ల వరకూ కొనసాగే అవకాశం ఉంది. ఏఐ, ఏఆర్ టెక్నాలజీలు కలిసిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తులో స్మార్ట్ ఫోన్ అనేది బ్యాకప్ కోసం పనికొచ్చే ఒక పరికరంగా మిగిలిపోవచ్చు. 2040 నాటికి ప్రజలు దైనందిన జీవితాల్లోంచి స్మార్ట్ ఫోన్లు క్రమంగా తొలగిపోతాయని నిపుణుల అంచనా.

ప్రస్తుతం ఈ దిశగా కంపెనీలు ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నాయన్నది కూడా ఆసక్తికరమైన అంశం. యాపిల్ స్పేషియల్ కంప్యూటింగ్‌పై ఆశలు పెట్టుకుంది. దీని ద్వారా పది – పదిహేనేళ్ళల్లో ఐఫోన్ల నుంచి వినియోగదారులు దూరం జరిగేలా చేయవచ్చునంటోంది. మెటా, గూగుల్, శాంసంగ్ వంటి కంపెనీలు ఏఆర్ వేరబుల్స్ సాయంతో స్మార్ట్ ఫోన్లు లేని ప్రపంచాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నాయి. హ్యూమేన్ కంపెనీ తయారు చేసిన 'ఏఐ పిన్', 'రాబిట్ ఆర్ 1'లు స్మార్ట్ ఫోన్‌కు ప్రత్యామ్నాయాలుగా ఎలా ఉంటాయన్న విషయంపై ప్రయోగాలు జరుగుతున్నాయి. మరోవైపు టెలికామ్ సంస్థలు 2030 నాటికి ఏఆర్, వీఆర్, ఏఐ వ్యవస్థలకు అవసరమైన 6జీ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నాయి.

ప్రస్తుతానికి స్మార్ట్ ఫోన్ల ఆధిపత్యం 2030ల వరకూ కొనసాగే అవకాశం ఉంది. ఏఐ, ఏఆర్ టెక్నాలజీలు కలిసిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తులో స్మార్ట్ ఫోన్ అనేది బ్యాకప్ కోసం పనికొచ్చే ఒక పరికరంగా మిగిలిపోవచ్చు. 2040 నాటికి ప్రజలు దైనందిన జీవితాల్లోంచి స్మార్ట్ ఫోన్లు క్రమంగా తొలగిపోతాయని నిపుణుల అంచనా.

స్మార్ట్ ఫోన్లు కనుమరుగవటం వల్ల లాభనష్టాలు రెండూ ఉన్నాయి. ముందు లాభాలేమిటో చూద్దాం. చిన్న చిన్న స్క్రీన్ల అవసరం లేకుండా పోతుంది. ఏఆర్ కళ్లజోళ్లు, ఏఐ వాయిస్, యాంబియంట్ కంప్యూటింగ్‌ల కారణంగా అంతా సహజంగా జరిగిపోతుంది. స్మార్ట్ ఫోన్లతో ఇప్పుడున్న అనేక సమస్యలు లేకుండా పోతాయి. ఏఐ, ఏఆర్, వేరబుల్స్, బ్రెయిన్ కంప్యూటింగ్ టెక్నాలజీలు కేంద్రంగా కొత్త కొత్త పరిశ్రమలు పుట్టుకొస్తాయి. స్మార్ట్ ఫోన్ల స్థానంలో పునర్వినియోగం చేయగల ఏఆర్ కళ్లజోళ్ల వంటివి వస్తే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు లేకుండా పోతాయి. ఇక నష్టాలేమిటంటే– ఏఐ, ఏఆర్, వేరబుల్స్ వ్యక్తిగత వివరాలపై మరింత ఎక్కువ దృష్టి పెట్టే ప్రమాదం ఉంది. దైనందిన వ్యవహారాల రికార్డింగ్, ట్రాకింగ్‌లతోపాటు మన సంభాషణలను వినే అవకాశాలుంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ కొత్త టెక్నాలజీలను అందుకోలేని పరిస్థితి ఏర్పడితే సామాజిక అంతరాలు మరింత పెరుగుతాయి.

మరి ఫోన్ తయారీ కంపెనీల పరిస్థితి? ఫాక్స్‌కాన్, పెగట్రాన్, శాంసంగ్ వంటి స్మార్ట్ ఫోన్ తయారీ సంస్థలు చైనా, వియత్నాం, భారత్‌లలో కొన్ని లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. స్మార్ట్ ఫోన్లు అన్నవే లేకపోతే ఈ ఫ్యాక్టరీలన్నీ ఏఆర్ కళ్లజోళ్లు, వేరబుల్స్, సూక్ష్మ లేదా ఇంటర్నెట్ ఆధారిత పరికరాల తయారీవైపు మళ్లాల్సి వస్తుంది. తొలినాళ్లలో కొంతమంది ఉద్యోగాలు కోల్పోయినా వారిని ఏఆర్, ఇతర పరికరాల తయారీలో భాగస్వాములను చేయవచ్చు. ఫోన్లకు అవసరమైన బ్యాటరీలు, డిస్‌ప్లే యూనిట్లు, చిప్‌సెట్లు తయారు చేసే కంపెనీలు సూక్ష్మస్థాయి పరికరాల తయారీని అలవాటు చేసుకుంటాయి. స్మార్ట్ ఫోన్లు లేని ప్రపంచంలో అప్లికేషన్లు (యాప్స్) ఉంటాయి కానీ ఇప్పుడున్న రూపంలో కాదు. చాట్ ఆధారంగా, సంజ్ఞల ఆధారంగా, గొంతు ఆధారంగా పనిచేసే అప్లికేషన్లు అందుబాటులోకి వస్తాయి. నైపుణ్యాలను మరింత పెంచుకుంటేనే ఉద్యోగాలు ఉంటాయన్నమాట.

ఇంకోలా చెప్పాలంటే ఉద్యోగాలు లేకుండా పోవు కానీ, వాటి తీరుతెన్నులు మారతాయి. కొన్నేళ్ల క్రితం ఉన్న వెబ్ డిజైనర్లు ఇప్పుడు స్మార్ట్ అప్లికేషన్ల తయారీకి మళ్లినట్టు. 2007లో అందుబాటులోకి వచ్చిన ఇంటర్నెట్ ఆధారిత స్మార్ట్ ఫోన్లు మన తరం ముగియక ముందు అంతరించిపోవడం విషాదమేమీ కాదు. మరో అత్యాధునిక సాంకేతికత వైపు ప్రపంచం దూసుకెళ్తున్నందుకు సంతోషించాలి. టెక్నాలజీలో కూడా పరిణామ క్రమాలు ఉంటాయి. అందిపుచ్చుకుంటే ముందుకెళ్తాం. లేకపోతే ఉన్న దగ్గరే నిలిచిపోతాం!

■ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి

# హమాస్ దుర్మార్గం! ఇజ్రాయెల్ అమానుషం!!

అక్టోబర్ 7, 2023న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి, నాజీ పాలన తర్వాత జరిగిన అతి పెద్ద మానవ ఊచకోత. ఈ దాడి ప్రధానంగా జరిగింది మిలిటరీ మీద కాదు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం చనిపోయిన వారిలో సుమారు 850మంది పౌరులు ఉండగా 350మంది మిలిటరీ పోలీసులు ఉన్నారు. ఈ దాడిలో సేఫ్ హౌస్‌లో దాక్కోడానికి ప్రయత్నించిన సాధారణ పౌరులను– వారు పిల్లలా, వృద్ధులా అన్నదానితో సంబంధం లేకుండా– మంటల్లో తగలబెట్టారని ఐక్యరాజ్యసమితి నిర్ధారించింది. లూటీలు జరిగాయని, తలలు నరికివేయడం కూడా జరిగిందని ఆ నివేదిక తేల్చిచెప్పింది. అంతేగాక సెక్సువల్ వయొలెన్స్ మీద ఐరాస సెక్రెటరీ జనరల్ జరిపిన ప్రత్యేక పరిశోధనలో కిబ్బుట్జ్ ప్రాంతంలో రేప్‌లు, గ్యాంగ్ రేప్‌లు జరిగాయని తేలింది. ఎన్నోచోట్ల స్త్రీల అర్ధనగ్న, నగ్న దేహాలు పడివున్నాయని, మర్మాంగాల ఛేదనం జరిగిందని ఆ ఐరాస బృందం కనుగొన్నది. ఈ బృందం సుమారు 5000 ఫొటోలు, 50 గంటల నిడివి ఉన్న ట్రాఫిక్ కెమెరాలతో సహా అన్ని రకాల ఆడియో, వీడియో ఫైళ్లనూ పరిశీలించి, ప్రత్యక్ష సాక్షులను విచారించి ఈ నివేదికను రూపొందించింది.

'హమాస్' అనే పేరు 'హరఖత్ అల్ ముఖవా అల్ ఇస్లామియా' అన్న పూర్తి పేరుకు క్లుప్తపదం. దీనికి అర్థం 'ఇస్లామిక్ ప్రతిఘటన ఉద్యమం' అని. ఈ సంస్థ ఫండమెంటల్ స్వభావం కలిగినది. యాసర్ అరాఫత్ నాయకత్వంలో పాలస్తీనా విమోచన ఉద్యమంలో భాగంగా ఏర్పడిన పార్టీ 'ఫతా'. ఈ ఫతా పార్టీ పాలస్తీనాలోని వెస్ట్ బ్యాంక్‌ను పాలిస్తుంది. ఫతా పార్టీ ఆదర్శం ఒక సర్వసత్తాక, గణతంత్ర, లౌకిక పాలస్తీనాను ఏర్పరచడం. అయితే హమాస్ భావజాలం అందుకు భిన్నమైనది. కేవలం ఇస్లాం మత సౌభ్రాతృత్వంతో కూడిన పాలస్తీనాను ఏర్పరచడమే దాని ఆదర్శం. ఆ సంస్థ 1988లో తన శాసనావళిలో స్పష్టంగా– ఇజ్రాయెల్‌ను తుడిచిపెట్టేసి జోర్డాన్ నది నుంచి మధ్యధరా సముద్రం దాకా పాలస్తీనా 'ఇస్లామిక్ సామ్రాజ్యాన్ని' ఏర్పరచడం తన ఆదర్శమని రాసుకున్నది. హమాస్ ఇంతటి స్పష్టమైన ఉద్దేశంతో ఏర్పడటంతో సహజంగానే ఇజ్రాయెల్‌లో దీనిపట్ల అప్రమత్తత నెలకొన్నది. 2007 ఎన్నికల్లో ఫతా పార్టీని హమాస్ గాజాలో ఓడించింది (132 సీట్లకు గాను 74 సీట్లు గెలుచుకుంది). ఆ తర్వాత ఫతా సంస్థపై దాడులు, హత్యలు, చిత్రహింసలతో విరుచుకుపడింది. చివరకు ఆ ప్రాంతంలో తానే ఏకైక పార్టీగా మిగిలి, అధికారం చెలాయిస్తూ వచ్చింది. మిలిటరీ హత్యాకాండను నమ్ముతూ, తమను రూపుమాపే లక్ష్యంతో ఉన్న హమాస్ అధికారంలోకి రావటంతో సహజంగానే ఇజ్రాయెల్ 2007 తర్వాత గాజా చుట్టూ ఒక పూర్తి నిర్బంధ స్థితిని తీసుకువచ్చింది. అంతవరకు అమెరికా, యూరోప్‌ల నుంచి మిలియన్ డాలర్లలో అందే ఆర్థిక సహాయం కూడా నిలిచిపోయింది.

హమాస్ ఒక విముక్తి పోరాట సంస్థ అని చెప్పే వాళ్ళకు విప్లవం ఎలా ఉంటుందో తెలియకపోయి ఉండాలి, లేదా అది 'ఫాల్స్ గ్లోరిఫికేషన్' ద్వారా సమర్థించడం అయినా అయి ఉండాలి. మన దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ పార్లమెంట్‌లో బాంబులు వేసాడు గాని, వెళ్ళి బ్రిటిష్ కుటుంబంలో చిన్నపిల్లల మీద, ఇంట్లో స్త్రీల మీద బాంబు వేయలేదు. మన దేశంలో మిలిటరీ విముక్తి పోరాటం చేస్తోందని చెప్పుకునే అతి పెద్ద సాయుధ పోరాట మావోయిస్ట్ సంస్థ కూడా ఇందులో కనీసం ఒకటవ వంతు హత్యాకాండకు కూడా పాల్పడలేదు. కేవలం మిలిటరీ పైన, పోలీసుల పైన, అధికార యంత్రాంగం పైన మాత్రమే దాడులు చేయడం అన్నది– ఏ విముక్తి పోరాటం అయినా పాటించే ఒక అలిఖిత యుద్ధ న్యాయం. నక్సలైట్లు భూస్వాముల ఇళ్ళల్లోకి ప్రవేశించి భూస్వాములను చంపిన సందర్భాలు ఉన్నాయి కానీ, వాళ్ళ ఇంట్లో భార్యలను చెరచడం, పిల్లల్ని తగలబెట్టడం జరగలేదు. హింసను అంగీకరించడం అంగీకరించకపోవడం అది వేరే చర్చ. ఏ దిశా లేని హింస అన్నది కేవలం టెర్రరిజం మాత్రమే! అయితే హమాస్ నాయకుడు ఘజీ హమద్ "మేము అక్టోబర్ 7న చేసిన హత్యాకాండ వల్లనే ఈ రోజు ప్రపంచం మా సమస్యను గుర్తిస్తున్నది" అని ప్రకటించాడు. అడ్డూ అదుపూ లేని ఏ హింసనైనా ఎవరైనా గుర్తిస్తారు. ఆ గుర్తించేది ఏ దృక్పథంతో గుర్తిస్తున్నారు అన్నది ముఖ్యం. ఈ కనీస ఆలోచన లేని యుద్ధ వీరులు చేసే దుర్మార్గాన్ని లిబరల్స్ ఏ మాత్రం విచక్షణ లేకుండా తలకెత్తుకోవడం ఈ ప్రపంచ మానవ సమాజం చేసుకున్న దురదృష్టం. పాలస్తీనా సమస్య వేరు, హమాస్ ప్రతిఘటన వేరు. ఈ రెంటి మధ్య అయోమయానికి గురై, రెండిటినీ ఒకే రకంగా తలకెత్తుకోవడం అవివేకం.

> హమాస్ నాయకుడు ఘజీ హమద్ "మేము అక్టోబర్ 7న చేసిన హత్యాకాండ వల్లనే ఈ రోజు ప్రపంచం మా సమస్యను గుర్తిస్తున్నది" అని ప్రకటించాడు. అడ్డూ అదుపూ లేని ఏ హింసనైనా ఎవరైనా గుర్తిస్తారు. ఆ గుర్తించేది ఏ దృక్పథంతో గుర్తిస్తున్నారు అన్నది ముఖ్యం. ఈ కనీస ఆలోచన లేని యుద్ధ వీరులు చేసే దుర్మార్గాన్ని లిబరల్స్ ఏ మాత్రం విచక్షణ లేకుండా తలకెత్తుకోవడం ఈ ప్రపంచ మానవ సమాజం చేసుకున్న దురదృష్టం. పాలస్తీనా సమస్య వేరు, హమాస్ ప్రతిఘటన వేరు. ఈ రెంటి మధ్య అయోమయానికి గురై, రెండిటినీ ఒకే రకంగా తలకెత్తుకోవడం అవివేకం.




హమాస్ దాడి తర్వాత ఇజ్రాయెల్ ప్రతిస్పందన మరింత అమానుషం! అందులో 'proportionate response' అన్నది లేదు. హమాస్ సభ్యులు ఇళ్ళ కింద, హాస్పిటల్స్ కింద టన్నెల్స్‌లోనూ దాక్కున్నారని చెప్పి ఇజ్రాయెల్ ఎడాపెడా హాస్పిటళ్లను, స్కూళ్లను పేల్చివేస్తుంటే మానవ సమాజం యావత్తూ సాక్షులుగా మిగిలిపోవాల్సి రావటం దారుణమైన స్థితి! ప్రపంచంలోనే అతిపెద్ద, అతిశక్తిమంతమైన సీక్రెట్ ఏజెన్సీగా పేరుమోసిన ఇజ్రాయెల్‌కి చెందిన 'మొసాద్' కూడా అక్టోబర్ దాడిని పసిగట్టలేకపోయిందంటే ఎంత సిగ్గుమాలిన విషయం! దాడి జరిగిన తర్వాత బందీలు ఎక్కడున్నారో, హమాస్ మిలిటెంట్లు ఎక్కడున్నారో కూడా ఆ ఏజెన్సీ పసిగట్టలేకపోయింది. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ ఎయిర్ స్ట్రైక్స్ చేసి 67,000 మందిని ఇజ్రాయెల్ పొట్టనబెట్టుకుంది. ఇందులో 70 శాతం స్త్రీలు, పిల్లలు ఉన్నారు! అందులో హమాస్ మిలిటెంట్స్ 20 శాతం కూడా లేరు అని అంతర్జాతీయ మీడియా నివేదికలు చెప్తున్నాయి. ఇజ్రాయెల్ ఇది 'కొలేటరల్ డ్యామేజ్' అని నచ్చచెప్తోంది. తమాషా ఏమంటే– 'ఇదంతా ఒట్టి కొలేటరల్ డ్యామేజ్ మాత్రమే! మెయిన్ డ్యామేజ్ అతి స్వల్పం! అంటే ఒక్క మిలిటెంట్‌ను చంపాలంటే నలుగురు సాధారణ పౌరులను చంపవచ్చు' అని ఇజ్రాయెల్ ఇక్కడ తీర్మానిస్తున్నది. ఇన్ని యుద్ధాలు జరిగిన ఈ భూ ఖండంలో ఇంత అమానుషంగా, ఇంత స్థాయిలో, ఇంత disproportionateగా సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయింది లేదు (నాగసాకి, హిరోషిమా బాంబ్ ఘటన మినహాయిస్తే).

నేడు సామ్రాజ్య వాదానికి, ఇస్లామిక్ విస్తరణ వాదానికి మధ్యలో నలిగిపోతున్నది ప్రపంచం. ఒకరు ఆస్తుల గురించి రాజకీయాలు చేస్తే, మరొకరు తమ మత విశ్వాసం వ్యాప్తి కోసం, మూఢులైన ప్రజల్లో తమ అధికార ప్రాబల్యం కోసం మానవ సమాజ వినాశనానికి పాల్పడుతున్నారు. ఒక తోడేలుకీ, ఒక పులికీ మధ్య చిక్కుకున్న గొర్రెపిల్ల పాలస్తీనా! ఫతా పార్టీ పూర్తిగా విఫలం కావడంతో దిక్కు తోచని పాలస్తీనా ప్రజలు హమాస్ వెనుక గుడ్డిగా తరలి వెళ్ళారు. అందుకు మతం అనే సెంటిమెంట్ బలంగా పనిచేసింది. ఇజ్రాయెల్ బోర్డర్ కంట్రోల్ పేరుతో చెక్ పాయింట్స్ పెట్టి పాలస్తీనా ప్రజలను విపరీతమైన వ్యధకు గురిచేసింది. ప్రజల్లో ఉండే కసిని హమాస్ చాలా తప్పుదారిలో నడిపి మరింత క్లిష్టమైన పరిస్థితి తీసుకువచ్చింది. తమ పౌరులను హమాస్ బందీలుగా చేసుకుందన్న కారణంతో పాలస్తీనాలోని సాధారణ ప్రజలను ఇజ్రాయెల్ చంపుతున్నది. దీన్ని ఎవరన్నా యుద్ధం అని నిర్వచిస్తే మనలో మానవ ఇంగితం లోపించినట్టే! పాలస్తీనా వేరు, హమాస్ వేరు! రగిలిపోయిన యూదుల కుటుంబాలు వేరు, వారికి జరుగుతున్న న్యాయం వేరు! ఒకటి దుర్మార్గం, మరొకటి అమానుషం!

◆ పి. విక్టర్ విజయ్‌కుమార్

# ఎంఎస్ఎంఈలతోనే వికసిత భారత్ సాధ్యం!

దేశం అభివృద్ధి చెందాలంటే పెద్ద ప్రాజెక్టులు మాత్రమే కాదు, చిన్న పరిశ్రమలు కూడా బలపడాలి. కానీ ప్రభుత్వాల దృష్టి అంతా "లార్జ్, మెగా ఇండస్ట్రీస్" వైపునకే పోతోంది. పెద్ద పరిశ్రమలకు, అంతర్జాతీయ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకటి ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, భూములు, టారిఫ్ రాయితీలు లభిస్తున్నాయి. అదే సమయంలో కోట్లాది ఉద్యోగాలు కల్పించే ఎంఎస్ఎంఈలు నిశ్శబ్దంగా మూతపడుతున్నాయి.

భారతదేశంలో సుమారు 2.9 కోట్ల ఎంఎస్ఎంఈ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటి ద్వారా 20 కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి లభిస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో మూడు లక్షలకు పైగా రిజిస్టర్డ్ ఎంఎస్ఎంఈ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటి ద్వారా 15 లక్షలకు పైగా ప్రజలకు ఉపాధి లభిస్తోంది. ఈ రంగంలో పనిచేసేవారు ప్రధానంగా తక్కువ, మధ్య ఆదాయ వర్గాలవారు, గ్రామీణ యువత, మొదటి తరానికి చెందిన పారిశ్రామికవేత్తలు. ఎంఎస్ఎంఈలు కేవలం వ్యాపారాలు మాత్రమే కాదు– స్థానికంగా ఉపాధి, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక చలనం కలిగించే శక్తి కేంద్రాలు.



ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద ప్రాజెక్టులకు ప్రభుత్వం అందిస్తున్న అనేక ప్రోత్సాహకాలు ఈ చిన్న పరిశ్రమలకు కూడా ఇవ్వవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రభుత్వాలు కేటాయించే భూముల్లో 80 శాతానికి పైగా భూములు మెగా ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలకే దక్కుతున్నాయి. చిన్న పరిశ్రమలు భూమి కోసం సంవత్సరాల తరబడి ప్రభుత్వాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అలాగే పెద్ద పరిశ్రమల వారికి విద్యుత్ చార్జీలలో రాయితీలు, వాయిదాలు, సర్దుబాట్లు, సత్వర కనెక్షన్, అభివృద్ధి చార్జీల మినహాయింపు తదితర ప్రోత్సాహకాలు లభిస్తున్నాయి. చిన్న పరిశ్రమలకు ఎటువంటి రాయితీ లేకపోగా, డ్యూ డేట్ తర్వాత బిల్లు చెల్లించడం ఒక్కరోజు ఆలస్యమైనా పెనాల్టీలు వేయడం, కనెక్షన్ తొలగించడం వంటివి చేస్తున్నారు. మెగా ప్రాజెక్టులకు భవన నిర్మాణ చార్జీల నుంచి మినహాయింపులు, ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్, ప్రోత్సాహక ప్యాకేజీలు లభిస్తుంటే, చిన్న పరిశ్రమలవారు వీటన్నింటినీ తామే భరించవలసి వస్తోంది. ఇక పెద్ద కంపెనీలు అధిక నైపుణ్య ఉద్యోగులను నియమిస్తాయి, అదే ఎంఎస్ఎంఈలు తక్కువ ఆదాయ వర్గాల యువతకు, మొదటి తరం ఉద్యోగార్థులకు అవకాశాలు ఇస్తాయి. ఒక కోటి రూపాయల పెట్టుబడితో ఎంఎస్ఎంఈ రంగం 10 నుంచి 15 ఉద్యోగాలు కల్పిస్తే, మెగా, భారీ పరిశ్రమలు కల్పించే ఉద్యోగాలు ఒకటి రెండు మాత్రమే.

ప్రతి సంవత్సరం వందల ఎంఎస్ఎంఈ యూనిట్లు మూతపడుతున్నాయి. దీనికి కారణాలు మార్కెట్ పోటీ, చెల్లింపుల ఆలస్యం, ఫైనాన్స్ లోపం, బ్యాంకుల కఠిన విధానాలు, పెరిగిన విద్యుత్ చార్జీలు. పెద్ద కార్పొరేట్‌లకు ఓటీఎస్, అప్పు మాఫీలు లభిస్తే, ఎంఎస్ఎంఈలకు అలాంటి అవకాశాలు లేవు. ప్రతి బడ్జెట్‌కు ముందు ప్రభుత్వం పెద్ద పారిశ్రామికవేత్తలు, చాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్థిక నిపుణులతో చర్చలు చేస్తుంది. కానీ ఎంఎస్ఎంఈ యజమానులు, రోజువారీ పోరాటం చేస్తున్న పరిశ్రమలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు ఆ అవకాశం లేదు.

ఇకనుంచైనా ప్రభుత్వాలు పెద్ద పరిశ్రమల వారికిచ్చే ప్రోత్సాహకాలు ఎంఎస్ఎంఈలకు కూడా కల్పించాలి. అవి ఇలా కల్పించవచ్చు. 1) ఉద్యోగ సృష్టి ఆధారంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. వాటిని ఎప్పటికప్పుడు డైరెక్ట్‌గా కంపెనీల అకౌంటుకు బదిలీ అయ్యేలా చూడాలి. 2) జిల్లా స్థాయిలో ఎంఎస్ఎంఈ యజమానులతో ప్రత్యక్ష సమీక్షలు నిర్వహించాలి. 3) సమస్యల్లో ఉన్న యూనిట్ల పునరుద్ధరణకు సెల్స్ ఏర్పాటు చేయాలి. 4) బ్యాంకులు, డిస్కం సంస్థలు ఎంఎస్ఎంఈలకు ప్రత్యేక సహకార విధానం అమలు చేయాలి. విద్యుత్ సబ్సిడీ ఆయా నెలల బిల్లుల్లో సర్దుబాటు చెయ్యాలి. 5) ల్యాండ్ బ్యాంక్‌లలో కనీసం 30 శాతం భూములు ఎంఎస్ఎంఈ పార్కులకు రాయితీ ధరకు కేటాయించాలి.

ఒక చిన్న యూనిట్ మూతపడితే, దాని వెనుక ఒక కుటుంబం, ఐదారు ఉద్యోగాలు, ఒక గ్రామ ఆర్థిక చలనం ఆగిపోతాయి. ఎంఎస్ఎంఈలు కేవలం వ్యాపారాలు మాత్రమే కాదు– సామాజిక స్థిరత్వానికి మూలాధారం. తక్కువ, మధ్య ఆదాయ కుటుంబాలకు ఉపాధి, స్థానిక ఆర్థిక చలనం, నైపుణ్యాభివృద్ధి ఇవన్నీ ఈ రంగం ద్వారా వస్తున్నాయి. ఎంఎస్ఎంఈలే భారత ఆర్థిక స్వరూపానికి పునాది. అందుకే కష్టాల్లో ఉన్న ఎంఎస్ఎంఈ యజమానుల గళం వినాలి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా పాలసీలు రూపొందించాలి. అప్పుడే నిజమైన ఆత్మనిర్భర్ భారత్ అవుతుంది. ప్రభుత్వాలు ఆశిస్తున్న వికసిత భారత్ లక్ష్యం నెరవేరుతుంది.

● జి. నానిబాబు చౌదరి

ప్రధాన కార్యదర్శి, మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్

# మీ మాట మీకు వర్తించదా సీఎం గారూ?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల గ్రూపు-2లో ఉద్యోగులుగా ఎంపికైన అభ్యర్థులకు ఉత్తర్వులను పంపిణీ చేసే సభలో మాట్లాడుతూ– తల్లిదండ్రులను సరిగా చూసుకోని ఉద్యోగుల వేతనం నుంచి 15శాతాన్ని మినహాయించి దాన్ని నేరుగా వారి తల్లిదండ్రులకి ఇస్తామని, ఆ మేరకు ఉత్తర్వులు కూడా ఇస్తామని ప్రకటన చేశారు. మంచిదే, కానీ మరి ఇదే తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష ఎవరికి విధించాలి?

రిటైర్డ్ ఉద్యోగుల బాగోగులు చూసుకోవాల్సిన తల్లీ తండ్రీ స్థానంలో ఉన్నది ప్రభుత్వమే! మరి అలాంటప్పుడు, 2024 నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా వారి మరణాలకు కారణం అవుతున్న ప్రభుత్వ పెద్దలు తమకు ఏ శిక్షను వేసుకుంటారో చెప్పాలి. ఉద్యోగంలో చేరేవారికి మీరు పెట్టిన నిబంధన ఉద్యోగ విరమణ చేసేవారికి వర్తించదా? ఇరువురి సంక్షేమమూ చూడాల్సింది ప్రభుత్వమే కదా!

2024 నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనే లేదు. రెండేళ్ళుగా ఎదురు చూసిన ఉద్యోగులు తమ రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక, కుటుంబ అవసరాలు తీరక, ఆర్థికపరమైన ఒత్తిడితో కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. రిటైరైన ఉద్యోగులు తమ ఉద్యోగ విరమణ అనంతరం వచ్చే నిధులతో ప్రధానమైన కుటుంబ అవసరాలు తీర్చడంతోపాటు, ఇల్లు లేని ఉద్యోగులు ఇల్లు సమకూర్చుకోవడం, పేరుకుపోయిన అప్పులు ఉంటే తీర్చుకోవడం చేస్తుంటారు. ఒకే మొత్తంగా వస్తాయి కనుక ఈ డబ్బును తమ కుటుంబ వైద్య అవసరాలకు, పిల్లల పెళ్ళిళ్లకు ఖర్చు చేయడం కోసం దాచుకుంటారు.




ఉద్యోగులు దాచుకున్న ఏపీజీయల్‌ఐసీ, ప్రావిడెంట్ ఫండ్‌లతో పాటు, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పెన్షన్ కమిట్‌మెంట్, గ్రాట్యుటీ తదితరాలను ఉద్యోగులు రిటైర్ అయిన తేదీనే గతంలో ప్రభుత్వం చెల్లించేది. ఏ ప్రభుత్వమైనా ఉద్యోగి రిటైర్ అయిన నెలరోజుల్లోగా వారికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించడం గత కొన్ని దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏప్రిల్ 2024నుంచి రిటైర్మెంట్ పొందిన ఉద్యోగుల బకాయిలు పెండింగ్‌లో పెట్టారు. మునుపెన్నడూ లేనివిధంగా, నిధులు లేవని ఇవ్వకపోవడంతో ఈ రిటైర్మెంట్ బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయి. సుమారు రూ.10వేల కోట్ల వరకు రిటైర్మెంట్ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. గతంలో ఉద్యోగి రిటైర్మెంట్ నెలలోనే సబ్ ట్రెజరీ ఆఫీసు నుంచి రాష్ట్ర స్థాయిలో ఉన్న 'పే అండ్ అకౌంట్ కార్యాలయానికి ప్రతిపాదన పంపితే దరఖాస్తు చేసిన నెలలోపు ఆర్థిక లబ్ధి మంజూరు అయ్యేది. ప్రస్తుతం ఆర్థిక స్థితి మొత్తం ప్రభుత్వం తన నియంత్రణలోనికి తీసుకోవడంతో ఆయా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే సంస్థలైన రాష్ట్ర పే & అకౌంట్ కార్యాలయం, ట్రెజరీ, సబ్ ట్రెజరీ ఆఫీసులు నిర్వీర్యం అయ్యాయి. ఆర్థిక అధికారం మొత్తం ప్రభుత్వం చేతిలో కేంద్రీకృతమైంది. రిటైర్ అయిన ఉద్యోగి నుంచి పెద్దగా ఒత్తిడి ఏమీ ఉండదులే అన్న ఉద్దేశంతో వారికి చెల్లించాల్సిన బకాయిలను పెండింగ్‌లో ఉంచింది ప్రభుత్వం. కొందరు ఉద్యోగులు తమ అవసరాలను పేర్కొంటూ హైకోర్టును ఆశ్రయించి బకాయిలు పొందారు. అటు తర్వాత ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా రావడంతో కోర్టు కూడా ఈ సమస్యను ప్రభుత్వ పరిష్కారానికే వదిలివేసింది. ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం జరిపిన చర్చల్లో ఈ ప్రస్తావన ఉన్నప్పటికీ, ఉద్యోగ సంఘాలు తమ సమస్యలకే ప్రాధాన్యతనిచ్చి ఈ అంశాన్ని పక్కనపెట్టేయడంతో రిటైర్మెంట్ ఉద్యోగులు మరింత కలవరపాటుకు గురయ్యారు. ఇటీవలే రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు ఆందోళనబాట పట్టాయి. కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలకు, నిరాహార దీక్షలకు దిగడంతో పాటు, తదుపరి ఆందోళనా రూపాలకు సైతం సిద్ధం అవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే ఈ విషయమై భరోసా కల్పిస్తూ ప్రకటన ఇవ్వడంతోపాటు, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలు వీలైనంత త్వరగా చెల్లించాలని కోరుకుందాం.

– ఎన్. తిర్మల్, సామాజిక కార్యకర్త


జోడెద్దులను నిమజ్జనం చేస్తున్న నేతకాని కులస్థులు


## సీతంపేటలో 'నేతకాని'ల కోలాహలం

7

**సందడిగా జోడెద్దుల విగ్రహాల నిమజ్జనం**

- కోలాటం, ఆటపాటలతో ఊరేగింపు
- నేటితో ముగియనున్న ఉత్సవాలు



హనుమకొండ, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని మిల్లింగ్ చేయకపోగా దానిని దారి మళ్లించి అక్రమంగా సొమ్ము చేసుకున్న రైస్ మిల్లుల పట్ల మరింత కఠినంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బకాయిలను రాబట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. బకాయిలు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న మిల్లులపై కేసులు నమోదు చేస్తోంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)లో ఎలాంటి అవతవకలు జరగకుండా మరింత పగడ్బందీ చర్యలు తీసుకోబోతున్నది. ఈ మేరకు ప్రభుత్వం సీఎంఆర్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఈసారి బ్యాంకు పూచీకత్తు (గ్యారెంటీ) తప్పనిసరి చేస్తూ పౌరసరఫరాల శాఖ అదేశాలు జారీ చేసింది. గతేడాది నుంచి ఈ విధానం అమలు చేసినప్పటికీ పూచీకత్తు ఇవ్వని మిల్లులకు కూడా ధాన్యం కేటాయించారు. బ్యాంకు ఖాతాలో నగదు లేని మిల్లర్లు కూడా పూచీకత్తు పత్రాలు ఇచ్చారు. ఈసారి పూచీకత్తు ఇవ్వని మిల్లర్లకు ధాన్యం కేటాయించవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది.

- సీఎంఆర్ నిబంధనలు మరింత కఠినం
- బ్యాంక్ గ్యారెంటీ ఇస్తేనే మిల్లింగ్
- డిఫాల్ట్ మిల్లులన్నీ బ్లాక్ లిస్టులోనే..
- ఉమ్మడి జిల్లాలో డిఫాల్ట్‌గా 32 మిల్లులు
- బకాయి చెల్లించకుంటే కేసుల నమోదు
- 74వేల మెట్రిక్ టన్నుల మేరకు బకాయి

# అక్రమ మిల్లర్లపై కొరడా

### పూచీకత్తు తప్పనిసరి

సీఎంఆర్ బకాయిదారులపై కఠినంగా వ్యవహరించేలా గతేడాది వానకాలం సీజన్‌లో మంత్రిమండలి ఉప సంఘం అధ్వర్యంలో కొత్త విధానం తీసుకువచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలు కాలేదు. ఈ సారి మాత్రం బ్యాంకు పూచీకత్తు విధానం కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సీఎంఆర్ బాకాయిలు లేని మిల్లర్లు 10శాతం, డీఫాల్టు అయి బకాయిలు తీర్చేసిన మిల్లర్లు 25 శాతం, మిల్లులు లీజుకు తీసుకున్నవారికి 50 శాతం బ్యాంకు గ్యారెంటీతో పాటు ఇద్దరు మిల్లర్లు పూచీకత్తు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఒక వేళ మిల్లర్ బియ్యం ఇవ్వకపోతే ఆ గ్యారెంటీ కింద జమ చేసే డబ్బును జప్తు చేసుకునే అధికారం పౌరసరఫరాల సంస్థకు ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 480 రైస్‌మిల్లులు ఉన్నాయి.

**డిఫాల్ట్‌లో 32 మిల్లులు**

2021-22 నుంచి 2023-24 వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 32 మంది మిల్లర్లు 74,818 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి పడ్డారు. బకాయిలను తిరిగి రాబట్టడంలో అధికారులు విఫలమయ్యారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో ఇక నుంచి వీరి పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మిల్లులను డీఫాల్టు జాబితాల్లో చేర్చి వీటికి సీఎంఆర్ ధాన్యం కేటాయించొద్దని ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలో 1,220 కేంద్రాల్లో 28.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఇందులో 270 మిల్లులపై ఎలాంటి కేసులు లేవు. మరో 50 మిల్లులు సీఎంఆర్ బియ్యాన్ని ఆలస్యంగా ఇవ్వడంతో ఫైన్ వేశారు. ఆ ఫైన్ కూడా ఆలస్యంగా చెల్లించడంతో వారిని మన్నించి ఆ మిల్లులకు కూడా 25శాతం బ్యాంకు గ్యారెంటీతో ధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కాకముందే ఈ ప్రక్రియను పూర్తి చేసి మిల్లుల వారీగా ధాన్యం కేటాయించేలా అధికారులు ఇప్పటినుంచే కసరత్తు చేస్తున్నారు. సీఎంఆర్ బకాయిలుండి డీఫాల్టు జాబితాలో ఉన్న మిల్లర్లకు ఈ సారి ఎట్టి పరిస్థితుల్లో సీఎంఆర్ కేటాయించేది లేదని పౌరసరఫరాల సంస్థ అధికారులు స్పష్టం చేశారు. వీరి వద్ద నుంచి బకాయిలు వసూలు చేసేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

**సామర్థ్యం మేరకే..**

ఉమ్మడి జిల్లాలో ఒక్కో మిల్లుకు గతంలో సామర్థ్యానికి మించి 200 శాతం ధాన్యం ఇచ్చేవారు. ఈ సారి మాత్రం వంద శాతానికి పరిమితం చేశారు. ఒక వేళ మిల్లరు 50 శాతమే కావాలని అడిగితే అంత మేరకే ఇస్తారు తప్ప అధికంగా ఇచ్చేది లేదు. అవసరమైతే ధాన్యాన్ని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరచాలని నిర్ణయించారు. మిల్లుల సామర్థ్యం మేరకే ధాన్యం ఇచ్చేలా నిర్ణయించారు.

### సీఎంఆర్ బకాయిలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 33,368 మెట్రిక్ టన్నుల బియాన్ని మిల్లర్లు బకాయి పడ్డారు. గడువు సమీపిస్తున్నా మిల్లర్లు బియ్యం ఇవ్వకపోవడంతో ఇటీవల పౌరసరఫరాశాఖ, టాస్క్‌ఫోర్సు టీం సంయుక్తంగా

(మిగతా 6లో..)

# మేడారం జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్
- హైదరాబాద్‌లో ములుగు కలెక్టర్ సహా అధికారులతో సమీక్ష
- పాల్గొన్న ఉమ్మడి ఆరు జిల్లాల కలెక్టర్లు, అధికారులు

7


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్

# ఓం నమో భగవతే రుద్రాయ..

- నేత్రపర్వంగా ప్రారంభమైన కార్తీక మాసం
- తొలిరోజు శివాలయాల్లో రుద్రాభిషేకాలు


భద్రకాళి దేవస్థానంలో అలంకరణలో భద్రేశ్వరుడు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శివ కేశవుల ప్రీతికరమైన కార్తీక మాసం ప్రారంభమైంది. బుధవారం నుంచి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. నగరంలోని సుప్రసిద్ధ శివాలయాల్లో కార్తీక మాసం తొలిరోజు ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమై గణపతి పూజ తర్వాత పరమశివుడికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అంగన్యాస కరణ్యాస నమక చమక రుద్ర పారాయణాలు, వేద పఠనం మధ్య భక్తులు శివుడికి ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. పంచామృతాలతో పాటు కొబ్బరి నీళ్లు, చెరుకు రసం, పండ్ల రసాలు, విభూది, బిల్వదళాలతో అభిషేకించారు. ఓం నమో భగవతే రుద్రాయ అంటూ అర్చకులు శివుడికి విశేష అభిషేకం చేశారు. భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో తేజోలింగంగా పిలిచే స్వయంభూ శ్రీభద్రేశ్వర స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేసి మంగళహారతులు ఇచ్చారు. ములుగు రోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలోని శ్రీసచ్చిదానందేశ్వరుడికి అర్చకులు రాపాక గోపీకృష్ణశర్మ నేతృత్వంలో రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. నెల రోజుల పాటు ఈ అభిషేకాలు కొనసాగుతాయని తెలిపారు. నగరంలోని రామలింగేశ్వర, భోగేశ్వర, దుర్గేశ్వర, కాశీ విశ్వేశ్వర, ఆకారపు వారి గుడి, కాశిబుగ్గ శివాలయం, రంగంపేట శివాలయం, కరీమాబాద్ బొమ్మల గుడితో పాటు పలు శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. పలువురు భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు.

# అమ్మకానికి 'కుడా' భూములు

- నవంబర్ 3న యాక్షన్ ప్లాన్.. బిల్డర్ల పోటీ
- రూ.85కోట్ల వరకు రానున్న ఆదాయం

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని హనుమకొండలో కోట్ల విలువ చేసే కుడా భూములు అమ్మకానికి సిద్ధం చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్ వెనక గల కుడా స్థలం 2 ఎకరాల 34 గుంటలు (13.773 స్కేర్ యార్డ్స్) ప్రభుత్వ భూమిని విక్రయాలు జరుపుతున్నట్టు కుడా అధికారులు తెలిపారు. ఈ భూమిని కొనుగోలు చేసేందుకు హైదరాబాద్ నుంచి ఇప్పటికే 30 మంది బిల్డర్లు పోటీ పడుతున్నారు. భూమి విక్రయానికి గాను జూన్ 13న కుడా కార్యాలయంలో (ప్రీ బిట్ మీటింగ్) ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా పలువులు బిల్డర్లు పోటీ పడ్డారు. నగరంలో ఉన్న బిల్డర్లు, ప్రజలు ఇక్కడ ఇండ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించుకోవడానికి వీలుంటుందని, ఎవరైనా భూమిని కొనుగోలు చేయవచ్చని కుడా అధికారులు ఆహ్వానిస్తున్నారు. ఇక్కడి భూమి విక్రయించగా సుమారు రూ.85కోట్ల వరకు రావొచ్చని భావిస్తున్నారు. ఇక్కడ వచ్చిన ఆదాయంతో నగరంలో కుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు కొత్త పనులకు రూపకల్పన చేసి నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలనే ఆలోచనలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు కావడం వల్ల ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుందని అధికారులు వెల్లడించారు.



అమ్మకానికి సిద్ధం చేసిన కుడా స్థలం

### ప్రభుత్వ భూములు అమ్మితే ఊరుకోం..

ఆదాయం కోసం ప్రభుత్వ భూములను అమ్మితే ఊరుకునేది లేదని బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ హెచ్చరించారు. కుడా ఆధ్వర్యంలో బాలసముద్రంలోని 2.27 ఎకరాల ప్రభుత్వ భూమిని బహిరంగ వేలం పాట ద్వారా విక్రయించడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడానికి భవిష్యత్‌తరాలకు ఉపయోగపపడే భూములను అమ్ముకోవడం బాధ్యాతారాహిత్యమన్నారు. ఈ చర్యను బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. బీజేపీ శ్రేణులతో కలిసి ఈ వేలాన్ని అడ్డుకుంటామన్నారు. కుడా అధికారులు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.




# కళా ప్రదర్శనలతో అవగాహన కల్పించాలి..

**పోలీసు జాగృతి కళా బృందానికి సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచన**


పోలీసు జాగృతి కళాబృందంతో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కళా ప్రదర్శనలు ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ జాగృతి కళా బృందం సభ్యులతో సీపీ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, డయల్ 100, మత్తు పదార్థాలు, షీటీమ్, మూఢ నమ్మకాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కథల రూపంలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మూడేళ్లకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వివరించడమే కాకుండా నష్టాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. నెల ముందే అధికారుల నుంచి కళాబృందం సభ్యులు సమాచారాన్ని సేకరించి కార్యక్రమానికి సంబంధించి చక్కటి ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కళాబృందం కార్యాచరణపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని ఎస్‌బీ-2 ఏసీపీకి సూచించారు. ఈ కార్యక్రమంలో కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.








కేదారీశ్వర వ్రత పూజా దృశ్యం

## భక్తిశ్రద్ధలతో కేదారీశ్వర నోములు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి కేదారీశ్వర వ్రతాలను నిర్వహించిన భక్తులు బుధవారం ఉదయం నోములను ఎత్తుకున్నారు. మహిళలు నోము పూజలో ఉంచిన అత్తిపుత్తిదారాన్ని కేదారీశ్వర స్వామి ప్రసాదంగా ధరించి గౌరమ్మను వాయినంగా బొట్టుపెట్టుకున్నారు. బంధు మిత్రులకు నోము ప్రసాదంగా అరిశెలను, అత్తిపుత్తి దారాన్ని ప్రసాదంగా అందజేశారు.

### చేపలకు భలే గిరాకీ..

గౌరమ్మను పూజించి నోములు ఆచరించుకొని ఎత్తుకున్న అనంతరం గంగమ్మ రోజుగా నోములు ఆచరించుకున్న వారు చేపలను వండుకుంటారు. దీంతో బుధవారం చేపలకు భలే గిరాకీ నెలకొంది. కొన్ని వర్గాల వారు నోమును ఎత్తుకున్న రోజు తప్పనిసరిగా చేపల కూర వండుకోవాలనే సంప్రదాయంతో పలువురు చేపలను కొనుగోలు చేయడం కనిపించింది. కిలో బొమ్మె చేపలు రూ. 600 నుంచి 800 వరకు విక్రయించారు. వీటితో పాటు చికెన్, మటన్‌లు కూడా జోరుగా సాగాయి.

## హైడ్రా కమిషనర్‌కు శుభాకాంక్షలు



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు చిత్రపటం అందజేస్తున్న రచన డెవలపర్స్

వడ్డెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని హైడ్రా కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. వరంగల్‌కు చెందిన రచన డెవలపర్స్ అధినేత, రియల్ ఎస్టేట్ నేత కొక్కిరాల రవీందర్‌రావు ఆధ్వర్యంలో పలువురు రంగనాథ్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మెమెంటోను బహూకరించారు. ఆయన వెంట రచన డెవలపర్స్ పీతాంబరం రాజేష్, బెబ్బిరి వెంకటేశ్వర్‌రావు, పుట్ట భిక్షపతి తదితరులు ఉన్నారు.

## అక్రమ మిల్లర్లపై కొరడా

(5వ పేజీ తరువాయి)

తనఖీలు చేపట్టారు. బకాయిలు పెండింగ్ పెడుతున్న మిల్లర్లపై అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. జిల్లాలో 2022 నుంచి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లరు కాజేసి బకాయిలు పడ్డారు. జిల్లాలో 12.76 కోట్ల విలువైన ధాన్యాన్ని మిల్లర్లు బాకాయి పడ్డారు. మిగతా జిల్లాలతో పోల్చితే హనుమకొండ జిల్లాలో సీఎంఆర్ ధాన్యం బకాయిలు తక్కువగానే ఉన్నాయి. ఈ జిల్లాలో సుమారు అయిదు రైస్ మిల్లులు 1450 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు బకాయి ఉన్నారు. వరంగల్ జిల్లాలో 20 మిల్లులు బియ్యం బకాయిపడ్డాయి ఈ మొత్తం 10వేల మెట్రిక్ టన్నుల మేరకు ఉండవచ్చునని అంచనా. ములుగు జిల్లాలో 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి ఒక మిల్లు రూ.2.16కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యం బకాయి పడడటంతో ఆ మిల్లును డీఫాల్టులో పెట్టడమే ఆకుండా రికవరీ కోసం కేసు కూడా నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో సుమారు పదికిపైగా మిల్లులు సీఎంఆర్ బకాయి ఉన్నాయి.



# ఇకపై వీళ్లదే ధాన్యం బాధ్యత

**ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వహణలో సీసీ, ఏపీఎం**

**ఆదేశాలు జారీ చేసిన హనుమకొండ డీఆర్‌డీవో**

**జిల్లా వ్యాప్తంగా 72 సెంటర్లు అప్పగింత**

శాయంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాల బాధ్యతను సంబంధిత సీసీ, ఏపీఎంలకు అప్పగిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా అధికారి మేన శ్రీను ఆదేశాలు జారీ చేశారు. గతంలో కొనుగోలు కేంద్రాల కమిటీలు ఏర్పాటు చేసి, సెంటర్ ఇన్‌చార్జిగా సంబంధిత వీవోఏలను కేటాయించగా వారే నిర్వహించేవారు. కానీ కొందరు వీవోఏలు అక్రమాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని డీఆర్‌డీవో తెలిపారు.

### జిల్లాలో 72 సెంటర్లు

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్‌కు 72 సెంటర్ల నిర్వహణ బాధ్యత ఐకేపీలకు అప్పగించారు. అందులో శాయంపేట- 12, ఆత్మకూరు-3, భీమదేవరపల్లి- 6, దామెర- 2, ధర్మసాగర్- 9, ఎల్కతుర్తి- 7, హసన్‌పర్తి- 3, ఐనవోలు- 5, కమలాపూర్- 9, నడికూడ- 7, పరకాల- 1, వేలేరు- 8 సెంటర్లు ఉన్నాయి. ఈ సెంటర్లలో సీసీలు తమ క్లస్టర్‌లో నిర్వహించే కొనుగోలు కేంద్రాలకు ఇన్‌చార్జిలుగా, ఏపీఎంలు మండల వ్యాప్తంగా సూపర్‌వైజర్లుగా వ్యవహరించనున్నారు.

### రెండు సెంటర్లలో భారీ అక్రమాలు

మండలంలోని శాయంపేట, కాట్రపల్లి గ్రామాల్లోని ఐకేపీ ఆధ్వర్యంలో 2024-25 రబీలో నిర్వహించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులు, మిల్లర్ కలిసి ధాన్యం లేకుండానే ఆన్‌లైన్ ఎంట్రీలు చేసి, ట్రక్ షీట్లు రాసి, మిల్లర్ తన కుటుంబ సభ్యులను రైతులుగా సృష్టించి రూ.కోట్లు దండుకున్న విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ స్కామ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయాస్ అధికారుల విచారణలో వెల్లడి కాగా, 21 మందిపై శాయంపేట పీఎస్‌లో కేసు నమోదు చేశారు. అందులో ఐదుగురు పట్టుబడి జైలుకెళ్లారు. మిగతా వారు పరారీలో ఉండగా పోలీసులు గాలిస్తున్నారు. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి మిల్లర్ బెజ్జంకి శ్రీనివాస్, అక్రమాల్లో భాగస్వామ్యం ఉన్న ఓ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనను దృష్టిలో పెట్టుకుని అక్రమాల నివారణకు అప్రమత్తమైన సెర్ప్ ఉన్నతాధికారులు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలో సీసీ, ఏపీఎంలకు కూడా భాగస్వాములను చేశారు. గతంలో సీసీ, ఏపీఎంలు మౌఖికంగా పర్యవేక్షణ చేయాలనే ఆదేశించినా ఇప్పుడు పూర్తిగా బాధ్యత వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అలాగే వీవోఏలు మొత్తం తామే అయి సెంటర్ల వద్ద పెత్తనం చెలాయించొద్దని, అలాంటి ఘటనలు తమ దృష్టికి వస్తే విధుల నుంచి తొలగిస్తామని జిల్లా అధికారులు హెచ్చరించినట్లు సమాచారం. దీంతో అధికారుల పూర్తి భాగస్వామ్యంతో కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు అడ్డుకట్టపడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా వేస్తున్న దృశ్యం (ఫైల్)

## కార్తీక వేడుకలు వైభవంగా ఆరంభం

**అందరూ భగవంతుడి కృపకు పాత్రులు కావాలి**

**కార్తీక ప్రారంభ వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శివ, విష్ణు ప్రీతికర పవిత్ర కార్తీకమాసంలో భక్తులు ఆధ్యాత్మిక చింతనతో ఉంటూ ప్రతీ ఒక్కరు భగవంతుడి కృపకు పాత్రులై సుఖసంతోషాలతో ఉండాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నెల రోజులపాటు నిర్వహించే కార్తీకమాస వేడుకలను బుధవారం చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. అన్ని ఆలయాల్లో కార్తీకమాసం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని దేవాదాయ, ఇతర సంబంధిత శాఖలను కోరారు. వేయిస్తంభాల ఆలయ ముందుభాగంలో పార్కు సుందరీకరణ, రోడ్డు వెడల్పు లాంటి పనులను త్వరలో ప్రారంభింపజేస్తామన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. కార్తీక మాసంలో శివ వైష్ణవ ఆలయాలను భక్తులు సందర్శించాలన్నారు. 25వ తేదీన నాగుల చవితి, నవంబరు 5న కార్తీక పౌర్ణమి వేడుకలతోపాటు ప్రతీ సోమవారం రుద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పరమేశ్వరుడి వద్ద దీప, ఉసిరిక దానాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, బంక సరళ యాదవ్, రవీందర్‌రెడ్డి, కుమార్ యాదవ్‌తోపాటు ఆలయ ఈవో అనిల్ కుమార్ పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో మణికంఠ శర్మ, ప్రణవ్ నిర్వహించారు.



వేయిస్తంభాల ఆలయంలో కార్తీకమాస వేడుకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు

## ప్రశాంతంగా కేయూ ప్రీపీహెచ్‌డీ పరీక్షలు

కేయూ క్యాంపస్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు బుధవారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకుప్రశాంతంగా జరిగాయి. పరీక్షల నిర్వహణ తీరును కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు పరిశీలించారు. సైన్స్, ఆర్ట్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, సోషల్ సైన్స్, ఎడ్యుకేషన్, కామర్స్, లా విభాగాల్లో 187 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తులు చేసుకోగా 180 మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షల కేంద్రాలను పరిశీలించిన వారిలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు పోడేటి శ్రీనివాస్, మమత పాల్గొన్నారు

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

చెన్నారావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడీగడ్డ తండాకు చెందిన బానోతు రాజు అనే వ్యక్తి అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి ఇదే తండాకు చెందిన రాజు తన బ్యాగులో 15 గ్రాముల ఎండు గంజాయిని తీసుకువస్తున్నాడు, చెన్నారావుపేట పోలీసులు గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన రాజును పరిశీలించగా బ్యాగులో 15 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాజును విచారించగా, గుర్తుతెలియని వ్యక్తులు గంజాయి ఇచ్చినట్లు పేర్కొనడంతో కేసు నమోదు చేసి, రాజును అరెస్టు చేసినట్లు ఎస్సై వివరించారు.

## బైక్- ఆయిల్ ట్యాంకర్ ఢీ..

- ఒకరి మృతి - మరొకరికి తీవ్ర గాయాలు
- బచ్చన్నపేట మండలంలో ఘటన

బచ్చన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన దారులను ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం జనగామ జిల్లా బచ్చన్న పేట-ఆలేరు ప్రధాన రహదారిపై కొలనుపాక, పోచన్నపేట గ్రామాల మధ్య చోటు చేసుకుంది.

ఎస్‌ఐ అబ్దుల్ హమీద్ కథనం ప్రకారం.. బచ్చన్నపేట మండలంలోని బండనాగారంనకు చెందిన నల్ల రాజేందర్‌రెడ్డి(23), ఈదులకంటి రమేష్‌రెడ్డిలు పాల బిల్లులు తెచ్చేందుకు చేర్యాలకు వెళ్లారు. అనంతరం ఆలేరు వైపు బైక్‌పై వెళ్తుండగా, ఆలేరు నుంచి బచ్చన్నపేట వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో నల్ల వసంత- చంద్రారెడ్డిల కుమారుడు రాజేందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, రమేష్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రమేష్ రెడ్డిని జనగామకు తరలించగా, పరిస్థితి విషమించటంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ అబ్దుల్ హమీద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అవివాహితుడైన రాజేందర్ కూలీనాలీ చేసుకుని జీవిస్తుండగా, రమేష్‌రెడ్డి పాల కేంద్రంలో పనిచేస్తున్నాడు.

## సమష్టి కృషితో కేయూ మరింత అభివృద్ధి




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, వెంకట్రామిరెడ్డి తదితరులు

**కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి**

కేయూ క్యాంపస్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీని సమష్టి కృషితో మరింత అభివృద్ధి చేస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూ సెనెట్ హాల్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అధ్యక్షతన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్-2025 సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కేయూ అల్యూమినీ, ప్రభుత్వ సహకారంతో వర్సిటీకి పూర్వ వైభవం తేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఆగస్టు 19, 20, 21 తేదీల్లో కేయూలో నిర్వహించిన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించామన్నారు. సైన్స్ కాంగ్రెస్, స్నాతకోత్సవాల సక్సెస్‌లో కేయూ ప్రతిష్ట పెరిగిందన్నారు. గతేడాదికాలంగా అకడమిక్‌తో పాటు నిర్వహణపరంగా వర్సిటీ ఎంతో వృద్ధి సాధించిందన్నారు. రిటైర్డు ఉద్యోగులకు ప్రయోజనాలను కల్పించామన్నారు. వర్సిటీకి బ్లాక్‌గ్రాంట్ రూ.145 కోట్లకు పెరిగిందన్నారు. రూ.50కోట్ల అభివృద్ధి గ్రాంట్ సాధించమన్నారు. రుసా నిధులతో 37 వ్యక్తిగత ప్రాజెక్టులు, 5 రీసెర్చ్ సెంటర్లు, 23 మందికి రీసెర్చ్ ఫెల్లోలనూ నియమించామని వెల్లడించారు. కేహబ్-టీహబ్ ఎంఓయూ కుదిరిందన్నారు. వర్సిటీ గోల్డెన్ జూబ్లీలోకి అడుగిడుతోందన్నారు.

బోధన, బోధనేతర ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించమన్నారు. ఫేస్ రికగ్నిజేషన్ హాజరు తీసుకువస్తామన్నారు. న్యాక్ గుర్తింపుతో పాటు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ పెంచుకోవాలన్నారు. కొత్త నియామకాలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఫార్మసీ కళాశాల గోల్డెన్ జూబ్లీ సంబురాలు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించామన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల వయోపరిమితి 65కు పెంచామన్నారు. పీజీ, పరిశోధనల్లో సేవలను వినియోగించుకుంటామన్నారు. ఆర్ట్స్ కళాశాల 100 ఏళ్ల సంబురాలను నిర్వహణకు సిద్ధమన్నారు.

ఈ సందర్భంగా కేయూ తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ బాధ్యులు ఎస్‌ఎంరెడ్డి, సంజీవరెడ్డి, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ప్రొఫెసర్ బైరు వెంకట్రామ్‌రెడ్డిలు తమ అనుభవాలను పంచుకున్నారు. సైన్స్ కాంగ్రెస్ సంగ్రహణ వివరణ పుస్తకాన్ని సభలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, రమ, ప్రిన్సిపాల్స్ తాళ్లపల్లి మనోహర్, సుంకరి జ్యోతి, సౌజన్య, డీన్ హన్మంతు, సారంగపాణి, రామస్వామి, లక్ష్మారెడ్డి, రామ్‌రెడ్డి, సవితాజ్యోత్స్న, ఎల్‌పీ రాజ్‌కుమార్, మామిడాల ఇస్తారీ, నల్లాని శ్రీనివాస్, మమత, రాధికారెడ్డి, భారవీశర్మ, నరేందర్, సుజాత, నరసింహచారిచచ, తిరుమలదేవి తదితరులు పాల్గొన్నారు.

## రూ.3.5కోట్లతో ఇన్‌స్ట్రూమెంట్ సెంటర్ భవనం

**భూమి పూజ చేసిన కేయూ వీసీ, రిజిస్ట్రార్**

కేయూ క్యాంపస్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో క్యాంటీన్ సమీపంలో రూ.3.5కోట్ల వ్యయంతో కేయూ సెంట్రల్ ఇన్‌స్ట్రూమెంట్ సెంటర్ భవనాన్ని నిర్మించనున్నారు. బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు భవన నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. రూసా నిధులతో చేపట్టనున్న నూతన భవనం రెండు అంతస్తులల్లో నిర్మిస్తామని, 6,786 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి ఉంటోందని వర్సిటీ అధికారులు తెలిపారు. ఆధునిక సైన్స్ పరికరాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచి విద్య, పరిశోధన అవసరాలకు వినియోగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, డాక్టర్ సుకుమారి, డాక్టర్ మల్లం నవీన్, అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, రూసా నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, క్యాంపస్‌కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, డీన్లు ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, హన్మంతు, హాస్టల్స్ డైరెక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, బైరు వెంట్రామిరెడ్డి, పి.మల్లారెడ్డి, పోడేటి శ్రీనివాస్, పుల్లా శ్రీనివాస్, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

## ఎన్నికల నిలుపుదలతో అధికారుల ఆందోళన

**ఖర్చు చేసిన నిధులు రాక ఇబ్బందులు**

హనుమకొండ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోవడంతో అధికారులకు భారంగా మారింది. ఇప్పటికే ఎన్నికల సన్నాహానికి లక్షల రూపాయలు ఖర్చు చేసిన అధికారులు.. ఎన్నికల ప్రక్రియ నిలుపుదలతో నిధుల కోసం ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలోని ఒక్కో మండలంలో సుమారుగా రూ.20వేల నుంచి రూ.30వేల ఖర్చు చేసి నిధుల కోసం ఎదురు చూస్తున్నట్లు సమాచారం. పోలింగ్‌కేంద్రాల గుర్తింపు, పోలింగ్ బూత్ లిస్టులు, రిజర్వేషన్ జాబితాలు, సిబ్బంది లాజిస్టిక్స్ పనులు పూర్తి చేసిన తరుణంలో సుప్రీంకోర్టు తీర్పుతో ఎన్నికల ప్రక్రియ ఒక్కసారిగా ఆగిపోయింది. ఖర్చు చేసిన డబ్బులు ప్రభుత్వానికి పంపిస్తే వచ్చిన నిధులను ఫ్రీజింగ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

సాధారణంగా ఎన్నికల సన్నాహాలకు డివిజన్ స్థాయిలో ఖర్చులు అధికారులే భరించాల్సి ఉంటుంది. తర్వాత బిల్లులు విడుదలవుతాయి. ఎన్నికలు రద్దు కావడంతో ఎంపీడీవోలు, అధికారులు వ్యక్తిగతంగా ఖర్చు చేసిన డబ్బులు రావడం లేదని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రిజర్వేషన్ డ్రాఫ్ట్ తయారీకి సన్నాహాలు చేస్తుండగా ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలపై నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు అధికారులు తమ ఖర్చులపై ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ నూతన షెడ్యూల్ ప్రకటించే వరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని అధికారులు వాపోతున్నారు.

# ‘పరిహారం’పై అవగాహన లేమి

- హిట్ అండ్ రన్ కేసుల్లో నష్టపోతున్న బాధితులు
- ఉమ్మడి జిల్లాలో సుమారు 100 కేసులు
- ఆయా జిల్లాల కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు
- విచారణ అనంతరం 15 రోజుల్లో పరిహారం

హనుమకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జాతీయ రహదారులు, రాష్ట్రీయ రహదారులపై నిత్యం ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ దుర్ఘటనల్లో పలువురు దుర్మరణం పాలవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే రెండేళ్లలో 362 హిట్ అండ్ రన్ సంఘటనలు జరిగాయి. 2024లో 192, 2025లో 170 చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడగా, తీవ్రంగా గాయపడ్డవారు ఆస్పత్రుల్లో చేరి అప్పుల పాలవుతున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తిస్తే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది. సరిగా ఇటువంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ పథకాన్ని 2022లో అమలులోకి తీసుకువచ్చింది. అయితే ఈ పథకం గురించి చాలామందికి తెలియదు. దీంతో దీనిని బాధితులు, వారి కుటుంబాలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నాయి. పోలీసు శాఖగానీ, జిల్లా యంత్రాంగం కానీ ఈ పథకం గురించి తగిన ప్రచారం చేయడం లేదు. ప్రజల్లో అవగాహన కల్పించడం లేదు.

### కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు

హిట్ అండ్ రన్ కేసుల బాధితులు న్యాయం కోసం పోలీసులకు ఫిర్యాదు చేయడం ఒక్కటే కాదు.. ఆర్థిక సాయం కోసం కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇది ఎప్పుడంటే ప్రమాదానికి కారణమై వాహనాలను గుర్తించే అవకాశం లేనప్పుడు. ఆ విషయాన్ని పోలీసులు నివేదిక రూపంలో ఇస్తే దీనిని జత చేస్తూ కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. క్షతగాత్రులైతే ఫారం-1లో వ్యక్తిగత సమాచారం, ప్రమాద స్థలం, సమయం, అయిన గాయాల వివరాలు నింపి, దానికి ఎఫ్ఐఆర్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులను జతచేయాలి. ఫారం-4లో చికిత్స వివరాలు నింపి ఆస్పత్రిలో చికిత్స పొందిన రశీదును జరపరచాలి. ఒక వేళ వ్యక్తి చనిపోతే సంరక్షకులు లేదా భార్య బ్యాంకు ఖాతా, మృతుడి పోస్టు మార్టం నివేదిక, మరణ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి. దరఖాస్తులను కలెక్టరేట్‌లో సి సెక్షన్ అధికారికి అందజేస్తే, ఆయన వాటిని పరిశీలించి కలెక్టర్‌కు పంపుతారు. ఆ తర్వాత విచారణాధికారిగా ఆర్డీవో వ్యవహరిస్తారు. ఎఫ్ఐఆర్, ఇతర పూర్తి సమారాన్ని పోలీసులు సమర్పించాలి. ఆర్డీవో పరిశీలించి కలెక్టర్‌కు తుది నివేదిక ఇస్తారు. 15 రోజుల్లోగా కలెక్టర్ తుది ఉత్తర్వులు జారీ చేస్తారు. తర్వాత బాధితుడు, లేదా ఆయన కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాలకు నిబంధనల ప్రకారం పరిహారం జమ అవుతుంది. మృతులైతే రూ.2లక్షలు, క్షతగాత్రులైతే రూ. 50వేలు మంజూరవుతాయి.



### పెరిగిన పరిహారం

హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పరిహారాన్ని గతంలో కన్నా ఎనిమిది రెట్లు పెంచింది. హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన వ్యక్తి కుటుంబానికి ఇప్పటివరకు ఇస్తున్నది రూ.25వేలు మాత్రమే. దీనిని రూ.2లక్షలకు పెంచింది. గాయపడిన వారికి ఇచ్చే పరిహారాన్ని రూ.12500 నుంచి రూ.50వేలకు పెంచింది.

# వరిలో 'గేమ్ ఛేంజర్'

- కల్వలలో ప్రయోగాత్మకంగా 'డీఆర్ఆర్ ధాన్ 75' సాగు
- వరి పరిశోధన సంస్థ రూపొందించిన కొత్త వంగడం
- గాలివాన, తెగుళ్లను తట్టుకొని రెట్టింపు దిగుబడి ప్రత్యేకత
- ఎకరాకు 35 నుంచి 45 క్వింటాళ్ల చొప్పున గింజల వృద్ధి
- విత్తనం కోసం రైతుల నుంచి డిమాండ్

కేసముద్రం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరి రకాల్లో తక్కువ ఎత్తుతో గాలివానను, తెగుళ్లను తట్టుకొని రెట్టింపు దిగుబడి నిచ్చే గేమ్‌ఛేంజర్‌లాంటి వంగడాన్ని కేసముద్రం మండలం కల్వలలో ప్రైవేటు డిగ్రీ జంతు శాస్త్ర లెక్చరర్, రైతు చల్లా వెంకటేషం ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నాడు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ వరి పరిశోధన సంస్థ తొమ్మిదేళ్లు పరిశోధించి రూపొందించిన ఈ వంగడం విత్తనాలకు రైతుల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఇంకా మార్కెట్లోకి వాణిజ్యపరంగా ఈ విత్తనాన్ని సంస్థ విడుదల చేయలేదు. ఈ ఏడాది మే నెలలో ఆ సంస్థ నుంచి ఒక కిలో విత్తనం సంచి రైతు వెంకటేషానికి ఉచితంగా అందించారు. ఈ విత్తనాన్ని తనకున్న వరిలో ఐదు గుంటల్లో ఒక్కో పిలక చొప్పున నారును నాటి సాధారణ వరిలాగే సాగు చేశాడు. తక్కువ ఎత్తుతో వరికంకులకు విపరీతమైన గింజలతో ప్రస్తుతం ఈ రకం కోత దశకు వచ్చింది. బీపీటీ రకంలాగా ఉంటూ ఎత్తుతక్కువగా, తెగుళ్లను తట్టుకుంటూ అధిక దిగుబడి ఇచ్చే విధంగా వంగడాన్ని తయారు చేసినట్లు ఆ సంస్థ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**ఈ వరిలో అన్నీ విశేషాలే...**

'డీఆర్ఆర్ ధాన్ 75' రకం వరి వంగడంలో అన్నీ విశేషాలే. ఈ రకం వరి ఎత్తుతక్కువగా ఉండడం వల్ల సాధారణ రకం వరిలాగే గాలివానకు త్వరగా నేలవాలిపోదు. ఒక వరిమొక్క నాటగా 10 నుంచి 12 పిలకలు చొప్పున ఏర్పడి ఒక్కో వరికంకికి 300 నుంచి 450 గింజలు వేయడం విశేషం. సాధారణ బీపీటీ రకంలోనైతే 150 నుంచి 200 గింజలు ఉంటాయి. ఈ రకం అగ్గితెగులు, ఎండుతెగులు తట్టుకునేలా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. బీటీపీ రకం వరి అయితే వెయ్యి గింజల బరువు 12 నుంచి 13.5గ్రాములు ఉండగా ఈ రకం వరిలో వెయ్యి గింజల బరువు 16 గ్రాములు వస్తోంది. వెంకటేషం సాగు చేసిన ఐదు గుంటల వరిలో ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేలా గింజలు అభివృద్ధి చెందినట్లు తెలిపారు. ఈ లెక్కన ఎకరాకు 35 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి చొప్పున వస్తున్నట్లుగా వెంకటేషం చెబుతున్నారు. అన్నీ విశేషాలే ఉన్న ఈ రకం వరికి విపరీతంగా డిమాండ్ ఉండడంతో రైతులు ఎంతో ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ వరిధాన్యాన్ని తిరిగి విత్తనాలుగా ఉపయోగించే అవకాశం ఉండడంతో కిలో విత్తనాలను రూ.100 నుంచి రూ.150 చొప్పున ప్రయోగాత్మకంగా సాగు చేసిన కొన్ని ప్రాంతాల్లోని రైతులు విక్రయిస్తుండడం గమనార్హం. ఏదేమైనా వరి వంగడాల్లో విప్లవాత్మక మార్పును తీసుకువస్తూ, తెగుళ్లను, గాలివానను తట్టుకొని రెట్టింపు దిగుబడి నిచ్చే ఈ రకం విత్తనాన్ని వరిలో 'గేమ్‌ఛేంజర్'గా పలువురు రైతులు భావిస్తున్నారు.



కల్వలలో సాగు చేస్తున్న డీఆర్ఆర్ ధాన్ 75 రకం వంగడం పొలంలో అధికంగా వేసిన వరిగొలుసులు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా ఉన్నతాధికారులు

# మేడారం జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్
- హైదరాబాద్‌లో ములుగు కలెక్టర్ సహా అధికారులతో సమీక్ష

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోనరి మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ములుగు కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి ఆయా శాఖల ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతర ఏర్పాట్లను 8 జోన్లు, 31 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. జోన్-3 జంపన్నవాగు ప్రాంతంగా నిర్ణయించినట్లు తెలిపారు. మహాజాతర సమయంలో 10 నుంచి 12 వేల మంది పోలీసులు విధుల్లో పాల్గొంటారని, ప్రతీ జోన్‌ను ఒక జోనల్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. 24శాశ్వత టవర్లు, 20 సెల్ఆన్‌వీల్స్ 350 వైఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 49 పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి 6 లక్షల వాహనాలు నిలిపే సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ఏర్పాట్లు నవంబరు 30 నాటికి పూర్తవుతాయన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో 33 ఫారెస్టు రోడ్లను అభివృద్ధి చేయనున్నామని అన్నారు. వీటిలో భాగంగా వైల్డ్‌లైఫ్ శాంక్చువరీలోని రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.42 కోట్లతో ఆలయం చుట్టూ రహదారులు, రూ.92 కోట్లతో ప్రధాన రహదారులను నిర్మించనున్నట్లు తెలిపారు.

జాతర సమయానికి ముందు, మధ్య, తర్వాత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జాతర సందర్శనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జంపన్నవాగు వద్ద తాత్కాలిక రహదారి కూలిపోయిన కారణంగా మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయని, 517 బోరుపాయింట్లు, 250 కిలోమీటర్ల రహదారులపై లైటింగ్ పనులు జరుగుతున్నాయని అన్నారు. స్థానికుల సహకారంతో ఆరు స్లాటర్ సెంటర్లు ఏర్పాటయ్యాయని, జంపన్నవాగు పునరుద్ధరణ పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. 9,111 విద్యుత్ స్తంభాలు, 259 ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చే పనులను విద్యుత్‌శాఖ చేపట్టిందని, జాతర ప్రాంతమంతా ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతాయని వివరించారు. అన్ని శాఖలు సమన్వయంలో పనిచేసి మేడారం సమ్మక్క-సారలమ్మల మహాజాతర విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో లాఅండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ములుగు ఎస్పీ శబరీశ్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీతంపేటలో నేతకానిల కోలాహలం

- సందడిగా జోడెద్దుల విగ్రహాల నిమజ్జనం
- కోలాటం, ఆటపాటలతో ఊరేగింపు
- నేటితో ముగియనున్న ఉత్సవాలు

హసన్‌పర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే వినూత్నంగా మూడు రోజుల పాటు నిర్వహించే సీతంపేట నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ వేడుకలు గురువారంతో ముగియనున్నాయి. బుధవారం నేతకానీల కుటుంబ సభ్యులంతా కేదారీశ్వరస్వామి వ్రతం నోముకొని జోడెద్దుల విగ్రహాలకు పిండివంటలతో చేసిన నగల (నాగళి, కోల, దుత్తలు, గొడుగు)తో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, వ్యవసాయం సజావుగా సాగాలని, అధిగ దిగుబడులు రావాలని, పిల్లాపాపలను చల్లగా ఉండాలని వేడుకున్నారు.



జోడెద్దుల విగ్రహాలను ఊరేగిస్తున్న నేతకాని కులస్తులు

**జోడెద్దుల ప్రతిమల నిమజ్జనం**

మూడు రోజుల పాటు జరిగే ఈ దీపావళి బతుకమ్మ వేడుకల్లో బుధవారం పురుషుల ఘట్టం ప్రారంభమైంది. కేదారీశ్వర వ్రతం ముందు ఏర్పాటు చేసిన జోడెద్దుల ప్రతిమలకు ప్రత్యేకంగా అలంకరించిన నగలతో కూడిన ప్రతిమలను తీసుకొని కోలాటంతో ఊరేగింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకున్నారు. అనంతరం కుంట వద్ద జోడెద్దుల ప్రతిమలకు కుల పెద్దలు ఆరగింపు చేసి పిండి వంటలతో చేసిన నగలను తీసి ఒకరికొకరు తినిపించుకొని వరుసైన వారితో (మగవారు మాత్రమే) రంగులు చల్లుకొని జోడెద్దులను నిమజ్జనం చేశారు. ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగరిత్యా ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన నేతకాని కులస్తులు ఈ వేడుకల్లో పాల్గొని తమ కుటుంబ సభ్యులతో సంబురంగా గడిపారు. పురుషుల కోలాటం, పాటలు గ్రామస్థులను అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనగాం శరత్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బండారి రజిత చేరాలు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జాడి రాజీవ్‌గాంధీ, గోళ్ల రాజయ్య, నేతకాని కుల పెద్దలు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

**నేటితో ముగియనున్న వేడుకలు**

నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ వేడుకలు మూడోరోజు గురువారం ముగియనున్నాయి. మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన నేతకాని కులస్తులు మాత్రమే ఈ వేడుకలు దీపావళి పర్వదినం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించుకుంటారు. ఈ ప్రాంత నేతకాని కులస్తులు స్త్రీ, పురుషులు వేర్వేరుగా జరుపుకునే ఈ దీపావళి బతుకమ్మ వేడుకలకు ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన నేతకాని కులస్తులు, వారి బంధువులు పెద్ద సంఖ్యలో సీతంపేటకు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ పండుగను నేతకాని కులస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.



పాటలు పాడుతున్న నేతకాని కుల పెద్దలు



కుంట వద్ద జోడెద్దుల విగ్రహాలకు హారతి ఇస్తున్న నేతకాని కులస్తులు

# రేపు కేయూలో కాళోజీ ఎండోమెంట్ లెక్చర్

కేయూ క్యాంపస్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు 9వ ఎండోమెంట్ లెక్చర్ అక్టోబరు 24న శుక్రవారం ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ భాష, సాంస్కృతిక విభాగం డైరెక్టర్ ఎనుగు నరసింహరెడ్డి హాజరై 'సాయుధ పోరాటం, తొలిమలిదశ ఉద్యమాలు :కవిత్వం' అనే అంశంపై కీలక ప్రసంగం చేస్తారని వెల్లడించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులతో పాటు ఉద్యోగలందరూ హాజరుకావాలని రిజిస్ట్రార్ రామచంద్రం కోరారు.

# అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎస్ఏ పరీక్షలు

- ఈనెల 24 నుంచి ప్రారంభం.. అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా పరీక్షల బోర్డు ప్రశ్నాపత్రాలతోనే పరీక్షలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఈవో వాసంతి



హనుమకొండ, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సంగ్రహణాత్మక మూల్యాంకనం-1 (ఎస్ఏ) పరీక్షలు ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయని హనుమకొండ జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) చైర్మన్, జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి, డీసీఈబీ కార్యదర్శి బి.రాంధన్‌లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వతరగతి వరకు విద్యా భ్యాసం చేస్తున్న ప్రతీ విద్యార్థి పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమంలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డుకు ఫీజు చెల్లించిన ప్రకారం 6వతరగతి నుంచి 10వతరగతి వరకు 56,194 మంది విద్యార్థులు, 1వ తరగతి నుంచి 5వతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 14,646 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. వీరిలో తెలుగు మాధ్యమంలో 200, ఇంగ్లీష్‌లో 14,097, ఉర్దూలో 349 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో 267, ఇంగ్లీష్‌లో 55,766, ఉర్దూలో 161మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన టైం టేబుల్‌ను అనుసరించి అన్ని యాజమాన్యాలు హనుమకొండ జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సరఫరా చేసిన ప్రశ్నపత్రాలతోనే విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల నిబంధనలు ఉల్లంఘించినట్లయితే నియమావళి 25 (1997) చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు మండల విద్యాధికారుల నుంచి పరీక్షకు ఒక రోజు ముందుగా ప్రధానోపాధ్యాయులు ప్రశ్నపత్రాలు తీసుకొని వెళ్లి సీనియర్ ఉపాధ్యాయుడు జాయింట్ కస్టోడియన్‌గా ప్రశ్న పత్రాలను పాఠశాలలో భద్రపరచాలని కోరారు. మండల విద్యాధికారులు ఎంఎస్ఓలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించాలని కోరారు.

# మార్కెట్ అంటే లెక్కలేదా!?

- నిర్వహణను గాలికి వదిలేసిన ప్రభుత్వం
- పూర్తిస్థాయి కార్యదర్శి లేక ఇబ్బందులు
- మూడేళ్లుగా పాలకవర్గం ఖాళీ
- మద్దతు ధర, మౌలిక సదుపాయాలు నిల్
- సమస్యలతో సతమతమవుతున్న రైతులు
- ఇటువైపు కన్నెత్తి చూడని పాలకులు
- అధ్వాన స్థితిలో ఏనుమాముల మార్కెట్

వరంగల్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆసియాలోనే రెండో అతిపెద్దదిగా గుర్తింపు పొందింది. అంతటి పేరున్న ఈ మార్కెట్ ప్రస్తుతం నిరాదరణకు గురవుతోంది. కొన్నేళ్లుగా పాలకులు పట్టించుకోకపోవడంతో అనేక సమస్యలతో సతమతమవుతోంది. పాలకవర్గం లేదు.. కార్యదర్శి లేడు.. తగినంత సిబ్బంది లేరు.దీంతో మద్దతు ధరలు పట్టించుకున్నవారు లేకుండాపోయారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు సమస్యలను ఎవరికిచెప్పుకోవాలో తెలియని గందరగోళం ఏర్పడింది. దీంతో అందరిలో నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. ముఖ్యంగా రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే దారం తెగిన గాలిపటంలా తయారైంది మార్కెట్ పరిస్థితి.



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్

**రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్..**

రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్‌కు ప్రభుత్వం కార్యదర్శిని నియమించలేదు. పోలెపాక నిర్మల సస్పెన్షన్‌కు గురైన తరువాత ఆ స్థానంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి గుగులోతు రెడ్యాకు అదనపు బాధ్యతలను కట్టబెట్టారు. ఆయన ఇటీవల నెల రోజుల పాటు లీవ్ పెట్టారు. దీంతో గ్రేడ్ 2 కార్యదర్శి రాము అనధికారికంగా ఇన్‌చార్జి కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

**పాలకవర్గం లేక మూడేళ్లు..**

మార్కెట్‌కు పాలకవర్గం లేక దాదాపు మూడేళ్లు కావస్తోంది. ఈ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే నిర్లక్ష్యం చేసిందంటే.. కాంగ్రెస్ సర్కారు కూడా అదేబాటలో నడుస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చి రేండెళ్లు గడిచినా ఇంతవరకు అతీగతీ లేకుండా పోయింది. గత ఫిబ్రవరిలో పాలకవర్గాన్ని నియమించినప్పటికీ అది చెల్లనిరూపాయిగా మిగిలిపోయింది. పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చిన మరుసటి రోజే ఎన్నికల కోడ్ రావడం, మరోవైపు వర్గపోరు తెరపైకి రావడంతో అధిష్ఠానం ఈ విషయాన్ని కోల్డ్‌స్టోరేజీలో పెట్టింది. ఇక అప్పటి నుంచి ఇప్పటివరకు వ్యవసాయశాఖ మంత్రిగానీ, జిల్లా మంత్రి గానీ, ఎమ్మెల్యేలు గానీ పట్టించుకున్న పాపానపోలేదు.

**సిబ్బంది కొరత..**

మార్కెట్‌లో 119 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా కేవలం 35మందితో నడిపిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇరువై ఏళ్లగా మార్కెట్‌లో పనిచేసిన వారు ఉద్యోగ విరమణ చేస్తుంటే ఖాళీలు ఏర్పడుతున్నాయే తప్ప కొత్తగా ఉద్యోగాలను భర్తీ చేసింది లేదు. టార్గెట్లు పెట్టి మరీ మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్న ప్రభుత్వం మార్కెట్లో ఉద్యోగాలను భర్తీ చేయడంలో మాత్రం శ్రద్ధ చూపడంలేదని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**అమలుకాని మద్దతు ధరలు**

ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు మార్కెట్లో గిట్టుబాటు ధరలు పలుకడం లేదు. పత్తి, మక్కజొన్న, కందులు, పెసళ్లు, నువ్వులు, పల్లికాయ ఏ పంట తీసుకునాన క్వింటాళ్‌కు వంద నుంచి వెయ్యి రూపాయల వరకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మరోవైపు పత్తి సీజన్ మొదలైంది. సీసీఐ కేంద్రాలను ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటికీ తేదీ నిర్ణయించకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**సమస్యలు పరిష్కరించే వారేరి..?**

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌తో పాటు లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్, ఇటీవల కొత్తగా ముసలమ్మకుంటలో ప్రారంభించిన మామిడి మార్కెట్.. ఇలా ఏ మార్కెట్లో చూసినా కనీస సౌకర్యాలు కనిపించడంలేదు. ఏకంగా మంత్రి కొండా సురేఖ, మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలే అమలు కాలేదంటే పరిస్థితి ఏవిధంగా అర్థం చేసుకోవచ్చని రైతు సంఘాలు మండిపడుతున్నాయి.

ఏనుమా ముల మార్కెట్ లో సీసీ కెమెరాలు కూడా లేవంటే ఇంతకంటే దురదృష్టకరమైన విషయం ఏమైనా ఉంటుందా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కెఆర్.నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి ఏను మాముల మార్కెట్‌ను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి జిల్లా రైతులు డిమాండ్ చేసున్నారు.

# 'కపాస్' యాప్ ద్వారా మద్దతు ధర

- రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా
- జిల్లా అధికారులతో కలిసి ఏనుమాముల మార్కెట్ సందర్శన

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తికి మద్దతు ధర పొందాలంటే ముందుగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రొక్యూర్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ యాస్మీన్ బాషా పత్తి రైతులకు సూచించారు. బుధవారం ఆమె వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డితో కలిసి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. అదేవిధంగా మార్కెటింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, వరంగల్ డీఏవో అనురాధ, హనుమకొండ డీఏవో రవీందర్ సింగ్, మార్కెట్ గ్రేడ్ 2కార్యదర్శి అంజిత్‌రావు, ఏఎస్ రాజేందర్‌లతో కలిసి పత్తి యార్డులో పర్యటించారు. రైతులతో మాట్లాడి ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పత్తి నాణ్యత తగ్గకుండా చూసుకోవాలని, గుడ్డి పత్తిని మంచి పత్తితో కలుపవద్దని, తద్వారా మంచి పత్తికి కూడా ధర రాకుండా పోతుందని అన్నారు. రైతులు గ్రామాలలోనే వ్యవసాయ శాఖ అధికారుల వద్ద పంట వివరాలతో పాటు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పత్తి అమ్ముకోవాలి అన్నప్పుడు సెల్‌ఫోన్‌తో కపాస్ కిసాన్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని వచ్చిన వెంటనే పత్తి కొనుగోలు చేస్తారని రైతులకు వివరించారు. అనంతరం మార్కెట్ పరిధిలోని శ్రీరాజ్ కాటన్ ఇండస్ట్రీ మిల్లును పరిశీలించారు. మిల్లు యజమానితో మాట్లాడుతూ.. కపాస్ కిసాన్‌యాప్‌కు సంబధించిన సమాచారం తెలిసేలా పెద్దగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్, స్లాట్ బుకింగ్‌పై రైతులకు పూర్తి అవగాహన కలిగించేలా గ్రామాలలో ప్రచారం చేయించాలన్నారు. వీడియో రికార్డుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అధికారులను దేశించారు. ఈ సందర్భంగా కాటన్ సెక్షన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, నాగభూషణం యాస్మీన్ బాషాకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.



శ్రీరాజ్ పత్తి మిల్లును సందర్శించిన యాస్మీన్ బాషా, ఇతర అధికారుల బృందం

# యాసంగి వేళ విత్తనాల ఎంపికే కీలకం

వర్ధన్నపేట అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం పంటలు ఇపుడిపుడే చేతికందుతుండగా మరో వైపు యాసంగి వరితోపాటు కంది, పెసర, కూరగాయలు, శనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు తదితర పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విత్తనాల కొనుగోలులో అవలంబించాల్సిన విధానాలను వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ వివరించారు. నాణ్యమైన విత్తనాలు వంద శాతం జన్యు, 98 శాతం బాహ్య స్వచ్ఛత కలిగి ఉంటాయి. పంటను బట్టి 75 శాతం నుంచి 90 శాతం మొలకెత్తే శక్తి ఉంటుంది. ధాన్యంలో 10-12 శాతం, అపరాల్లో 8-9 శాతం తేమ ఉండేవాటిని కొనుగోలు చేయాలి. అంతర్గత చీడపీడలు లేనివాటిని ఎంచుకోవాలి.

**బిల్లులు తప్పనిసరి..**

విత్తనాల కొనుగోలు చేసేటపుడు గుర్తింపు పొందిన సంస్థల నుంచి తీసుకోవాలి. బిల్లుపై విక్రయదారు సంతకంతో పాటు విత్తన రకం, ఉత్పత్తి చేసిన సంస్థ పేరు, లాట్ నెంబర్ వంటి వివరాలు తప్పకుండా ఉండాలి. గడువు తేదీని పరిశీలించాలి. సీలు సరిగా లేకున్నా.. చిరిగినా లేదా పాడైన సంచులు, డబ్బాలను ఎట్టిపరిస్థితుల్లో తీసుకోవద్దు. వ్యవసాయశాఖ అనుమతిలేని విత్తనాలను లైసెన్స్ లేని అపరిచిత వ్యక్తుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దు.

**సంచులపై వివరాలు..**

పరీక్ష చేసిన తేదీ నుంచి 9 నెలల కాల పరిమితి దాటినవి కొనుగోలు చేయవద్దు. ఆకుపచ్చ, నీలిరంగు ట్యాగ్ ఉంటేనే ధృవీకరించినవి అనే విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలి. ఆకుపచ్చ, తెలుపు రంగు ట్యాగ్ కలిగినవి మూల విత్తనం. నీలిరంగు, తెల్లట్యాగ్ ఉంటే ధృవీకరణ చేసిన అధికారి సంతకం చేసి ఉంటుంది. ఏ ప్రాంతానికి ఏ కాలానికి అనువైనవి, ఆమోదించిన జీఈఏసీ నెంబరును చూసుకోవాలి.

## ఆర్ట్స్ కాలేజీలో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరిజ్యోతి పరీక్ష హాళ్లను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులను అడిగి వారు పరీక్షలు రాస్తున్న తీరును తెలుసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం నవంబరు 14వరకు పరీక్షలు కొనసాగుతాయని, అన్ని పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, పరీక్షల పరిశీలకులు ఎం.శ్రీనివాస్, శ్రీదేవి పాల్గొన్నారు.



పరీక్ష తీరును పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి, తదితరులు



వెంకయ్యకు ఉత్తర్వులు ఇస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రంలు

## కేయూ జువాలజీ కొత్త విభాగాధిపతిగా వెంకయ్య

కేయూ క్యాంపస్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేయూ జువాలజీ కొత్త విభాగాధిపతిగా ప్రొఫెసర్ వై.వెంకయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటి వరకు విభాగాధిపతిగా కొనసాగిన షమిత నుంచి ప్రొఫెసర్ వెంకయ్య గురువారం బాధ్యతలను చేపడుతారు. ఉత్తర్వులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి తనచాంబర్‌లో ప్రొఫెసర్ వెంకయ్యకు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఈసం నారాయణ, కట్ల రాజేందర్, మామిడాల ఇస్తారీలు పాల్గొని అభినందించారు.

## నాయిని నర్సింహరెడ్డి వర్ధంతి

హనుమకొండ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలక భూమిక పోషించి హోంశాఖ మంత్రిగా, కార్మిక శాఖ మంత్రిగా తెలంగాణ ప్రజలకు ఎనలేని సేవలు చేసిన నాయిని నర్సింహారెడ్డి అని బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్‌గౌడ్, పశ్చిమ నియోజక వర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నాయిని నర్సింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేష్




వడ్డెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పట్టణానికి చెందిన గోల్కొండ రాజేష్ బహుజన్ రాజ్యాధికార పార్టీ (బీఆర్పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆ పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

## కనులపండువగా కార్తీక మాసోత్సవం

### తరలివచ్చిన భక్తులు - ప్రత్యేక పూజలు

వడ్డెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని నాగరాజ రాజేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం కార్తీక మాసోత్సవం కనులపండువగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఛైర్మన్ కుందూరు అనిల్‌రెడ్డి, కార్యదర్శి ఇ. కొండల్‌రావు, కోశాధికారి పి.విద్యాసాగర్ పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకుడు జీవన్‌శర్మ గణపతి పూజ, రక్షాబంధనం, స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆకాశ దీప పూజను భక్తి ప్రపత్తులతో జరిపించారు. భక్తుల భజన, కీర్తనల ఆలాపనతో ఆలయ పరిసర ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఎన్జీవోస్ కాలనీ, వడ్డెపల్లి, స్నేహనగర్, శ్రీమహాలక్ష్మి కాలనీ, భవాని నగర్, అమరావతి నగర్, టీఎన్జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల నుంచి భక్తులుపెద్ద సంఖ్యలోవచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



నాగరాజ రాజేశ్వర స్వామి మూల విరాట్

## 42 శాతం రిజర్వేషన్లు కల్పించేంత వరకు పోరాటమే..

### బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి రమేష్




మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నేతలు

వడ్డెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాటం తప్పదని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా ప్రతినిధి డాక్టర్ కె. వీరస్వామి, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రకటించిన హామీ మేరకు బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వేర్వేరు బిల్లులను ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించినట్లు పేర్కొన్నారు.

ఆ రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించడానికి ఈ నెల 24న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు చిరంజీవులు, చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య, డాక్టర్ విశారదన్ మహారాజ్, బాలరాజు గౌడ్ నేతృత్వంలో జరిగే మహాధర్నాకు బీసీలంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధులు ప్రొఫెసర్ విజయబాబు, ప్రొఫెసర్ రాములు, డాక్టర్ ఎ. తిరుపతి, కొలిపాక ప్రకాష్, విక్రమ్, పొదిల సాయిబాబు, మేకల సుమన్, చెక్క సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో హైడ్రా కమిషనర్ జన్మదిన వేడుకలు

### మదర్‌థెరిసా ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న సయ్యద్ అసద్

వరంగల్‌సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ జన్మదినోత్సవాన్ని బుధవారం వరంగల్‌లో ఘనంగా నిర్వహించారు. కాశిబుగ్గ సొసైటీకాలనీలో గల మదర్ థెరిసా మానసిక వికలాంగుల ఆశ్రమంలో దివ్యాంగుడు సయ్యద్ అసద్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ అసద్ మాట్లాడుతూ.. హైడ్రా వరంగల్‌కు కూడా రావాలని ఆకాంక్షించారు.

# ముస్తాబవుతున్న మ్యూజికల్ గార్డెన్

- రూ.10 కోట్లతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- డిజిటల్ వాటర్‌ఫాల్స్, అధునాతన లేజర్ షో
- శుభకార్యాల కోసం 'పార్టీ కార్నర్' రెడీ
- నెల రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి..
- నవంబర్‌లో సీఎం చేతుల మీదుగా పునఃప్రారంభం

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓవైపు స్విమ్మింగ్ పూల్.. మరో వైపు పురాతన శిల్ప సంపదతో కూడిన మ్యూజియం.. పక్కనే ఆకాశంలో చుక్కలను లెక్కించే ప్లానిటోరియం.. మరి కొద్ది దూరంలో చరిత్రాత్మక భద్రకాళి దేవాలయం.. వీటన్నింటినీ ఆనుకుని ఆహ్లాదం కలిగించే ఉద్యానవనం ప్రజల ముందుకు రాబోతోంది. వరంగల్ నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దే పనుల్లో భాగంగా వరంగల్ మ్యూజికల్ గార్డెన్ (కేఎంజీ) అత్యంత సుందరంగా ముస్తాబవుతోంది. ఇందుకోసం కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) సుమారు రూ. 10కోట్లు కేటాయించింది. ఆరు మాసాలుగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు కొత్త సొబగులు అద్దుతున్నారు. 1995లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన కేఎంజీ 2019 కరోనా కాలంలో మూత పడింది. దీనిపై కుడా అధికారులు స్పందించి గత ఆరుమాసాలుగా మెరుగులు దిద్దుతున్నారు.



ఆహ్లాదకర పచ్చదనంతో కూడిన ప్రకృతి




చిన్న పిల్లల మినీ జిమ్ పరికరాలు

### లేజర్, మ్యూజికల్ షో ఏర్పాటు..

నగరంలో ఎక్కడా లేని విధంగా మ్యూజికల్ గార్డెన్‌లో గతానికి భిన్నంగా లేజర్ షో, మ్యూజికల్ షో ప్రదర్శించేందుకు కావలసిన ఏర్పాట్లు చేశారు. జపాన్ టెక్నాలజీతో కూడిన మిషనరీలను ఇప్పటికే అమర్చి ట్రయల్ రన్ కూడా చేశారు. సంగీతానికి అనుగుణంగా నీటి జలపాతం రంగురంగుల లైటింగ్‌తో ఆకాశాన్ని తాకుతున్నట్టు ప్రజలను ఆహ్లాదపరిచే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నా యి. అదనంగా లేజర్ షోతో పాటు ఆధునిక సౌండ్ సిస్టం,మ్యూజికల్ ఫౌంటెన్లు నగర ప్రజలకు కొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. ఇంకా పార్క్ మొత్తం గ్రీనరీ పెంచి రకరకాల మొక్కలను అభివృద్ధి చేశారు. పెద్దవాళ్లకు జిమ్ సౌకర్యంతో పాటు పిల్లలకు ఆట వస్తువులు మినీ చిల్డ్రన్ పార్క్ అందుబాటులోకి తెస్తున్నారు. ఇంకా ఫుడ్ కోర్టుతో పాటు చిన్న చిన్న పక్షుల సవ్వడి వినిపించేవిధం గా అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.



లేజర్ షో వద్దకు వెళ్లే నూతన రహదారి



ఆరోగ్యం కోసం వాకింగ్ ట్రా

### పార్టీ కార్నర్ అభివృద్ధి పనులు..

మ్యూజికల్ గార్డెన్‌లో గతంలో లేని విధంగా సామాన్య మధ్యతరగతి ప్రజలు చిన్నపాటి శుభకార్యాలు ఇక్కడే జరుపుకునేందుకు పార్టీ కార్నర్‌ను సిద్ధం చేస్తున్నారు. చిన్నపాటి మినీ హాల్‌లో ఫుడ్ కోర్టు ఏర్పాటు చేసి నిర్వాహకుల అనుమతిలో సంబరాలు జరుపుకోవచ్చు. లేజర్ లైటింగ్ సిస్టం, మ్యూజికల్ షో వీక్షించేందుకు సుమారు 500 కుర్చీలను పర్మినెంట్‌గా అమర్చి పర్యాటకులకు అందుబాటులోకి తెస్తున్నారు. సుమారు 20 నిమిషాల పాటు ఈ ప్రదర్శన జరుగుతుందని ఈఈ భీంరావు తెలిపారు. బట్టర్ ఫ్లై, లోటస్ పౌండ్‌లు నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. వాకింగ్ ట్రాక్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

### రెండో వారంలో ప్రారంభం..

పనులు చివరి దశకు చేరుకున్నాయని, నవంబర్ రెండో వారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కేఎంజీని పునఃప్రారంభిస్తామని అధికారులు వెల్లడించారు. ఆరు మాసాలుగా పనులు జరుగుతున్నాయని. సుమారు రూ. 10 కోట్లతో అధునాతన పరికరాలు ఏర్పాటు చేశామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.



లేజర్ లైటింగ్, మ్యూజికల్ షో ప్రాంతం



బటర్‌ఫ్లై పాయింట్

### మధ్యతరగతి వారికి ప్రయోజనం..



వరంగల్ నగరంలో ప్రస్తుతం ఎంత చిన్న శుభకార్యం నిర్వహించుకోవాలన్నా వేలల్లో డబ్బులు ఖర్చు అవుతున్నాయి. కాని, కొద్ది రోజుల్లో అందుబాటులోకి వస్తున్న కేఎంజీలోని పార్టీ కార్నర్‌లో ప్రజలు అతి తక్కువ ఖర్చుతో శుభకార్యాలు జరుపుకోవచ్చు. మధ్యతరగతి ప్రజలకు ఇది ఒక సువర్ణ అవకాశం. ఇక రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ లేజర్ లైటింగ్, మ్యూజికల్ షో ప్రజలకు ఆహ్లాదాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు.

- ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, కుడా చైర్మన్

# ఘనంగా కొమురం భీం జయంతి

కేయూ క్యాంపస్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల అస్తిత్వ పోరాట యోధుడు కొమురంభీం 124వ జయంతిని పురస్కరించుకుని కేయూలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు ఘనంగా నివాళులర్పించారు. కేయూ పరిపాలన భవనంలో బుధవారం కొమురంభీం చిత్రపటానికి వర్సిటీ ఉన్నతాధికారులు, ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది నేతృత్వంలో పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంలు మాట్లాడారు. కొమురంభీం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. జల్, జంగిల్, జమీన్ నినాదంతో పోరాడిన యోధుడన్నారు. కేయూలో కొమురంభీంపై జాతీయ సదస్సు నిర్వహిస్తామన్నారు. కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. పోడు గిరిజనుల భూములకు పట్టాలిప్పిచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, బి.రమ, నిమ్మ సుదర్శన్, చిర్రా రాజుగౌడ్, సుకుమారి, మల్లం నవీన్, ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్, వై.వెంకయ్య, మల్లారెడ్డి, ప్రసాద్, వెంకట్రామిరెడ్డి, డి.రమేశ్, ప్రసాద్, వాసుదేవారెడ్డి, రాజునాయక్, సవితాజ్యోత్స్న, మమత, ఏఆర్ సీహెచ్.ప్రణయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొమురం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- హనుమకొండ టౌన్ : జల్ జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీం అని మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా కొమురం భీం జయంతి వేడుకలు నిర్వహించారు. కొమురం భీం ఆశయాలను కొనసాగించాలని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మేకల బాబురావు, బీఆర్ఎస్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు బండి రజినీకుమార్, నాయకులు సల్వాజి రవీందర్‌రావు, గౌస్ ఖాన్, సౌరం రఘు, మహేష్, చాగంటి రమేష్, బైరపాక ప్రశాంత్, పెరుకారి శ్రీధర్‌రావు, దేవమ్మ, వరుణ్, సంపతి రఘు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటమే

### బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి రమేష్

వడ్డెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాటం తప్పదని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా ప్రతినిధి డాక్టర్ కె. వీరస్వామి, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రకటించిన హామీ మేరకు బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వేర్వేరు బిల్లులను ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించినట్లు పేర్కొన్నారు. ఆ రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించడానికి ఈ నెల 24న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు చిరంజీవులు, చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య, డాక్టర్ విశారదన్ మహారాజ్, బాలరాజు గౌడ్ నేతృత్వంలో జరిగే మహాధర్నాకు బీసీలంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధులు ప్రొఫెసర్ విజయబాబు, ప్రొఫెసర్ రాములు, డాక్టర్ ఎ. తిరుపతి, కొలిపాక ప్రకాష్, విక్రమ్, పొదిల సాయిబాబు, మేకల సుమన్, చెక్క సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఖిలావరంగల్,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో బుధవారం దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) 19వ, వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ను ఎగురవేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘీ ఏలేందర్, అధ్యక్షుడు జన్ను రవి మాట్లాడుతూ.. దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కోసం దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఏర్పడిందని అన్నారు. 2006 అక్టోబరు 22న, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణంలో ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి అంటరానితనం, కులవివక్ష, సామాజిక బహిష్కరణలపై పోరాడుతోందని అన్నారు. కులవివక్షను ఎదుర్కొనే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లాకార్యదర్శి ఎస్‌కే బాషుమియా, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల ఎల్లయ్య, నాయకులు పనాస ప్రసాద్, గుండె బద్రీ, గన్నారపు రమేష్, తాళ్ళపెల్లి జాన్‌పాల్, డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రాచర్ల రాజేందర్, నాయకులు జన్ను రాజు, ఇనిగేల శ్వేత, వేల్పుల నర్సింగరావు, జన్ను దీపిక, ఉషా తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి సంఘీ ఏలేందర్



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

## సాదాబైనామాల భూములను క్రమబద్ధీకరించాలి

వడ్డెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుడా పరిధిలోని భూములకు సాదాబైనామాల చట్టం వర్తింప జేయాలని అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి మహేందర్ కోరారు. బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుడా పరిధిలోని భూములను చాలా మంది రైతులు సాదాబైనామాల ద్వారానే కొనుగోలు చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సాదాబైనామాలపై దృష్టి సారించి వాటిని క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసైన్డ్ భూమి సమితి నేత మాదాసి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి పరపతి సంఘం ఆవిర్భావం

వరంగల్ సిటీ, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కాశిబుగ్గ ప్రాంతంలో బుధవారం పద్మశాలి పరపతి సంఘం ఆవిర్భవించింది. సుమారు 150 మంది పద్మశాలి యువకులంతా కలిసి ఈ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి సంఘం కార్యకలాపాలను ప్రారంభించారు. అధ్యక్షుడిగా గుల్లపల్లి రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గోరంటాల మనోహర్, కోశాధికారిగా పోతన లక్ష్మి నర్సింహస్వామి, ఉపాధ్యక్షుడిగా వేముల నాగరాజు, సహాయ కార్యదర్శులుగా మాటేటి విద్యాసాగర్, ములుక సురేష్‌తో పాటు గౌరవసలహాదారులు, సహ కోశాధికారులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గుల్లపల్లి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ నెల12వ తేదీన సంఘం డబ్బులు చెల్లించాలని, సభ్యులందరి సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామని అన్నారు.



జపాన్ రాజకీయాల్లో ఒక కొత్త యుగం ప్రారంభమయింది. జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకైచి ఎంపికయ్యారు. 'ఐరన్ లేడీ' అని జపాన్ మీడియా ముద్దుగా పిలుచుకొనే తకైచికి ఆధునిక సంగీతమంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు ఒక మ్యూజిక్ బ్యాండ్‌లో భాగస్వామి కూడా..

# జపాన్‌లో ఐరన్ లేడీ

"ఎలిమెంటరీ స్కూల్లో ఉన్నప్పుడు 'బ్లాక్ సాబాత్' మ్యూజిక్ బ్యాండ్ పాటలు వింటూ ఉండేదాన్ని. హైస్కూల్‌కు వచ్చిన తర్వాత బమ్, స్మోక్ ఆన్ ది వాటర్ లాంటి పాటలు వినటం మొదలుపెట్టా. ఈ సమయంలోనే బాస్ గిటార్, కీబోర్డ్, డ్రమ్స్ వాయించటం నేర్చుకున్నా. ఒక బ్యాండ్‌లో భాగస్వామి నయ్యా! 'రోలింగ్ స్టోన్స్' ఆల్బమ్‌లోని 'జంపింగ్ జాక్ ఫ్లాష్' లాంటి పాటలు పాడే దాన్ని. ఆ తర్వాత హైస్కూల్లో ఉన్న ఆడపిల్లలందరం కలిసి ఒక బ్యాండ్ పెట్టాం..." అంటారు తకైచి. ఇప్పటికీ ఆమె డ్రమ్స్ వాయిస్తూనే ఉంటారు. తనకు సంతోషం వచ్చినా.. దుఃఖం వచ్చినా డ్రమ్స్ వాయిస్తానంటారు. "కొన్ని సార్లు నాకు, నా భర్తకు మధ్య దెబ్బలాటలు అవుతూ ఉంటాయి. ఆయన మాట్లాడే మాటలు కానీ, ఆయన ప్రవర్తన కానీ నాకు నచ్చదు. అలాంటి సమయంలో ఆయన పడుకున్న తర్వాత ఎలక్ట్రానిక్ డ్రమ్స్ వాయిస్తా. దీని వల్ల నాలో ఉన్న కోపం అంతా పోతుంది" అంటారు తకైచి.

**చిన్నతనంలో...**

తకైచి పుట్టింది.. పెరిగింది జపాన్‌లోని నారా అనే ప్రాంతంలో. హైస్కూల్ పూర్తయిన తర్వాత ఆమె కోబే విశ్వవిద్యాలయంలో చేరి పట్టభద్రురాలయ్యారు. చిన్నప్పటి నుంచి రాజకీయాలంటే ప్రత్యేక ఆసక్తి ఉండటంతో 1990లలో లిబరల్ డెమోక్రటిక్ పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. షిన్ జో అబీ, ఫ్యూమో కిషిదాలు ప్రధానులుగా ఉన్న సమయంలో తకైచికి ప్రభుత్వంలో మంచి ప్రాధాన్యత లభించింది. వారి కేబినెట్‌లలో ఆమె మంత్రిగా పనిచేశారు. ఒకప్పటి బ్రిటిష్ ప్రధాని మార్గరెట్ థాచర్‌ను తన రోల్ మోడల్‌గా భావించే తకైచిని జపాన్ మీడియా - 'ఐరన్ లేడీ' అని ముద్దుగా పిలుచుకుంటుంది. ప్రస్తుతం జపాన్ సమాజంలో వృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉంది. యువతీ, యువకుల సంఖ్య తక్కువగా ఉంది. అంతే కాకుండా పాశ్చాత్య సంస్కృతి జపాన్‌లోకి చాపకింద నీరులా ప్రవేశించిందనే విమర్శలు వినిపిస్తూ ఉంటాయి. వీటన్నింటిపైనా తకైచి దృష్టి పెట్టాల్సి ఉంది. అందుకే తకైచి తన ప్రసంగాల్లో దీన్నే ప్రధానమైన విషయంగా ప్రస్తావించారు. "నేను నా హామీలను నిలబెట్టుకుంటాను. ప్రతి తరాన్ని కలుపుకొని ముందుకు వెళ్లినప్పుడే అభివృద్ధి సాధించగలుగుతాం. మనం కొద్ది మందే ఉన్నాం. అందువల్ల అందరం గుర్రాల్లా పనిచేద్దాం. నేను కూడా వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ అనే సూత్రాన్ని పక్కన పెట్టి పనిచేస్తాను. నేను పనిచేస్తూనే ఉంటాను..." అని ఆమె చేసిన వ్యాఖ్యలకు జపాన్‌లో సంచలనం చెలరేగింది. తన ముందు ఉన్నది పూలబాట కాదనే విషయం తకైచికి తెలుసు. ఈ విషయాన్ని కూడా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావించారు. "నేను ఇప్పుడు ఆనందంగా లేను. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో నాకు అర్థమవుతోంది. మనందరం కలిసి చాలా పనులు చేయాల్సి ఉంది. మనం అందరం కలిసి ఎల్‌డీఎఫ్‌ను నిలబెడదాం. ప్రజల ఆందోళలను ఆశలుగా మార్చే పార్టీగా తీర్చిదిద్దుదాం" అని ఆమె పేర్కొన్నారు.

"పంటల సాగులో పురుగుల మందులను, రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తే ప్రాణాలకే ముప్పు. ఇది నేను అనుభవంతో చెబుతున్న మాట" అంటున్నారు యర్రు స్వాతి. గుంటూరు జిల్లాకు చెందిన ఆమె బ్రెయిన్ ట్యూమర్ బారిన పడ్డారు. కలుషితమైన పదార్థాలే దీనికి కారణమని గుర్తించి, సేంద్రియ సేద్యాన్ని చేపట్టారు. నాణ్యమైన ఉత్పత్తులతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడమే కాదు... ఇటీవల ప్రధాని మోదీ ప్రశంసలనూ అందుకున్న స్వాతి స్ఫూర్తిమంతమైన ప్రయాణం ఇది.



# సేంద్రియమే ఆరోగ్యరక్ష

"ఇంట్లో వండేవి, తినేవీ అన్నీ సహజసిద్ధమైనవే అయి ఉండాలి... ఇది పదేళ్ల క్రితం నేను తీసుకున్న నిర్ణయం. నాకు బ్రెయిన్ ట్యూమర్ ఉందని వైద్యులు నిర్ధారించిన తరువాత... దానికి కారణం ఏమిటో తెలుసుకొనే ప్రయత్నం చేశాను. దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు ఎన్నో తెలిశాయి. మనకు వచ్చే అనారోగ్యాలలో చాలావాటికి మనం తీసుకునే ఆహారమే కారణం. వ్యవసాయంలో పురుగు మందులను మితిమీరి వాడడం, విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వినియోగంతో దాదాపు ప్రతీ పదార్థమూ కలుషితమవుతోంది. ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తోంది. నాకు వచ్చిన బెయిన్ ట్యూమర్‌కు కూడా ఇదే కారణమని గుర్తించాను. ప్రకృతి సాగుతో భూసార పరిరక్షణ జరుగుతుంది. అది భవిష్యత్ తరాలు అనారోగ్యాల బారిన పడకుండా కాపాడుతుంది. అందుకే సేంద్రియ పద్ధతితో వ్యవసాయం చేపట్టి, సహజసిద్ధమైన పంటలు పండించాలని నిర్ణయించుకున్నాను. నా భర్త యర్రు సత్యనారాయణ నా ఆలోచనను ప్రోత్సహించారు.

**ఖర్చు తక్కువ... నాణ్యత ఎక్కువ**

వ్యవసాయం చేయడం సవాళ్లతో కూడుకున్న పని. ఎన్నో వ్యయ ప్రయాసను భరించి సాగు



చేసినా... ప్రకృతి కరుణిస్తే తప్ప రైతు గట్టెక్కే పరిస్థితి లేదు. పంటలను మార్కెట్ యార్డుకు తరలించినా గిట్టుబాటు ధరకు హామీ లేదు. కనీసం పెట్టుబడి అయినా దక్కితే చాలనే దుస్థితి ఉంది. దీంతో పెద్ద పెద్ద రైతులే సాగు చేయలేక చేతులు ఎత్తేస్తున్నారు. ఈ నేపథ్యంలో... అరకొర చదువు, అంతంత మాత్రం ఆర్థిక స్తోమత ఉన్న నా నాలాంటి ఒక మహిళకు ఇది సాహసం అనే చెప్పాలి. అయినా ధైర్యం చేశాను. మాది గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామం. మాకున్న రెండు ఎకరాల మాగాణితో పాటు... కౌలుకు తీసుకున్న పది ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేపట్టాను. జిల్లా రైతు సాధికార సంస్థ సహకారాన్ని తీసుకున్నాను. నవారా, బ్లాక్‌రైస్, మైసూర్ మల్లిక, కాలాబట్టి తదితర దేశీయ వంగడాలను సాగు చేయడం ప్రారంభించాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులకు బదులు జీవామృతం, కషాయాలు వినియోగించాను. వాటిని నేనే స్వయంగా తయారు చేస్తాను. ఇలా తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన పంటలు పండిస్తున్నాను. నా సాగు పద్ధతులు జాతీయ స్థాయిలో వ్యవసాయ నిపుణులు, రైతుల దృష్టిని ఆకర్షించాయి. మా ప్రాంతంలో పర్యటించిన బ్రెజిల్ బృందం... నన్ను ప్రత్యేకంగా అభినందించింది.

**మరపురాని జ్ఞాపకం**



మా జిల్లాలో సేంద్రియ సాగు చేపట్టిన మొదటి మహిళా రైతును నేనే. మా కుటుంబం మొత్తం ఇప్పుడు సేంద్రియ వ్యవసాయంలో ఉంది. మాకు కావలసిన కాయగూరలు, ఆకుకూరలు మా పొలం గట్ల మీద, ఇంటి పెరట్లో పండిస్తున్నాం. ప్రకృతి సేద్యం ద్వారా... ఆరోగ్యకరమైన ఆహారంతో బ్రెయిన్ ట్యూమర్‌ను నేను జయించాను. నా కృషికి గుర్తింపుగా... ఇటీవల ఢిల్లీలో... 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ' ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా 'పీజీఎస్ నేచురల్ ఫామ్ సర్టిఫికెట్‌'ను అందుకున్నాను. ప్రధానితో ముఖాముఖిగా మాట్లాడడం, ప్రశంసలు పొందడం నా జీవితంలో మరపురాని జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

కౌన్సెలింగ్

# దగ్గు మందుతో ముప్పు ఉంటుందా?

డాక్టర్! మా నాలుగేళ్ల బాబుకు దగ్గు మొదలైన ప్రతిసారీ... మందుల షాపులో దొరికే దగ్గు మందు కొని, వాడుతూ ఉంటాం! పదే పదే దగ్గు మందు తాగించటం వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బ తింటుందా? అసలు దగ్గుకు ఎలాంటి చికిత్స ఇప్పించాలి?



పిల్లల దగ్గుకు కారణాన్ని కనిపెట్టి చికిత్స చేసినప్పుడే దగ్గు తగ్గుతుంది. పిల్లల్లో దగ్గుకు ఎన్నో కారణాలుంటాయి. ఆస్తమా, అలర్జీ, సాధారణ దగ్గు... ఇలా ఏ కారణం వల్లైనా దగ్గు మొదలవ్వొచ్చు. అయితే ఎలాంటి దగ్గు కనిపించినా... వెంటనే దగ్గు మందులు కొనేసి వాడుకోవడం సరి కాదు. దగ్గు కారణం, రకాన్ని తెలుసుకుని, దాని మూల కారణానికి చికిత్స చేయాలి. దగ్గుతో పాటు, ముక్కు నుంచి నీరు కారుతూ, పిల్లి కూతలు వినిపిస్తుంటే దాన్ని అలర్జీగా భావించి యాంటీ హిస్టమిన్లు, యాంటీ అలర్జిక్ మందులు వాడాల్సి ఉంటుంది. వాటితోపాటు అలర్జీ కారకాలను గుర్తించి వాటికి దూరంగా ఉంచాలి. దగ్గుతోపాటు ఆయాసం ఉంటే, ఆస్తమాగా భావించి అందుకు తగిన ఇన్‌హేలర్లు వాడాల్సి ఉంటుంది. సాధారణ దగ్గు, జలుబు అయితే 3 నుంచి 5 రోజుల్లో తగ్గుతుంది. ఆ సమయంలో హైడ్రేషన్, ఆవిరి పట్టడం సరిపోతాయి. ఆస్తమా దగ్గును నెబ్యులైజేషన్‌తో తగ్గించవచ్చు. ఒక్కో రకం దగ్గుకు ఒక్కో రకం చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మెడికల్ షాపుల్లో దొరికే దగ్గు మందుల్లో కాంబినేషన్ డ్రగ్స్ ఉంటాయి. కొన్నిట్లో అలర్జీ నివారిణులైన యాంటీ హిస్టమిన్లు ఉంటాయి. మరికొన్నిట్లో కోడీన్, హైడ్రాక్సీ కోడీన్ మందులుంటాయి. వీటి వాడకాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిషేధించింది. సిరప్‌లో ఉన్న ఔషధాల గురించి అవగాహన లేకుండా వాటిని కొని వాడేస్తూ ఉంటాం. కానీ అలా ఇష్టారాజ్యంగా వాడటం వల్ల పిల్లల్లో ఇన్‌ఫెక్షన్ల రెసిస్టెన్స్‌ను పెంచినవాళ్లమవుతాం! ఇది ప్రమాదకరం. కాబట్టి దగ్గును అణచివేసే సిరప్స్ వాడేయకుండా, వైద్యులను సంప్రతించి, దగ్గు మూల కారణానికి తగిన చికిత్స ఇప్పించాలి.

డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల
పీడియాట్రీషియన్ అండ్ నియో నాటాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
హైదరాబాద్.

మూడేళ్లలోపు పిల్లలు రాత్రిపూట పక్క తడపడం సహజం. కానీ వయసు పెరుగుతున్నా కూడా ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. వాటి గురించి తెలుసుకుందాం...

# పిల్లలు పక్క తడుపుతున్నారా...



- నిద్రపోవడానికి రెండు గంటల ముందే పిల్లలకు భోజనం పెట్టాలి. పడుకునే ముందు పిల్లలతో మంచినీళ్లు తాగించవద్దు.
- రాత్రిపూట నిద్రకు ఉపక్రమించే ముందు పిల్లలతో మూత్ర విసర్జన చేయించాలి. మధ్య రాత్రి వేళ ఒకసారి పిల్లలను నిద్ర లేపి బాత్‌రూమ్‌కు తీసుకెళ్లాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే క్రమంగా సమస్య తీరుతుంది.
- పిల్లలకు ఓట్స్ కార్న్‌ఫ్లేక్స్ గోధుమలతో తయారుచేసిన పదార్థాలు; వాల్‌నట్స్, కిస్‌మిస్‌లు, అరటిపండ్లు తినిపిస్తూ ఉంటే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. బెల్లం, దాల్చిన చెక్కలను ఆహారంలో చేర్చడం మంచిది. పిల్లలతో రోజూ అరగ్లాసు క్రాన్‌బెర్రీ జ్యూస్ లేదంటే ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో అరచెంచా సోంపు గింజలు కలిపి తాగించినా ఫలితం ఉంటుంది.
- పీడకలలు వచ్చినా కూడా భయంతో పిల్లలు పక్క తడిపేస్తూ ఉంటారు. కాబట్టి పడుకునేముందు పిల్లలను కోప్పడకూడదు. రాత్రిపూట పనిష్మెంట్‌లు ఇవ్వకూడదు. భయంకరమైన కథలు చెప్పకూడదు. హారర్ సినిమాలు చూడనివ్వకూడదు.
- మూత్రం వస్తుందనిపించగానే లేపమని పిల్లలకు రోజూ పడుకునేముందు చెబుతూ ఉండాలి. మంచి నిద్రలో ఉన్నప్పుడు పిల్లలు లేపితే వాళ్ల మీద చిరాకు పడకుండా ఓపికగా బాత్‌రూమ్‌కు తీసుకెళ్లాలి.

# సవాళ్లకు ఎదురు నిలిచి...

"ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను స్వాగతించడం, కొత్తదారుల్లో పయనించడం... వీటి వల్ల జీవితం ఉత్సాహభరితంగా సాగుతుంది" అని చెబుతారు సోనాలీ ఘోష్. పాతికేళ్ల క్రితం... మహిళలు చాలా అరుదుగా కనిపించే ఫారెస్ట్ సర్వీస్‌లో అడుగుపెట్టిన ఆమె... కజిరంగా నేషనల్ పార్క్‌కు తొలి మహిళా ఫీల్డ్ డైరెక్టర్‌గా చరిత్రకెక్కారు.
అంతేకాదు... ఇటీవల మన దేశం తరపున ప్రతిష్ఠాత్మకమైన 'కెంటన్ మిల్లర్' పురస్కారాన్ని అందుకున్న తొలి వ్యక్తిగా ఘనత సాధించారు. ప్రకృతి అన్నా, సాహసాలన్నా తనకు ఎంతో ఇష్టమంటున్న సోనాలీ ప్రయాణం ఇది.



"మాది మధ్యతరగతి బెంగాలీ కుటుంబం. నేను పుణేలో పుట్టాను. మా నాన్న ఉద్యోగం కారణంగా ఎక్కువ కాలం అటవీ ప్రాంతాల్లోనే నా బాల్యం గడిచింది. చెట్లు, నదులు, అడవులు, జంతువులు నా జీవితంలో భాగమైపోయాయి. కొత్త భాషలు, సంస్కృతులతో పరిచయం కలిగింది. ప్రశాంతమైన ప్రకృతి మధ్య గడపడం ఎంతో సంతోషంగా అనిపించేది. నా ఉద్యోగం కూడా దానికి సంబంధించినదే కావాలని కోరుకున్నాను. అటవీ, వన్యప్రాణుల శాస్త్రంలో పీజీ, 'ఎన్విరాన్‌మెంటల్ లా'లో పీజీ డిప్లమా చేశాను. ఆ తరువాత డెహ్రాడూన్‌లోని 'వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా' (డబ్ల్యూఐఐ)లో వైల్డ్ లైఫ్ మేనేజిమెంట్ కోర్స్ చేశాను. 'మానస్ నేషనల్ పార్కు'లో పులుల సంరక్షణ - రిమోట్ సెన్సింగ్ సాంకేతికత వినియోగం'పై నేను చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. 2000 సంవత్సరంలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో చేరాను. అసోంలోని కజిరంగా నేషనల్ పార్క్‌లో సహాయ కన్జర్వేటర్‌గా వృత్తి జీవితంలో అడుగుపెట్టాను.



**వారిలో ఉత్సాహం నింపుతూ...**

వృత్తి జీవితంలో తొలిరోజుల్లోనే ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. వర్షాకాలంలో ముంచెత్తే వరదలు, వనరుల కొరత, వన్యప్రాణుల అక్రమ రవాణా, మానవుల స్వార్థం కారణంగా దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యం... కొందరు సిబ్బంది అలసత్వం వీటికి తోడవడంతో పరిస్థితులన్నీ అస్తవ్యస్తంగా ఉండేవి. దాదాపు 430 కిలోమీటర్ల మేర వ్యాపించిన కజిరంగా నేషనల్ పార్క్... ప్రపంచంలోనే ఎక్కువ సంఖ్యలో ఒంటికొమ్ము ఖడ్గమృగాలకు ఆశ్రయం ఇస్తున్న ప్రాంతం. అక్రమ రవాణాదారుల వల్ల వన్యప్రాణులతో పాటు పార్క్‌కు నలుదిక్కుల్లో కాపలాగా ఉండే సిబ్బంది ప్రాణాలు కూడా ప్రమాదంలో ఉన్నాయి. సిబ్బందిలో ఆత్మవిశ్వాసం నింపడం కోసం మారుమూల గస్తీ శిబిరాలను తరచుగా సందర్శించేదాన్ని. ఇది వారిలో ఉత్సాహాన్ని నింపింది. ఆ తరువాత ఢిల్లీ జూలాజికల్ పార్క్ డైరెక్టర్‌గా, సెంట్రల్ జూ అథారిటీ డీఐజీగా, 'స్వచ్ఛభారత్ మిషన్'కు డైరెక్టర్‌గా, గువాహటి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా... ఇలా పలు హోదాల్లో పని చేశాను. రెండేళ్ల క్రితం కజిరంగా నేషనల్ పార్క్‌కు ఫీల్డ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాను. సుమారు 120 ఏళ్ల చరిత్ర ఉన్న ఆ పార్క్‌కు ఫీల్డ్ డైరెక్టర్ అయిన తొలి మహిళను నేనే.

> ఈ వృత్తిని నేను ఎంచుకున్నప్పుడు ఎంతోమంది నిరుత్సాహపరిచేలా మాట్లాడారు. మహిళను కావడం వల్ల దీనిలో రాణించడం కష్టమన్నారు. అది కొంతవరకూ నిజమే. ఇంటి పనులను, ఉద్యోగ బాధ్యతలను సమన్వయం చేసుకోవడం ఇబ్బందే. గృహిణిగా, తల్లిగా నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. అయితే కుటుంబం సహకారంతో వాటిని అధిగమించగలిగాను. అంతేకాదు... అటవీ ప్రాంతాల్లో మహిళలకు సరైన సౌకర్యాలు ఉండవు. ఇప్పుడిప్పుడే కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంతో పోలిస్తే ఐఎఫ్ఎస్ చేస్తున్న మహిళల సంఖ్య బాగా పెరుగుతోంది. ఇది శుభపరిణామం."

**అది గర్వకారణం...**

కజిరంగా నేషనల్ పార్క్.. బ్రహ్మపుత్ర నదీతీరాన, వరదలు ముంచెత్తే ప్రాంతంలో ఉంది. అది ఒంటి కొమ్ము ఖడ్గమృగాలతో పాటు ఏనుగులు, పులులు, లేళ్ళు, అయిదు వందలకు పైగా పక్షి జాతులకు నిలయం. వృక్ష వైవిధ్యమూ ఎక్కువ. సందర్శకులు కూడా పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తూ ఉంటారు. ఫీల్డ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత... పార్కులో పరిరక్షణతో పాటు సందర్శకులను ఆకర్షించడం మీద ఎక్కువగా దృష్టి పెట్టాను. ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. దాదాపు పాతికేళ్ళ నుంచి నేను అందిస్తున్న సేవలకు గుర్తింపుగా... ఈ ఏడాది 'కెంటన్ మిల్లర్' పురస్కారం నాకు లభించింది. ప్రపంచ ప్రసిద్ధ పర్యావరణవేత్త డాక్టర్ కెంటన్ ఆర్.మిల్లర్ పేరిట 'ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్' (ఐయుసిఎన్) ఆ అవార్డును అందజేస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో... పర్యావరణ రంగంలో అత్యున్నత పురస్కారాల్లో ఒకటిగా దీన్ని పరిగణిస్తారు. అబుదాబీలో ఈనెల పదోతేదీన జరిగిన కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన ప్రముఖులతో పాటు నేను కూడా ఆ పురస్కారాన్ని అందుకున్నాను. దీన్ని మన దేశం నుంచి అందుకున్న తొలి వ్యక్తిని నేను కావడం గర్వంగా ఉంది. మరింత నిబద్ధతతో నా వృత్తి జీవితాన్ని కొనసాగించడానికి నాకు మరింత స్ఫూర్తిగా నిలుస్తుంది."





# ఇలా దువ్వుకోవాలి...

ఎక్కువగా దువ్వితే శిరోజాలు రాలిపోతాయని చాలామంది భావిస్తుంటారు. కానీ సరైన విధానంలో దువ్వడం వల్ల శిరోజాలు రాలడం తగ్గి, ఒత్తుగా పెరుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు. శిరోజాలను ఎలా దువ్వుకోవాలో తెలుసుకుందాం...



- తల దువ్వుకోవడానికి వెడల్పాటి పళ్లు ఉన్న చెక్క దువ్వెనను ఎంపిక చేసుకోవాలి. దీనితో కుదుళ్ల నుంచి చివర్ల వరకూ శిరోజాలను మెల్లగా దువ్వాలి. ఇలా దువ్వేటప్పుడు కనీసం వంద వరకు వెంట్రుకలు రాలడం సహజం. నిదానంగా ఎక్కువసార్లు దువ్వడం వల్ల తలలో రక్త ప్రసరణ మెరుగై కుదుళ్లు గట్టిపడతాయి. జుట్టు రాలడం తగ్గి ఒత్తుగా పెరుగుతుంది.
- శిరోజాలను దువ్వుతున్నప్పుడు కుదుళ్ల వద్ద సహజసిద్ధమైన నూనె విడుదలవుతుంది. ఇది తల మీద చర్మం, కుదుళ్లు తేమ కోల్పోకుండా కాపాడుతుంది.
- గాలికి జుట్టు చెదిరి చిక్కులు పడుతూ ఉంటుంది. అలాంటప్పుడు జుట్టును పాయలుగా విడగొట్టి మెల్లగా దువ్వుతూ చిక్కులు తొలగించాలి. దీని వల్ల జుట్టుపై చేరే దుమ్ము, ధూళి కూడా తొలగిపోతాయి. చిక్కులు మరీ ఎక్కువగా ఉంటే వేళ్లతో జుట్టును సరి చేస్తూ దువ్వాలి. చెక్కతో చేసిన ప్యాడిల్ బ్రష్‌ను ఉపయోగిస్తే కుదుళ్లు బలహీనమవకుండా ఉంటాయి.
- ముందుగా శిరోజాల చివర్లను దువ్వాలి. తరువాత మధ్య నుంచి కింది వరకూ దువ్వాలి. ఆపైన కుదుళ్ల నుంచి చివరి వరకూ దువ్వితే చిక్కులు త్వరగా తొలగిపోతాయి.
- తడి జుట్టును గట్టిగా దువ్వకూడదు. అలాగని జుట్టు పూర్తిగా ఆరిన తరువాత చిక్కులు తీయడం కష్టంగా ఉంటుంది. అలాంటప్పుడు తలస్నానం చేసిన వెంటనే శిరోజాలకు కొద్దిగా కండిషనర్ రాయాలి. పెద్ద పళ్లున్న దువ్వెనతో కుదుళ్ల నుంచి మెల్లగా దువ్వాలి. మధ్యలో చిక్కులు వుంటే వాటిని చేత్తో తీయాలి.
- దువ్వెనలో ఎక్కువగా మురికి చేరుతూ ఉంటుంది. కాబట్టి వారానికి ఒకసారైనా శుభ్రం చేసుకుంటూ ఉండాలి. అప్పుడే శిరోజాలు ఆరోగ్యంగా ఒత్తుగా పెరుగుతాయి.

## 2 నెలలుగా అడుగుతున్నా స్పందించరా?

- ‘నిషేధిత భూముల జాబితా’ తయారీలో జాప్యం ఎందుకు?
- 22ఏ జాబితాను అప్‌లోడ్ చేయని కలెక్టర్లపై చర్యలు
- షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం
- రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ హెచ్చరిక
- కలెక్టర్లు సంతకాలు పెట్టడం లేదని అదనపు కలెక్టర్ల ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నిషేధిత భూముల జాబితాల (22ఏ)ను రెండు నెలలుగా అడుగుతున్నా స్పందించకపోవడంపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 22ఏ జాబితా తయారు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపడంతోపాటు భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని చెబుతుంటే పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం అదనపు కలెక్టర్ల (రెవెన్యూ)తో సమావేశం నిర్వహించిన ఆయన.. 22ఏ జాబితాల తయారీలో జాప్యంపై నిలదీశారు. స్పందించిన అదనపు కలెక్టర్లు.. తాము వివరాలు ఇచ్చినా కలెక్టర్లు సంతకాలు పెట్టకపోవడంతోనే జాప్యం జరుగుతోందని చెప్పడంతో లోకేశ్‌కుమార్ మరింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జిల్లాల వారీగా 22ఏ జాబితాలను భూభారతి పోర్టల్‌లో ఎందుకు అప్‌లోడ్ చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయమై స్పందించని; 22ఏ జాబితా తయారు చేసినా సంతకాలు పెట్టని కలెక్టర్లకు షోకాజు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఎందుకు పంపడం లేదని హైకోర్టు ఆగస్టులో ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అత్యవసర ప్రాతిపదికన వివరాలు పంపాలని, ఆ మేరకు అఫిడవిట్ దాఖలు చేయాలని సెప్టెంబరు 6న విచారణ సందర్భంగా సీఎస్‌ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో లోకేశ్‌కుమార్ మండలాల వారీగా నిషేధిత భూముల వివరాలను వారం రోజుల్లో పంపాలని కలెక్టర్లను ఆదేశించారు.

### ఇప్పటికీ పాత జాబితానే..

భూభారతి చట్టం అమల్లోకి వచ్చాక కూడా ధరణిలో ఉన్న నిషేధిత భూముల వివరాలే భూభారతి పోర్టల్‌లోనూ పెట్టారు. ఏ కారణం లేకుండానే కొంత మంది భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 2016లోనే పలు జిల్లాల్లో తహసీల్దార్లు నిషేధిత ఆస్తుల జాబితాను కలెక్టర్లకు పంపించగా.. ఉన్నతస్థాయి ఒత్తిళ్లతో ఆ జాబితా గెజిట్ నోటిఫికేషన్‌కు నోచుకోలేదు. 2017లో భూరికార్డుల నవీకరణ జరిగింది. ఆ సమయంలో నిషేధిత భూముల వివరాలపై స్పష్టత వచ్చింది. వాటి ఆధారంగా జాబితాను సిద్ధం చేసి.. వెబ్‌సైట్‌లో పెట్టాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. 22ఏ భూముల జాబితాను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సర్కారు భూములను గంపగుత్తగా అమ్ముకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## పాఠశాల విద్యలోకి మోడల్ స్కూళ్లు!: సుల్తానియా

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి వరకు ప్రత్యేక వ్యవస్థగా ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్స్ సొసైటీని పాఠశాల విద్యలో విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని రాష్ట్ర ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. దీంతో అందులో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు, ఇతర ఆర్థిక సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న రెగ్యులర్ టీచింగ్ సిబ్బందిని పాఠశాల విద్యలో విలీనం చేయాలని శాసనమండలి సభ్యుడు మల్క కొమరయ్య కోరారు. సిబ్బంది వేతనాలను ‘హెడ్ ఆఫ్ అకౌంట్’ విధానం ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్థికశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను ఆయన బుధవారం సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 194 మోడల్ స్కూళ్లలో సుమారు 3 వేలమంది రెగ్యులర్ టీచింగ్ సిబ్బంది పని చేస్తున్నారని, వీరు సకాలంలో వేతనాలు అందుకోలేకపోతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులను ఇప్పటికే విద్యాశాఖలో విలీనం చేసి ‘హెడ్ ఆఫ్ అకౌంట్’ విధానం ద్వారా వేతనాలు చెల్లిస్తున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసి మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సుల్తానియా పరిశీలించి త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## వంటలూరు!

(మొదటిపేజీ తరువాయి)

శుభకార్యాల్లో వంటలు చేసేవాడు. ఆయన చేతి వంట ఎంతో రుచిగా ఉండటంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. వివిధ ప్రాంతాల నుంచి జనం వచ్చి సీతారాంను తీసుకెళ్లి వంటలు చేయించుకునేవారు. తనకు సహాయకులుగా కుటుంబసభ్యులతోపాటు గ్రామంలోని మరికొందరిని తనవెంట తీసుకెళ్లేవాడు. అలా వెళ్లిన వాళ్లలో చాలామంది వంట చేయడం నేర్చుకున్నారు. సీతారాం తదనంతరం ఆయన కుమారుడు అశోక్ కూడా తండ్రి బాటలోనే నడుస్తూ వంట మాస్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. అశోక్ కూడా తనకు సాయంగా ఉండేందుకు గ్రామంలోని యువకులను వెంట తీసుకెళ్లేవాడు. వాళ్లకు కూడా వంటలు చేయడం నేర్పించి వంట మాస్టర్లుగా తయారు చేశాడు. అలా గ్రామంలో వంట మాస్టర్లతో


వంటలు చేస్తున్న జనకాపూర్ వాసులు

పాటు సహాయకులు కలిపి 300 మంది వరకు గ్రామంలో వంట పనులు చేస్తున్నారు. ఒక్కో కార్యక్రమంలో వంట చేసేందుకు భోజనాల సంఖ్యను బట్టి చార్జి చేస్తారు. రూ. 5 వేలు మొదలుకొని రూ. 50వేల వరకు చార్జి చేస్తారు. జనకాపూర్‌లో సుమారు 1400 మంది జనాభా ఉంది. ఇక్కడి ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కొందరు యువకులు ఆటో డ్రైవర్లుగానూ పని చేస్తున్నారు. ముఖ్యంగా యువత వ్యవసాయ పనులతోపాటు ప్రవృత్తిగా వంట పనిని ఎంచుకున్నారు. తమ వృత్తులు కొనసాగిస్తూనే వివాహాలు, ఇతర శుభకార్యాలకు వెళ్లి వంటలు చేస్తున్నారు. కళాశాల చదువులు కొనసాగిస్తున్న వారు కూడా సెలవు రోజుల్లో జేబు ఖర్చుల కోసం వంట పనికి వెళ్తుంటారు. కేవలం జిల్లాలోనే కాకుండా కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాల్లోనూ శుభకార్యాల్లో శాకాహార, మాంసాహార వంటలు కూడా రుచిగా చేస్తారనే పేరు ఇక్కడి వంట మాస్టర్లకు ఉంది. ప్రముఖుల ఇళ్లలో జరిగే శుభకార్యాలకు కూడా జనకాపూర్ వంట మాస్టర్లను పిలుస్తుంటారు. జనకాపూర్ గ్రామస్తులు నిల్వ పచ్చళ్లు పెట్టడంలోనూ భేష్ అనిపించుకుంటున్నారు. వీళ్లు తయారు చేసే మటన్, చేప పచ్చళ్లు ఎంతో ఆదరణ పొందాయి. జనకాపూర్ మాస్టర్లు తయారు చేసే నిల్వ పచ్చళ్లు అమెరికా దేశాలకు వెళ్తుంటాయంటే అతిశయోక్తికాదు. అమెరికాలోని తెలుగువాళ్లు వీరి పచ్చళ్లను అమితంగా ఇష్టపడుతారు. అమెరికాలో స్థిరపడ్డ వారి కోసం ఇక్కడి తమ బంధువులు జనకాపూర్ మాస్టర్ల చేత ప్రత్యేకంగా పచ్చళ్లు తయారు చేయించి పంపిస్తుంటారు.

### తండ్రి బాటనే ఎంచుకున్నా



తన తండ్రి మంచర్ల సీతారం నేర్పిన బాటలోనే పయనిస్తున్నట్లు ఆయన కుమారుడు మంచర్ల అశోక్ తెలిపారు. 35 ఏళ్లగా వంటలు చేస్తున్నానన్నారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర జిల్లాలకు వంట చేసేందుకు వెళ్తుంటానని, తనతోపాటు మరికొందరు యువకులను తీసుకెళ్తా వారికీ వంట చేయడం నేర్పిస్తున్నట్లు తెలిపాడు. తనవద్ద వంట నేర్చుకున్న వారిలో అనేక మంది అదే ప్రధాన వృత్తిగా చేసుకొని స్థిరపడ్డట్లు తెలిపారు.

## ప్రతి 100 మందిలో ఏడుగురికి కిడ్నీ సమస్య

(మొదటిపేజీ తరువాయి)


కూడా తెలంగాణతో కలిసి (7.4 శాతం)తో దేశంలో టాప్‌లో నిలిచిందని తెలిపింది. బిహార్‌లో అతి తక్కువగా 0.8శాతమే బాధితులు ఉన్నట్టు వెల్లడించింది. కిడ్నీ జబ్బులకు ప్రధాన కారణంగా అధిక రక్తపోటు (హైబీపీ), మధుమేహం వ్యాధులే కారణమని అధ్యయనం పేర్కొంది.

### జాతీయ సగటు కంటే రెండింతలకుపైగా..

దేశంలోని 31 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 25,408 మందిపై అధ్యయనం చేశామని.. దేశవ్యాప్తంగా సగటున 3.2శాతం మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని ఐసీఎంఆర్-ఇండియాబీ అధ్యయనం వెల్లడించింది. అదే తెలంగాణలో 7.4 శాతంగా తేలిందని, జాతీయ సగటు కంటే ఇది 2.3 రెట్లు ఎక్కువని వెల్లడించింది. చిన్న రాష్ట్రం గోవా కూడా తెలంగాణతో కలిసి (7.4 శాతం)తో దేశంలో టాప్‌లో నిలిచిందని తెలిపింది. బిహార్‌లో అతి తక్కువగా 0.8శాతమే బాధితులు ఉన్నట్టు వెల్లడించింది. కిడ్నీ జబ్బులకు ప్రధాన కారణంగా అధిక రక్తపోటు (హైబీపీ), మధుమేహం వ్యాధులే కారణమని అధ్యయనం పేర్కొంది.

### తెలంగాణలో 50లక్షల మంది వరకు బాధితులు

దేశంలోనే అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఆరోగ్యశ్రీ, వైద్యారోగ్య శాఖల గణాంకాల ప్రకారమే.. ఈ సమస్యలతో బాధపడుతున్నవారు 50 లక్షల మంది వరకు ఉన్నారు. ఈ క్రమంలోనే కిడ్నీ సమస్యల ప్రమాదం పెరిగిపోతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు, అధికంగా ఉప్పు, చక్కెర వాడకం, ఊబకాయం వంటివి ఈ పరిస్థితికి ఆజ్యం పోస్తున్నాయని వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. కిడ్నీ జబ్బులను సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారని, చాలా సందర్భాల్లో లక్షణాలు బయటపడేసరికే మూత్రపిండాలు 70-80 శాతం పాడవుతాయని హెచ్చరిస్తున్నారు.




### అధ్యయనంలో తేలిన ముఖ్యాంశాలివే..

- గ్రామీణ, పట్టణ ప్రాంతాలన్నింటా కూడా కిడ్నీ వ్యాధుల తీవ్రత ఒకే స్థాయిలో ఉంది.
- జాతీయ స్థాయిలో పట్టణాల్లో 3.3%, గ్రామాల్లో 3.2%మంది కిడ్నీ జబ్బులతో బాధపడుతున్నారు.
- మహిళలతో (2.6%) పోల్చి పురుషుల్లో (3.8%) ఈ సమస్య ఎక్కువ.
- హైబీపీ, షుగర్ లేనివారితో పోలిస్తే.. ఆ రెండు సమస్యలు ఉన్నవారిలో కిడ్నీ జబ్బుల ప్రమాదం ఆరు రెట్లు ఎక్కువగా ఉంది.
- కేవలం మధుమేహం ఉన్నవారిలో ముప్పు 3.2 రెట్లు ఎక్కువగా, బీపీ ఒకటే ఉన్నవారిలో ఇది 2.4 రెట్లు అధికంగా సమస్య ఉంది.
- దేశంలో నాలుగు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కిడ్నీ బాధితులు 4-6 శాతంలోపు ఉండగా, మరో నాలుగు రాష్ట్రాల్లో ఆరు శాతానికి కంటే ఎక్కువగా ఉన్నారు.
- అత్యంత తీవ్రమైన (క్రానిక్) కిడ్నీ వ్యాధి (సీకేడీ) ఎక్కువగా ఉందని ఐసీఎంఆర్ అధ్యయనంలో తేలగా.. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సీఏఆర్ ఆర్ఎస్ అధ్యయనంలో మాత్రం మహిళలలో ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది.

### 30 ఏళ్లలోపే మధుమేహం, హైబీపీ వస్తున్నాయి..



రాష్ట్రంలో మధుమేహం, అధిక రక్తపోటు బాధితులు భారీగా పెరుగుతున్నారు. 30 ఏళ్లలోపే వీటి బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. జీవనశైలి, ఆహార నియంత్రణ పాటించకపోవడం, మందులు సరిగా వాడకపోవడంతో మధుమేహం నియంత్రణలో ఉండక కిడ్నీలు పాడవుతున్నాయి. విపరీతంగా నొప్పి నివారణ మాత్రల వాడకం, గ్యాస్-ఎసిడిటీని తగ్గించే మందులు వాడటం, ఆయుర్వేదిక్, హోమియోపతి, అల్లోపతి కలగలపి వాడటం వంటివి సమస్యను పెంచుతున్నాయి. జన్యుపరమైన లోపాల వల్ల కిడ్నీ జబ్బుల బారిన పడే వారి సంఖ్య కూడా మనదగ్గర ఎక్కువగానే ఉంటోంది. అందువల్ల 30ఏళ్లు దాటినవారు ఏటా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

- డాక్టర్ శ్రీభూషణ్ రాజు, నెఫ్రాలజిస్టు, జీవన్‌దాన్ నోడల్ ఆఫీసర్

## హ్యామ్ రోడ్లకు టెండర్లు రేపు

- 32 ప్యాకేజీలు, 400 పనులకు ఒకేసారి ఆహ్వానించనున్న ఆర్ అండ్ బీ శాఖ
- క్యాబినెట్ ఆమోదం తెలిపిన పనులకు జీవో 70 విడుదల
- 30 నెలల్లోగా పనులు పూర్తి: కోమటిరెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రహదారులు, భవనాల శాఖ పరిధిలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్)లో అభివృద్ధి, ఉన్నతీకరించాల్సిన రోడ్లకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిన మేర పనులు చేపట్టేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 70ను బుధవారం జారీ చేసింది. రూ.10,547 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా 5,566 కి.మీ మేర అభివృద్ధి చేయనున్న రహదారుల వివరాలను అందులో పొందుపరిచింది. దీంతో ఇప్పటికే ఖరారు చేసిన 32 ప్యాకేజీలు, 400 పనులుగా చేపట్టనున్న ఈ పనులకు ఆర్ అండ్ బీ శాఖ శుక్రవారమే టెండర్లు పిలవనుంది. ఆర్ అండ్ బీ చేపట్టే పనుల్లో ఖమ్మం జిల్లాలోని మధిర-కృష్ణాపురం-దెందుకూరు పరిధిలో రూ.193.52 కోట్ల వ్యయంతో 13 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల ఔటర్ రింగు రోడ్డు నిర్మించనున్నారు. అలాగే, నల్లగొండ జిల్లా వైద్య కళాశాల- నల్లగొండ పట్టణ పరిధిలో నాలుగు వరుసల బైపాస్ రోడ్డును రూ.210 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా అభివృద్ధి చేయనున్నారు. కాగా, ఆర్ అండ్ బీ శాఖ ఇప్పటికే ఖరారు చేసిన హ్యామ్ రోడ్లను క్యాబినెట్ ఆమోదించడంతో ఆయా పనులకు టెండర్లను ఆహ్వానించేందుకు వీలుగా ఉత్తర్వులు జారీ చేశామని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మొత్తం రోడ్లలో 1791 కి.మీ లను రూ.6,152 కోట్ల వ్యయంతో విస్తరించనున్నామని చెప్పారు. మరో 3,775 కి.మీ రోడ్లను రూ.4,395 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత నుంచి ప్యాకేజీల వారీగా వచ్చే 30 నెలల్లో పనులను పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి ‘ఆంధ్రజ్యోతి’తో అన్నారు.

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## వింటేజ్ లుక్‌లో



‘బాహుబలి’తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన ప్రభాస్ చేస్తున్న ప్రతీ చిత్రంపైన అంచనాలు భారీస్థాయిలో ఉంటున్నాయి. ఆయన కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ ‘రాజాసాబ్’ ట్రైలర్ ఇటీవలె విడుదలై అందరినీ అలరించింది. ఇందులో వింటేజ్ లుక్‌లో ప్రభాస్ కనిపించడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అయ్యారు. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 9న చిత్రం విడుదలవుతోంది. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి మరిన్ని అప్‌డేట్స్ వస్తాయని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. పీపుల్ మీడియాఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రంలో మాళవికా మోహన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్ కథానాయికలు. మరోవైపు, ‘బాహుబలి’ సిరీస్‌లోని రెండు భాగాలను కలిపి చేస్తున్న ‘బాహుబలి: ద ఎపిక్’ ఈ నెల 31న విడుదలవుతోంది.

### పాండవుల పక్షాన నిలిచిన కర్ణుడు

ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రంపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి కీలక అప్డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. గురువారం ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటిస్తామని ప్రకటించి, ప్రీ లుక్‌ను విడుదల చేశారు. ‘పద్మవ్యూహాన్ని ఛేదించిన అర్జునుడు.. పాండవుల పక్షాన నిలిచిన కర్ణుడు.. ఒక్కడిగానే పోరాడే బెటాలియన్.. 1932 నుంచి మోస్ట్ వాంటెడ్’ అని విడుదల చేసిన పలు ప్రచార చిత్రాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో ప్రభాస్ సరసన సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. టీ సిరీస్ గుల్షన్‌కుమార్, భూషణ్ కుమార్ సమర్పిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ మొదలైనప్పటి నుంచి చిత్రానికి ‘ఫౌజీ’ అనే టైటిల్ ప్రచారంలో ఉంది. 1930 దశకంలో సాగే ఈ కథలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భానుచందర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.





## మిరాయ్ ఫ్రాంచైజీలో మరిన్ని చిత్రాలు

**- టీజీ విశ్వప్రసాద్**


‘మిరాయ్’ సినిమాకు అద్భుతమైన విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇకపై ఈ ఫ్రాంచైజీలో అంతర్జాతీయ స్థాయి హంగులతో సినిమాలు నిర్మించబోతున్నాం. ఇండియాలో అత్యధికంగా ప్రేక్షకులు వీక్షించిన చిత్రాల జాబితాలో ‘మిరాయ్’ నిలుస్తుంది. ముందుందు ఈ ఫ్రాంచైజీలో మరిన్ని అద్భుతమైన చిత్రాలు రాబోతున్నాయి’ అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. తేజ సజ్జ కథానాయకుడిగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన చిత్రమిది. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. సెప్టెంబర్‌లో విడుదలైన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఘనవిజయం అందుకొంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించింది. తేజ సజ్జ మాట్లాడుతూ “మిరాయ్’ విడుదలై 45 రోజులు అవుతోంది, మరో పక్క ఓటీటీలోనూ స్ట్రీమింగ్ అవుతోంది. ఇప్పటికీ థియేటర్లలోనూ చక్కటి ఆదరణ దక్కుతోంది. ఇంత మంచి విజయాన్ని ఇచ్చిన విశ్వప్రసాద్, కార్తీక్ గార్లకు రుణపడి ఉంటాను’ అని అన్నారు. చిత్ర బృందం సమష్టి కృషితోనే ఇంత గొప్ప విజయం సాధ్యమైంది అని కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకర్స్ యూనిట్ సభ్యులను మెమెంటోలతో సత్కరించారు.

## ప్రేమ, కుటుంబ విలువలతో



అనీష్ హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం ‘లవ్ ఓటీపీ’. విజయ్ ఎం రెడ్డి నిర్మించారు. జాన్విక కథానాయిక. రాజీవ్ కనకాల కీలక పాత్ర పోషించారు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా రాజీవ్ కనకాల మాట్లాడుతూ ‘తెలుగు కన్నడ భాషల్లో ‘లవ్ ఓటీపీ’ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేమ, కుటుంబ విలువలతో హృద్యంగా ఉంటుంది. కొడుకును కూతురులా చూసుకునే తండ్రి పాత్రను పోషించాను. నా పాత్ర కొత్త తరహాలో సాగుతుంది. అనీష్ ఈ చిత్రాన్ని కష్టపడి, ఇష్టపడి చేశాడు. తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది’ అని చెప్పారు. అనీష్ మాట్లాడుతూ ‘కంటెంట్‌ను నమ్మి ఈ సినిమా చేశాం. ఆనంద్ గారి సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ. థియేటర్లలో ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు’ అని చెప్పారు. ‘లవ్ ఓటీపీ’లో ప్రేమకథ, కుటుంబ అనుబంధాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి అని విజయ్ ఎం. రెడ్డి తెలిపారు.

## తెరపై గుమ్మడి నర్సయ్య జీవిత కథ



ప్రముఖ రాజకీయ నాయకుడు, కమ్యూనిస్ట్ పార్టీ నేత గుమ్మడి నర్సయ్య జీవిత కథను అదే పేరుతో తెరకు ఎక్కించనున్నారు. పేద ప్రజల గురించి ఆలోచించే రాజకీయ నాయకుడిగా నర్సయ్యకు మంచి పేరు ఉంది. కరుణాడ చక్రవర్తి శివరాజకుమార్ టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని పరమేశ్వర్ హివ్రాలే దర్శకత్వంలో సురేశ్‌రెడ్డి నిర్మించనున్నారు. ఎర్ర కండువా ధరించి సైకిల్ మీద అసెంబ్లీకి నర్సయ్య వస్తున్న లుక్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ స్థాయిలో ఈ సినిమాను నిర్మించనున్నట్లు నిర్మాత సురేశ్‌రెడ్డి వెల్లడించారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణ: సతీశ్ ముత్యాల, సంగీత దర్శకత్వం: సురేశ్ బొబ్బిలి, ఎడిటింగ్: గిడుతూరి ఫణి.

## హిట్ బీజీఎమ్ టైటిల్‌తో



శివాజీ కథానాయకుడిగా నటిస్తూ సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమాకు ‘సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని’ టైటిల్‌ను ఖరారు చేసి మోషన్ పోస్టర్ విడుదల చేశారు. లయ కథానాయిక. 90స్ వెబ్ సిరీస్ బాలనటుడు రోహన్, అలీ, ధనరాజ్, రఘుబాబు, పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్తూరు నేపథ్యంలో జరిగే ఈ సినిమాలో క్రైమ్ ఎలిమెంట్ కూడా ఉంటుందని హింట్ ఇచ్చారు మేకర్స్. 90స్ వెబ్‌సిరీస్‌లోని సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని బీజీఎమ్‌నే ఈ చిత్రం టైటిల్‌గా పెట్టి సినిమాపై అంచనాలు పెంచేశారు.

## దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకోవాలనుంది



**సెవెన్‌హిల్స్ సతీశ్**

‘దర్శకుడవ్వాలనే లక్ష్యంతోనే పరిశ్రమకు వచ్చాను. తొలుత సహాయ దర్శకుడిగా కెరీర్ మొదలుపెట్టాను. ఆ తర్వాత నిర్మాతగా మారాను. మంచి విజయాలను అందుకున్నాను. ఆ అనుభవం నేర్పిన పాఠాలతో పాటు, నా గురువు వి. వి వినాయక్ గారి సూచన మేరకు త్వరలో దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను’ అని నిర్మాత సెవెన్‌హిల్స్ సతీశ్ అన్నారు.

సెవెన్‌హిల్స్ ప్రొడక్షన్స్ పతాకంపై ‘బట్టల రామస్వామి బయోపిక్’ లాంటి పలు విజయవంతమైన చిత్రాలను ఆయన నిర్మించారు. దర్శకుడిగా తన కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టబోతున్న సందర్భంగా సతీశ్ మీడియాతో మాట్లాడారు. ‘ఎవరికైనా దర్శకుడిగా తొలి చిత్రం చాలా ముఖ్యం. అందుకే పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రం చేయాలనుకుంటున్నాను. ప్రేక్షకులను మెప్పించే సినిమా చేసి, దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలనేదే నా కోరిక. ‘బలగం, లిటిల్ హార్ట్స్’ లాంటి చిత్రాల తరహాలో పరిమిత వ్యయంతో మంచి కంటెంట్ ఉన్న సినిమా చేస్తాను. ప్రస్తుతం స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నా. నిర్మాతగా నా సినిమాల్లో అందరూ కొత్త నటులనే తీసుకున్నాను. అలాగే దర్శకుడిగా కూడా కొత్తవాళ్లతోనే సినిమా చేస్తాను. నా స్నేహితులు ఈ సినిమాకు నిర్మాతలుగా వ్యవహరిస్తారు. నిర్మాతగానూ నా ప్రయాణం కొనసాగుతుంది. ఎడిటర్ ప్రవీణ్ పూడి, రాజశేఖర్ గడ్డం దర్శకులుగా మా బేనర్‌పై రెండు సినిమాలు నిర్మిస్తున్నాను’ అని ఆయన తెలిపారు.


హర్మన్‌ప్రీత్

# కఠిన సవాల్

న్యూజిలాండ్‌తో భారత పోరు నేడు

మ.3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

మహిళల వన్డే ప్రపంచ కప్

**నవీ ముంబై:** ప్రపంచ కప్‌లో ఇప్పటికే హ్యాట్రిక్ పరాజయాలతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న భారత మహిళల జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. గురువారం జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో హర్మన్‌ప్రీత్ సేన అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ గెలిస్తే మన మహిళలకు సెమీఫైనల్ అవకాశాలు సులువు అవుతాయి. ఒక వేళ ఓడితే సమీకరణాలపై ఆధారపడాల్సివుంటుంది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ టాప్-3లో నిలిచి ఇప్పటికే సెమీస్ బెర్త్‌లను ఖరారు చేసుకోగా.. మిగిలిన ఏకైక స్థానం కోసం భారత్, న్యూజిలాండ్ పోటీపడుతున్నాయి. ఇప్పుడు ఇరుజట్లకు చెరి రెండు మ్యాచ్‌లు మిగిలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒక దాంట్లో ఇద్దరూ ముఖాముఖికి సిద్ధమవడంతో తాజా పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే, భారత్ తన తర్వాతి, ఆఖరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించినా సెమీస్ చేరుతుంది. మరోవైపు సోఫీ డివైన్ సారథ్యంలోని కివీస్ జట్టు తమ చివరి పోరులో ఇంగ్లండ్‌ను ఓడించాల్సి ఉంటుంది. సోఫీతో పాటు సుజీ బేట్స్‌లాంటి స్టార్ బ్యాటర్లున్న ఆ జట్టు ఇప్పుడు భారత్ పోరుతో తమ అవకాశాలను మెరుగుపరుచుకోవాలనుకుంటోంది.


సోఫీ డివైన్

### సమష్టిగా సత్తా చాటితేనే..

గత మూడు మ్యాచుల్లోనూ హర్మన్ సేన గెలుపు ముంగిట బోల్తా పడడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఆఖర్లో తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేక చేజేతులా ఓటమిపాలైంది. అయితే స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ ఫామ్‌లోకి రావడం శుభపరిణామం. రిచా ఘోష్, దీప్తి శర్మ, అమన్‌జోత్ మెరుగ్గానే రాణిస్తున్నారు. కానీ.. ప్రతీకా రావల్, హర్లీన్ రాణించాలి. బౌలర్లలో క్రాంతి గౌడ, శ్రీచరణి, దీప్తి, స్నేహ్ రాణా పర్వాలేదనిపిస్తున్నారు. అయితే, గత మ్యాచ్‌లో అదనపు బౌలర్ కోసమని బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌పై వేటు వేసి రేణుకా సింగ్‌ను జట్టులోకి తీసుకున్నారు. కానీ, రేణుక అంతగా ప్రభావం చూపలేక పోయింది. మరి, కివీస్‌తో పోరుకు ఇదే కాంబినేషన్‌ను కొనసాగిస్తారా? లేదంటే ఎక్స్‌ట్రా బ్యాటర్‌గా జెమీమాకు అవకాశమిస్తారో.. చూడాలి.

### పిచ్, వాతావరణం

నవీ ముంబై పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశాలు ఎక్కువ. కాగా మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది.

### జట్లు (అంచనా)

**భారత్:** స్మృతి మంధాన, ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమన్‌జోత్, స్నేహ్ రాణా, దీప్తి శర్మ, రేణుకా సింగ్/జెమీమా రోడ్రిగ్స్ క్రాంతి గౌడ, శ్రీచరణి.

**న్యూజిలాండ్:** సుజీ బేట్స్, జార్జియా ప్లిమ్మర్, అమేలియా కెర్, సోఫీ డివైన్ (కెప్టెన్), బ్రూక్ హాలిడే, మ్యాడీ గ్రీన్, ఇసబెల్లా గేజ్ (వికెట్ కీపర్), జెస్ కెర్, రోజ్‌మేరీ మెయిర్, ఈడెన్ కార్సన్, లియా తహుహు.

**పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 6 | 5 | 0 | 1 | 11 | 1.704 |
| దక్షిణాఫ్రికా | 6 | 5 | 1 | 0 | 10 | 0.276 |
| ఇంగ్లండ్ | 6 | 4 | 1 | 1 | 9 | 1.024 |
| భారత్ | 5 | 2 | 3 | 0 | 4 | 0.526 |
| న్యూజిలాండ్ | 5 | 1 | 2 | 2 | 4 | -0.245 |
| శ్రీలంక | 6 | 1 | 3 | 2 | 4 | -1.035 |
| బంగ్లాదేశ్ | 6 | 1 | 5 | 0 | 2 | -0.578 |
| పాకిస్థాన్ | 6 | 0 | 4 | 2 | 2 | -2.651 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు; ఫ.తే: ఫలితం తేలనవి; ర.రే: రన్‌రేట్

## ఉన్నతి ముందంజ

ఫ్రెంచ్ ఓపెన్ నుంచి సాత్విక్ జోడీ అవుట్

**న్యూఢిల్లీ:** భారత వర్ధమాన షట్లర్ ఉన్నతి హుడా ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ముందంజ వేసింది. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి 11-21, 21-13, 21-16తో లెషన్నా కరుపతెవాన్ (మలేసియా)పై నెగ్గి ప్రీక్వార్టర్స్‌కు చేరింది. కాగా, పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి 18-21, 20-22తో ఇండోనేసియా ద్వయం మహ్మద్ రియాన్ అర్డియాంటో/రహ్మత్ హిదాయత్ చేతిలో ఓటమిపాలై ఆరంభ రౌండ్లోనే వెనుదిరిగింది.

## 12 ఏళ్లలో తొలిసారి..

స్వదేశంలో జింబాబ్వేకు టెస్టు విజయం

చిత్తుగా ఓడిన అఫ్ఘానిస్థాన్

**హరారే:** సొంతగడ్డపై జింబాబ్వే అదరగొట్టింది. అఫ్ఘానిస్థాన్‌తో ఏకైక టెస్టులో ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో గెలిచింది. మ్యాచ్‌ను మూడ్రోజుల్లోనే ముగించిన జింబాబ్వే.. 12 ఏళ్లలో తొలిసారిగా స్వదేశంలో టెస్టు విజయాన్ని అందుకుంది. అంతేకాదు.. 2001 తర్వాత మొదటిసారిగా ఇన్నింగ్స్ గెలుపును నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 34/1 స్కోరుతో మూడోరోజైన బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్ఘాన్ 159 రన్స్‌కే కుప్పకూలింది. గరవ 5 వికెట్లు సాధించాడు. తొలిఇన్నింగ్స్‌లో అఫ్ఘాన్ 127, జింబాబ్వే 359 పరుగులు చేశాయి.

## సౌత్‌జోన్ జట్టులో తెలుగమ్మాయిలు


**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** బీసీసీఐ సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టీ20 ట్రోఫీలో ఆడే సౌత్‌జోన్ జట్టును బుధవారం ప్రకటించారు. 15 మంది బృందంలో నలుగురు తెలుగమ్మాయిలకు చోటు దక్కడం విశేషం. నిక్కీ ప్రసాద్ (కర్ణాటక) కెప్టెన్‌గా, మేఘన (ఆంధ్ర)ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. కేరళకు ఆడుతున్న తెలంగాణ అమ్మాయి ప్రణవి చంద్ర, మమత (హైదరాబాద్), షబ్నం షకీల్ (ఆంధ్ర)కు జట్టులో చోటు లభించింది. స్టాండ్ బైలుగా త్రిష, వంకా పూజ (హైదరాబాద్)కు స్థానం దక్కింది. వచ్చే నెల 4వ తేదీ నుంచి 14 వరకు ఈ టోర్నీ జరగనుంది.

## ఆఖరి లీగ్ మ్యాచ్‌లో టైటాన్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఈ సీజన్ ఆఖరి లీగ్ దశ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు పరాజయం పాలైంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 45-34తో టైటాన్స్‌పై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఓడినా టైటాన్స్ 20పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఇప్పటికే తెలుగు టైటాన్స్, హరియాణా ప్లే ఆఫ్స్ బెర్త్‌లను ఖాయం చేసుకున్నాయి.

## విశ్వజిత్‌కు కాంస్యం

అండర్-23 ప్రపంచ రెజ్లింగ్



**నోవి సాద్ (సెర్బియా):** అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ విశ్వజిత్ మోరె పతకం సాధించాడు. గ్రీకో రోమన్ విభాగం 55 కిలోల విభాగం కాంస్యం పోరులో విశ్వజిత్ 5-4తో కజకిస్థాన్ రెజ్లర్ యెరాసిల్ మెర్‌బెకోవ్‌ను చిత్తుచేశాడు. విశ్వజిత్‌కు ఇది వరుసగా రెండో పతకం కావడం విశేషం. గతేడాది ఇదే టోర్నీలో అతను కాంస్యం గెలిచాడు.

# గెలిచి.. నిలుస్తారా?

ఉదయం 9 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో...


మార్ష్

● కళ్లన్నీ రో-కో పైనే
● ఒత్తిడిలో గిల్ సేన

భారత-ఆస్ట్రేలియా రెండో వన్డే నేడు


గిల్

**అడిలైడ్:** తొలి వన్డేలో చిత్తుగా ఓడిన భారత్.. ఆస్ట్రేలియాతో సిరీస్‌ను సజీవంగా ఉంచే ప్రయత్నాల్లో కఠోరంగా శ్రమిస్తోంది. ఈ నేపథ్యంలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 0-1తో వెనుకబడిన శుభ్‌మన్ గిల్ సేన.. గురువారం జరిగే రెండో వన్డేలో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, కోహ్లీల భవితవ్యం నిర్ణయించే సిరీస్‌గా భావిస్తుండడంతో మరోసారి అందరి దృష్టీ వీరిపైనే నెలకొంది. పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌లో వీరిద్దరూ ఘోరంగా విఫలం కావడం అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. ఆల్‌రౌండర్ల బలంపైనే ఎక్కువగా ఆధారపడ్డ టీమిండియాలో రో-కో చెలరేగితేనే సొంతగడ్డపై ఆసీస్‌కు దీటుగా బదులివ్వగలదు. రోహిత్ కోసం యువ ఆటగాడు జైస్వాల్‌ను బెంచ్‌కే పరిమితం చేయడంపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. వీటికి హిట్‌మ్యాన్ తన బ్యాటుతోనే సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతో ఉంది. మొదటి వన్డేలో వర్షం పలుమార్లు ఆటంకం కలిగించడంతో భారత ఇన్నింగ్స్ సాఫీగా సాగలేదు. సిరాజ్ నేతృత్వంలోని పేస్ విభాగం కూడా ఏమాత్రం ప్రభావం చూపలేకపోవడంతో.. 137 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ అలవోకగా ఛేదించింది. పేస్ ఆల్‌రౌండర్‌గా నితీశ్ కుమార్‌కు మరిన్ని అవకాశాలివ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. కుల్దీప్‌కు తుది జట్టులో చోటివ్వాలన్న ఒత్తిడి పెరుగుతున్నా.. పరిస్థితుల దృష్ట్యా అతడు మరోసారి బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశాలున్నాయి. మరోవైపు ఫుల్ జోష్‌లో ఉన్న ఆసీస్ సిరీస్‌పై గురిపెట్టింది. ముఖ్యంగా స్టార్క్, హాజెల్‌వుడ్ తమదైన బౌన్స్‌తో మరోసారి భారత బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాలనుకొంటున్నారు. కెప్టెన్ మార్ష్, హెడ్, ఫిలిప్, రెన్ షాతో బ్యాటింగ్ విభాగం బలంగానే కనిపిస్తోంది. వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం కాగా.. వాతావరణం సాధారణంగా ఉండనుంది.

### జట్లు (అంచనా)

**భారత్:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రాహుల్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, సుందర్/కుల్దీప్, నితీశ్, హర్షిత్ రాణా/ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్.

**ఆస్ట్రేలియా:** మిచెల్ మార్ష్ (కెప్టెన్), హెడ్, మాథ్యూ షార్ట్, అలెక్స్ క్యారీ (వికెట్ కీపర్), రెన్‌షా, కూపర్, మిచెల్ ఓవెన్, స్టార్క్, నాథన్ ఎల్లీస్, హాజెల్‌వుడ్, జంపా.

### రో-కో దేశవాళీలు ఆడాలి : మాజీ సెలెక్టర్ జగ్దాలే

మ్యాచ్ ఫిట్‌నెస్ కోసం రోహిత్, కోహ్లీ దేశవాళీ క్రికెట్ ఆడాలని మాజీ సెలెక్టర్ సంజయ్ జగ్దాలే సలహా ఇచ్చారు. టెస్టులు, టీ20లకు గుడ్ బై చెప్పిన రో-కో.. వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. 'వీరిద్దరూ గొప్ప వైట్ బాల్ క్రికెటర్లు. 2027 వరల్డ్ కప్ ఆడాలనుకొంటున్నారు. కానీ, తరచూ ఆడకపోతే ఫిట్‌గా ఎలా ఉండగలరు? అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాక మునుపటిలా ఉండడం కష్టమే. వన్డే క్రికెట్ మ్యాచ్‌లు తక్కువగా జరుగుతున్నందున.. దేశవాళీలు ఆడితే మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించగలర'ని జగ్దాలే చెప్పారు.

## ఆష్లే, అనబెల్ ఆల్‌రౌండ్ షో

ఇంగ్లండ్‌పై ఆసీస్ విజయం




**ఇండోర్:** ఆష్లే గార్డనర్ (104 నాటౌట్, 2/39), అనబెల్ సదర్లాండ్ (98 నాటౌట్, 3/60) ఆల్‌రౌండ్ షోతో.. వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 244 పరుగులు చేసింది. బ్యూమాంట్ (78) రాణించింది. ఛేదనలో ఆసీస్ 40.3 ఓవర్లలో 248/4 స్కోరు చేసి గెలిచింది. స్మిత్ 2 వికెట్లు దక్కించుకొంది. టాపార్డర్ బ్యాటర్లు లిచ్‌ఫీల్డ్ (1), వోల్ (6), ఎలీస్ పెర్రీ (13), బెత్ మూనీ (20) విఫలమవడంతో ఆసీస్ 68/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో సదర్లాండ్, గార్డ్‌నర్ ఆదుకొన్నారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 180 పరుగుల అబేధ్య భాగస్వామ్యం నెలకొల్పడంతో.. ఆసీస్ 57 బంతులు మిగిలుండగానే గెలిచింది. సదర్లాండ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఆరు మ్యాచ్‌ల నుంచి 11 పాయింట్లు సాధించిన ఆసీస్ మళ్లీ టాప్‌నకు చేరుకొంది.

## దక్షిణాఫ్రికాకు ఆధిక్యం

పాక్ రెండో ఇన్నింగ్స్ 94/4

**రావల్పిండి:** టెయిలెండర్ కగిసో రబాడ (71), సెనురన్ ముత్తుసామి (89 నాటౌట్) కెరీర్ బెస్ట్ అర్ధ శతకాలతో అదరగొట్టడంతో.. రెండో, ఆఖరి టెస్ట్‌లో పాకిస్థాన్‌పై దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకుంది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 185/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 404 పరుగులకు ఆలౌటైంది. దీంతో పాక్ మొదటి ఇన్నింగ్స్ స్కోరు 333కు 71 రన్స్ ఆధిక్యాన్ని నమోదు చేసింది. అనంతరం పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 94/4 స్కోరు చేసింది. బుధవారం ఆట ఆఖరుకు బాబర్ (49), రిజ్వాన్ (16) క్రీజులో ఉన్నారు.

# బిజినెస్


## ఆర్‌బీఐ వద్ద 880 టన్నుల పసిడి

విలువ రూ.8.36 లక్షల కోట్లు



**న్యూఢిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా పసిడి నిల్వలు పెంచుకుంటోంది. ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు నాటికి ఆర్‌బీఐ వద్ద ఉన్న బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఉన్న నిల్వలతో పోలిస్తే ఇది 600 కిలోలు ఎక్కువ. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఇది 9,500 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.36 లక్షల కోట్లు) సమానం. గత ఆర్థిక సంవత్సరంలోనే ఆర్‌బీఐ 54.13 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో ఫారెక్స్ నిల్వల నిర్వహణలో భాగంగా ఇతర కేంద్ర బ్యాంకుల్లానే ఆర్‌బీఐ కూడా పసిడి నిల్వలు పెంచుకుంటోంది. గత ఏడాది కాలంలో ఆర్‌బీఐతో పాటు వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు 166 టన్నుల పసిడి కొనుగోలు చేశాయి.

## ఇన్ఫీ బైబ్యాక్‌కు ప్రమోటర్లు దూరం




**న్యూఢిల్లీ:** ఇన్ఫోసిస్ ప్రకటించిన కంపెనీ చరిత్రలోనే అతి పెద్దదైన బైబ్యాక్ ప్రక్రియలో పాలుపంచుకోకూడదని ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ నిర్ణయం తీసుకున్నారు. గత నెల 14-19 తేదీల మధ్యలో విడివిడిగా రాసిన లేఖల ద్వారా కంపెనీకి వారు సమాచారం అందించారని ఇన్ఫోసిస్ బుధవారం వెల్లడించింది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లు 13.05% వాటా కలిగి ఉన్నారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణ మూర్తి, ఆయన భార్య సుధా మూర్తి, కూతురు అక్షతా మూర్తి, కుమారుడు రోహన్ మూర్తి, మరో సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, ఆయన భార్య రోహిణి నీలేకని, పిల్లలు నిహార్, జాన్హవి నీలేకనితో పాటు ఇతర సహ వ్యవస్థాపకులు, వారి కుటుంబ సభ్యులు ప్రమోటర్ల జాబితాలో ఉన్నారు. కంపెనీలో 2.41% వాటాకు సమానమైన 10 కోట్ల షేర్లను ఒక్కోటీ రూ.1,800 చొప్పున ఓపెన్ మార్కెట్ నుంచి తిరిగి కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు గత నెల 11న ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఇందుకోసం కంపెనీ మొత్తం రూ.18,000 కోట్లు వెచ్చించనుంది.

# సత్య నాదెళ్ల వేతనం రూ.850 కోట్లు

## 2025 ఆర్థిక సంవత్సరంలో 22% పెంపు



**న్యూఢిల్లీ:** అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓ, తెలుగు వ్యక్తి సత్య నాదెళ్ల 2025 ఆర్థిక సంవత్సరానికి (2024 జూలై 1- 2025 జూన్ 30) రికార్డు స్థాయిలో 9.65 కోట్ల డాలర్ల పారితోషికం అందుకున్నారు. మన కరెన్సీలో దాదాపు రూ.850 కోట్లు. 2024 ఆర్థిక సంవత్సరంలో లభించిన 7.91 కోట్ల డాలర్లతో పోలిస్తే ఆయన వేతన ప్యాకేజీ 22% పెరిగింది. కృత్రిమ మేధలో (ఏఐ) మైక్రోసాఫ్ట్‌ను అగ్రగామిగా నిలబెట్టడంతోపాటు గడిచిన ఏడాది కాలంలో కంపెనీ అద్భుత పనితీరు కనబరచడంతో నాదెళ్ల ప్యాకేజీ కూడా గణనీయంగా పెరిగింది. 2025 ఆర్థిక సంవత్సరంలో మైక్రోసాఫ్ట్ ఆదాయం 15% పెరిగి 28,170 కోట్ల డాలర్లకు చేరగా.. నికర రాబడి 16% వృద్ధితో 10,180 కోట్ల డాలర్లకు చేరింది. అంతేకాదు, ఈ ఏడాదిలో మైక్రోసాఫ్ట్ షేరు ధర 23% పెరిగింది. గత ఏడాది కంపెనీ మార్కెట్ విలువ 3 లక్షల కోట్ల డాలర్ల మైలురాయికి చేరింది. యాపిల్ తర్వాత ఈ స్థాయి మార్కెట్ విలువను కలిగిన కంపెనీ ఇదే.

### 95 శాతానికి పైగా స్టాక్ కేటాయింపులే..

కంపెనీ ఫైలింగ్ ప్రకారం.. నాదెళ్ల వార్షిక పారితోషికంలో 95 శాతానికి పైగా (దాదాపు 8.42 కోట్ల డాలర్లు) పనితీరు ఆధారిత స్టాక్ కేటాయింపులే. అంటే, వ్యాపారాన్ని అనుకున్న లక్ష్యాలకు చేర్చినందుకుగాను కంపెనీ ఆయనకు కేటాయించిన షేర్ల విలువ అది. ఆయన కనీస వేతనం 25 లక్షల డాలర్లుగా ఉంది. మరో 0.95 కోట్ల డాలర్లు నగదు బోనస్, 1.96 లక్షల డాలర్లు ఇతర ప్రయోజనాల రూపంలో లభించాయి.

### 2014లో సారథ్య బాధ్యతలు

మైక్రోసాఫ్ట్ సీఈఓగా 2014లో నాదెళ్ల కంపెనీ పగ్గాలు చేపట్టారు. గడిచిన దశాబ్దానికి పైగా కాలంలో కంపెనీ పనితీరు, వ్యాపారంతో పాటు ఆయన పారితోషికం కూడా గణనీయంగా పెరుగుతూ వచ్చింది. 2015లో ఆయన వేతన ప్యాకేజీ కేవలం 1.8 కోట్ల డాలర్లు. 2022లో 5.5 కోట్ల డాలర్లకు పెరిగింది. 2025లో దాదాపు 10 కోట్ల డాలర్లకు చేరువైంది.

## జేఎల్‌ఆర్‌పై సైబర్ దాడి నష్టం రూ.22,238 కోట్లు

**లండన్:** టాటా మోటార్స్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్‌రోవర్‌పై (జేఎల్‌ఆర్) జరిగిన సైబర్ దాడి భారీ నష్టాన్నే మిగిల్చింది. ఈ నష్టం ఎంత లేదన్నా 190 కోట్ల పౌండ్ల (సుమారు రూ.22,238 కోట్లు) వరకు ఉంటుందని బ్రిటన్‌లో సైబర్ నేరాలను పరిశీలించే ది సైబర్ మానిటరింగ్ సెంటర్ (సీఎంసీ) తెలిపింది. బ్రిటన్ చరిత్రలో అతి పెద్ద సైబర్ దాడిగా పరిగణించే ఈ దాడితో దాదాపు 5,000 వ్యాపార సంస్థలూ దెబ్బతిన్నాయి. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన ఈ దాడితో జేఎల్‌ఆర్ ఉత్పత్తి, మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి.

## ఐదు నెలల్లో మరో 150 కొత్త శాఖలు : యూకో బ్యాంక్

**న్యూఢిల్లీ:** వచ్చే ఐదు నెలల్లో దేశవ్యాప్తంగా మరో 150 కొత్త శాఖలను తెరవనున్నట్లు యూకో బ్యాంక్.. తెలిపింది. దీంతో వచ్చే మార్చి నాటికి బ్యాంకు శాఖల సంఖ్య 3,472కు పెరగనుంది. ఈ విస్తరణ ప్రణాళికకు బోర్డు ఆమోదం లభించిందని, వచ్చే మార్చి నాటికి వీటిని ప్రారంభిస్తామని, త్వరలోనే ఉద్యోగాల నియామకాలు కూడా చేపట్టనున్నట్లు యూకో బ్యాంకు ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ తెలిపారు.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 540 | విజయవాడ | 560 |
| వరంగల్ | 542 | గోదావరి | 553 |
| చిత్తూరు | 583 | విశాఖపట్నం | 545 |
| | | దజను గుడ్లు రూ. | 72 |

**ఫామ్‌గేట్ ధర** — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 112 | విజయవాడ | 126 |
| వరంగల్ | 112 | గుంటూరు | 121 |
| కరీంనగర్ | 112 | ఒంగోలు | 121 |
| మహబూబ్‌నగర్ | 112 | చిత్తూరు | 100 |
| కర్నూలు | 112 | నెల్లూరు | 105 |
| విశాఖపట్నం | 124 | అనంతపురం | 105 |
| గోదావరి | 126 | | |



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,27,200 ▼ | 1,16,500 ▼ | 1,80,000 ▼ |
| విజయవాడ | 1,25,000 ▼ | 1,18,000 ▼ | 1,55,500 ▼ |
| విశాఖపట్నం | 1,25,390 ▼ | 1,19,700 ▼ | 1,75,000 ▼ |
| రాజమండ్రి | 1,27,200 ▼ | 1,16,600 ▼ | 1,63,000 ▼ |
| ప్రొద్దుటూరు | 1,29,000 ▼ | 1,18,680 ▼ | 1,61,000 ▼ |
| ముంబై | 1,23,910 ▼ | 1,13,500 ▼ | 1,52,500 ▼ |

## ఉద్యోగాల్లో ఏఐకే పెద్దపీట

ఇండీడ్ నివేదిక



**న్యూఢిల్లీ:** దేశంలో ఉద్యోగ నియామకాల ముఖచిత్రం మారిపోతోంది. ఏ రంగానికి చెందిన కంపెనీ అయినా నూతన నియామకాల విషయంలో అభ్యర్థికి కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాల్లో పట్టు ఉందా, లేదా అని చూస్తున్నట్టు ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలకు నియామకాల సేవలందించే 'ఇండీడ్' తాజా నివేదికలో తెలిపింది. ఈ సంస్థ నివేదిక ప్రకారం గత నెల దేశీయ కంపెనీలు ప్రకటించిన ఉద్యోగాల్లో 11.7% ఉద్యోగాలకు ఏఐ నైపుణ్యాలు కావాలని కోరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 3.5% ఎక్కువ. ఈ ఏడాది జూన్‌తో పోల్చినా ఇది 1.1% ఎక్కువ. సింగపూర్ తర్వాత భారతీయ కంపెనీలే కొత్త ఉద్యోగుల్లో ఏఐ నైపుణ్యాలను ఎక్కువగా చూస్తున్నట్టు ఇండీడ్ సంస్థ ఆసియా-పసిఫిక్ ప్రాంత సీనియర్ ఆర్థికవేత్త కాలమ్ పికరింగ్ చెప్పారు.

**టెక్‌లోనే ఎక్కువ:** ఉద్యోగుల్లో ఏఐ నైపుణ్యాలు కోరుతున్న కంపెనీల్లో టెక్ కంపెనీలు అగ్రస్థానంలో ఉన్నాయి. డేటా అండ్ అనలిటిక్స్ ఉద్యోగుల కోసం చూస్తున్న కంపెనీల్లో 39% కంపెనీలు ఏఐ నైపుణ్యాలు అడుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి (23%), బీమా (18%), శాస్త్రీయ పరిశోధన (17%) కంపెనీలు తర్వాతి స్థానాల్లో ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది.

**ఉద్యోగాలకు ముప్పే: మస్క్**

టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ ఉద్యోగాల్లో ఏఐ ప్రభావంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏఐ, రోబోలు భవిష్యత్‌లో మనుషులు చేసే అన్ని ఉద్యోగాలను చేస్తాయన్నారు. అపుడు పనీ పాట లేని వ్యక్తులు కూరగాయలు పెంచుకుంటూ కాలక్షేపం చేయవచ్చంటూ సోషల్ మీడియా యాప్ 'ఎక్స్' పోస్టులో వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. టీసీఎస్, యాక్సెంచర్ వంటి ఐటీ దిగ్గజాలు వేల మంది ఉద్యోగులకు తీసివేస్తున్న సమయంలో మస్క్ పెట్టిన ఈ పోస్టు ఐటీ ఉద్యోగులను మరింత భయపెడుతోంది.

### అమెజాన్‌లో ఆరు లక్షల ఉద్యోగాలు ఔట్

ఏఐ ప్రభావం ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ పైనా కనిపిస్తోంది. 2030 నాటికి అమెజాన్ అమెరికాలో ఆరు లక్షల మంది ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో రోబోలను ఏర్పాటు చేయనున్నట్టు న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఇందులో 1.6 లక్షల ఉద్యోగాలను 2027 కల్లా తొలగించనుంది. దీంతో 2025-27 మధ్య అమెజాన్‌కు 1260 కోట్ల డాలర్ల వరకు ఆదా అవుతాయని అంచనా.

## గూగుల్ క్రోమ్‌కు పోటీగా చాట్‌జీపీటీ అట్లాస్

» ప్రకటించిన ఓపెన్ ఏఐ
» గూగుల్ మార్కెట్ విలువలో రూ.13.20 లక్షల కోట్ల పతనం

**న్యూఢిల్లీ:** జనరేటివ్ ఏఐ అప్లికేషన్ చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్‌ఏఐ.. ఇక వెబ్ బ్రౌజింగ్ సేవలనూ అందించబోతోంది. గూగుల్ క్రోమ్‌కు పోటీగా చాట్‌జీపీటీ అట్లాస్ పేరుతో ఏఐ ఆధారిత వెబ్ బ్రౌజర్‌ను ప్రవేశపెడుతున్నట్లు ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్ ప్రకటించారు. దాంతో గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ షేరు ఒకదశలో 5% వరకు క్షీణించి 246.15 డాలర్లకు పడిపోయింది. కంపెనీ మార్కెట్ విలువ ఏకంగా 15,000 కోట్ల డాలర్ల మేర (సుమారు రూ.13.20 లక్షల కోట్లు) పతనమైంది. అయితే, షేరు మళ్లీ కాస్త కుదురుకుని 2.4 శాతం నష్టంతో 250.6 డాలర్ల వద్ద ముగిసింది. అంతర్జాలంలో సమాచార శోధనకు ఉపయోగించే వెబ్ బ్రౌజర్లలో ప్రస్తుతం గూగుల్ క్రోమ్‌దే గుత్తాధిపత్యం. క్రోమ్‌కు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 300 కోట్ల మంది యూజర్లున్నారు. గూగుల్ తన జనరేటివ్ ఏఐ అప్లికేషన్ జెమినీ సేవలను సైతం ఇప్పటికే క్రోమ్‌తో అనుసంధానించింది. అయితే, జనరేటివ్ ఏఐ సేవల్లో చాట్‌జీపీటీదే అగ్రస్థానం.

ఈ యాప్‌ను 80 కోట్ల మందికి పైగా వినియోగిస్తున్నారు. చాట్‌జీపీటీ అట్లాస్ లాంచ్ ద్వారా ఓపెన్ ఏఐ మరింత మంది ఇంటర్నెట్ వినియోగదారులకు చేరువ కావాలనుకుంటోంది.

### భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో 3% వృద్ధి

**న్యూఢిల్లీ:** భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్.. జూలై- సెప్టెంబర్ త్రైమాసికంలో 3% వార్షిక వృద్ధితో 4.84 కోట్ల యూనిట్లను సరఫరా చేసింది. పండుగ సీజన్ ముందస్తు డిమాండ్, కొత్త మోడళ్ల ఆవిష్కరణ, రిటైల్ ప్రోత్సాహక వ్యూహాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయని టెక్ రీసెర్చ్ సంస్థ ఒమిడియా తాజా నివేదికలో వెల్లడించింది. అయితే ఈ వృద్ధి దీర్ఘకాలికంగా కొనసాగుతుందనే సంకేతాలు కనిపించడంలేదని పేర్కొంది. వినియోగదారుల సహజ డిమాండ్ తక్కువగానే ఉందని, రిటైలర్లకు ఇచ్చిన నగదు బోనస్, బహుమతులు, డీలర్ల మధ్య పోటీకి ఇచ్చిన ప్రోత్సాహాలతోనే ఈ వృద్ధి నమోదైనట్లు ఒమిడియా ప్రధాన విశ్లేషకుడు సన్యం చౌరాసియా తెలిపారు. ఏడాది చివరి వరకు ఈ సానుకూల ధోరణి కొనసాగడం కష్టసాధ్యమేనని ఆయన అన్నారు.

# జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఇన్‌చార్జులతో నేడు కేసీఆర్ భేటీ

- ప్రచారంపై దిశానిర్దేశం చేయనున్న గులాబీ బాస్
- అధినేతతో భేటీ అయిన కేటీఆర్, హరీశ్

హైదరాబాద్/గజ్వేల్/మర్కుక్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ ప్రచార వ్యూహంపై ప్రత్యేకంగా చర్చించేందుకు.. బీఆర్ఎస్ ఇన్‌చార్జులతో.. ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్‌రావు గురువారం భేటీ కానున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డివిజన్లవారిగా పార్టీ నియమించిన ఇన్‌చార్జులు ఇందులో పాల్గొననున్నారు. ఈ ఉప ఎన్నిక ప్రచారానికి కేసీఆర్ స్టార్ క్యాంపెయినర్ కూడా కావడంతో.. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపే లక్ష్యంగా ప్రచారంలో ఆయన నేరుగా పాల్గొంటారని సమాచారం. అందులో భాగంగానే ఇన్‌చార్జులతో ముందస్తు సమావేశం నిర్వహించి.. కార్యాచరణ ప్రకటిస్తారని తెలిసింది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో ప్రచార వ్యూహం, రోడ్‌షోలు, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇంటింటి ప్రచారం.. ఇతర అంశాలపై గులాబీ బాస్ పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది.

### జూబ్లీహిల్స్‌లో విజయంపై కేసీఆర్ ధీమా

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం బీఆర్ఎస్‌దేనని ఆ పార్టీ చీఫ్ కేసీఆర్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులతో కేసీఆర్ భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ పరిధిలో తాజా పరిస్థితులు, పార్టీ ప్రచార కార్యక్రమాలపై వారు కేసీఆర్‌కు వివరించారని సమాచారం. ఈ మేరకు రంగంలోకి దిగాల్సిందిగా కేసీఆర్‌ను కోరినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్‌తోనే ఉన్నారని, నాయకులు కార్యకర్తలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని ఈ సందర్భంగా కేసీఆర్ సూచించినట్లు సమాచారం.

# అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంథాలయం!

- రూ.100 కోట్లతో నిర్మిస్తామన్న శోభా గ్రూప్



అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంథాలయ నిర్మాణానికి దుబాయ్‌లోని ప్రముఖ రియాల్టీ సంస్థ శోభా గ్రూప్ ముందుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దుబాయ్ పర్యటన ప్రారంభమైంది. మూడ్రోజుల పర్యటనలో భాగంగా మంత్రులు, అధికారులతో కలిసి బుధవారం దుబాయ్ చేరుకున్న ఆయన.. తొలి రోజే పలువురు పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు నిర్వహించారు. అందులో భాగంగా..శోభా గ్రూప్ చైర్మన్ రవి మీనన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. అమరావతిలో రూ.100 కోట్ల విరాళంతో ఉచితంగా ప్రపంచ స్థాయి గ్రంథాలయం నిర్మిస్తామని రవి మీనన్ వెల్లడించారు. అమరావతిని ప్రపంచంలో అత్యుత్తమ రాజధాని నగరంగా నిర్మిస్తున్నామని, దాని నిర్మాణంలో శోభా గ్రూప్ కూడా భాగస్వామి కావాలని సీఎం కోరారు.

# మద్యం షాపుల దరఖాస్తులకు నేడే ఆఖరు

- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 90,316 మంది దరఖాస్తు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం దుకాణాల లైసెన్సుల కోసం జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ తుది అంకానికి చేరుకుంది. దరఖాస్తులకు గురువారమే చివరి రోజు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 90,316 దరఖాస్తులొచ్చాయి. బుధవారం 511మంది దరఖాస్తు చేసుకున్నారు. చివరి రోజున దరఖాస్తుల దాఖలు చేయడానికి అన్ని జిల్లాలకు సంబందించిన కౌంటర్లను ప్రొహిబిషన్ కార్యాలయాల్లో ఎక్సైజ్ డివిజన్లవారీగా ఏర్పాట్లు చేశారు.

# 2,408 మంది కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు

- 172మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు : మంత్రి తుమ్మల

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మార్కెటింగ్ శాఖలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించడం ద్వారా.. రాష్ట్రవ్యాప్తంగా 2,408 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు దక్కాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రాష్ట్రంలో 207 మార్కెట్ కమిటీలు ఉండగా... 172 మార్కెట్ కమిటీలకు పూర్తిస్థాయి పాలక వర్గాలను నియమించామని, దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొన్నదని తుమ్మల పేర్కొన్నారు. మిగిలిన 35 కమిటీలకు కూడా త్వరలో పాలకవర్గాలను నియమిస్తామని మంత్రి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇంత విస్తృత స్థాయిలో నామినేటెడ్ పోస్టులు ఇవ్వడం ఇదే మొదటిసారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడే సమయానికి 197 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయని, రైతుల సౌకర్యం కోసం, ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు కొత్తగా మరో 10 మార్కెట్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తుమ్మల తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని మంత్రి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులు పంటలు అమ్ముకునే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని, ముఖ్యమంత్రి సూచనలతో అన్ని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేస్తున్నామని తుమ్మల పేర్కొన్నారు. పాలకవర్గాల నియామకంతో మార్కెట్ కమిటీల్లో పారదర్శకత పెరుగుతుందని, రైతులకు సకాలంలో సౌకర్యాలు అందుతాయని మంత్రి తెలిపారు.

# 8,9 తేదీల్లో పౌర హక్కుల సంఘం మహాసభలు

బర్కత్‌పుర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల సంఘం తృతీయ రాష్ట్ర మహాసభలు నవంబరు 8, 9 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ్ రావు తెలిపారు. బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. మావోయిస్టులు, ఆదివాసుల ఉద్యమ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభలకు ప్రముఖ ప్రొఫెసర్లు, న్యాయవాదులు, ఆదివాసీ హక్కుల కార్యకర్తలు హాజరవుతారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య మెయిన్ హాల్లో నిర్వహించే సభలకు వేలాదిగా ప్రజలు తరలివచ్చి, విజయవంతం చేయాలని వారు కోరారు.

# 'నేషనల్ టాలెంట్ హంట్' కోఆర్డినేటర్ల నియామకం

- తెలంగాణకు భావన జైన్, ఏపీకి పూజా త్రిపాఠి

న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): 'నేషనల్ టాలెంట్ హంట్' పేరిట కాంగ్రెస్ నిర్వహిస్తోన్న కార్యక్రమానికి, పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నోడల్ కోఆర్డినేటర్లను ఆ పార్టీ నియమించింది. రాజకీయాల్లో యువతను ప్రోత్సహించడానికి, ముఖ్యంగా మీడియా రంగంలో తదుపరి తరం ప్రతినిధులను సిద్ధం చేయడం కోసం ఆ పార్టీ ఈ వేదికను ప్రారంభించింది. ఎంపికైన వారి వివరాలను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు పవన్‌ఖేరా బుధవారం వెల్లడించారు. తెలంగాణకు భావన జైన్, ఆంధ్రప్రదేశ్‌కు పూజా త్రిపాఠిని కోఆర్డినేటర్లుగా నియమించారు.

# రేపు, ఎల్లుండి భారీ వర్షాలు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఈ నెల 24, 25 తేదీల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఇక శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అన్ని జిల్లాల్లో అక్కడక్కడ పడతాయని వెల్లడించింది.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై రేపు విచారణ పునఃప్రారంభం

- ప్రకాశ్‌గౌడ్, యాదయ్య, మహిపాల్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలమీద పిటిషన్లపై విచారణ
- నేడు హైదరాబాద్‌కు రానున్న స్పీకర్
- మిగిలిన నలుగురు ఎమ్మెల్యేల విచారణ
- 31 వరకూ అసెంబ్లీ ప్రాంగణంలో ఆంక్షలు
- శాసనసభ, మండలిలను ప్రొరోగ్ చేసిన గవర్నర్

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ టికెట్‌పైన గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లపైన విచారణను స్పీకర్ ప్రసాద్‌కుమార్ పునః ప్రారంభించనున్నారు. కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో పాల్గొనేందుకు బార్బడోస్ వెళ్లిన ప్రసాద్‌కుమార్.. గురువారం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. ఆయన బార్బడోస్ టూర్‌కు వెళ్లే ముందు ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలపై దాఖలైన పిటిషన్లపైన విచారణ ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే ఆయన టూర్ నేపథ్యంలో విచారణకు విరామం ఇచ్చారు. శుక్రవారం ఆ నలుగురు ఎమ్మెల్యేలమీద దాఖలైన పిటిషన్లపై వాదనలు స్పీకర్ సమక్షంలో జరగనున్నట్లు బుధవారం ఆయన కార్యాలయం వెల్లడించింది. కాగా.. అనర్హత పిటిషన్లకు సంబంధించి స్పీకర్ నోటీసులు అందుకున్న పది మంది ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరిలు మినహా మిగిలిన 8 మంది వివరణ ఇచ్చారు. ఆ 8 మందిలో నలుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి పిటిషన్లపైన విచారణను ప్రారంభించిన స్పీకర్.. శుక్రవారం ముగించే అవకాశం ఉందని చెబుతున్నారు. మిగిలిన నలుగురు ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, ఎం. సంజయ్‌కుమార్‌లపై దాఖలైన పిటిషన్ల విచారణను ఈ నెల 27 నుంచి చేపట్టే అవకాశం ఉందని అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. ఎమ్మెల్యే అనర్హత పిటిషన్లపై విచారణ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి ఈ నెల 31 వరకు అసెంబ్లీ ప్రాంగణంలోకి విజిటర్లు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మీడియా ప్రతినిధులు ఎవరూ రాకుండా ఆంక్షలు విధించారు.

### శాసనసభ, మండలి ప్రొరోగ్

శాసనసభ, మండలి సమావేశాలను ప్రొరోగ్ చేస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. గడిచిన ఆగస్టు 30న ప్రారంభమైన శాసనసభ, మండలి సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే.

### ఫిరాయింపులపై మాట్లాడే నైతికత కేటీఆర్‌కు లేదు: అద్దంకి

"కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా దానం నాగేందర్‌ను పెట్టినందుకు కేటీఆర్ ఎగిరెగిరి పడుతున్నడు. టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నుంచి గెలిచిన సబితాఇంద్రారెడ్డిలను కేసీఆర్ మంత్రివర్గంలోకి తీసుకున్నప్పుడు ఎందుకు మాట్లాడలేదు?" అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. సీఎల్పీ మీడియా హాల్లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతికత కేటీఆర్‌కు లేదన్నారు.

# నామినేషన్ల స్ర్కూటినీ.. హైడ్రామా..!

## ప్రధాన పార్టీల అభ్యర్థుల పరస్పర అభ్యంతరాలు.. అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం

- మాగంటి మొదటి భార్య కుమారుడినని.. పేర్కొంటూ సోషల్ మీడియాలో లేఖ వైరల్
- ఫిర్యాదు అందినట్లుగా పేర్కొన్న అధికారులు
- దానిని పరిగణనలోకి తీసుకోలేదని వివరణ
- భారీగా నామినేషన్లు.. 211 మంది.. 321 సెట్లు
- టోకెన్లు ఇచ్చి.. నామినేషన్ల పరిశీలన



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల సంఘం అధికారులు

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నిక నామినేషన్ల పరిశీలన సందర్భంగా షేక్‌పేటలోని రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయం వద్ద హైడ్రామా నెలకొంది. పలువురు అభ్యర్థులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో స్ర్కూటినీ వద్ద టెన్షన్ వాతావరణం కనిపించింది. అభ్యంతరాలు, సందేహాల నివృత్తి మధ్య కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్‌యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాగోపినాథ్, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిలు వేసిన నామినేషన్లను ఆర్వో ఆమోదించారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు 211 మంది అభ్యర్థులు 321 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. ఆర్ఆర్ఆర్ , ఫార్మాసిటీ బాధిత రైతులతో పాటు మాల సంఘాల జేఏసి నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. స్ర్కూటినీ సమయంలోనూ అభ్యర్థులకు ఎన్నికల అధికారులు టోకెన్ పద్ధతిని అమలు చేశారు. దీని ప్రకారం అభ్యర్థిని పిలిచి నామినేషన్లు పరిశీలించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సునీత నామినేషన్ పత్రాల విషయంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇందులో కుటుంబ విషయాలు కూడా ఉండటంతో ఇవన్నీ తమ పరిధి కాదని ఎన్నికల అధికారి బదులిచ్చారు. కొద్దిసేపటికి నవీన్‌యాదవ్ ఫారం-26లో కొన్ని కాలములు పూర్తి చేయలేదని.. ఇదే కారణంతో స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారని సునీత తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. దీంతో కొద్దిసేపు ఆర్వో కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. చివరకు ఎన్నికల అధికారి ఇద్దరి నామినేషన్లు అమోదించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు 24వ తేదీ వరకు అవకాశముంది.

### నామినేషన్ల తిరస్కరణ..

సరైన పత్రాలు లేకపోవడం, ఫారం పూర్తిగా నింపకపోవడం వంటి కారణాలతో పలు నామినేషన్లు తిరస్కరించారు. బోరబండ, షేక్‌పేట, రహ్మత్‌నగర్‌లో కొద్దికాలంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ చర్చల్లో ఉన్న సల్మాన్‌ఖాన్‌కు చెందిన నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. స్ర్కూటినీలో బుధవారం రాత్రి 11 గంటల వరకు 144 మంది అభ్యర్థులకు సంబంధించి 232 నామినేషన్లను పరిశీలించారు. ఇందులో 80 మంది అభ్యర్థుల 126 నామినేషన్లను తిరస్కరించగా.. 64 అభ్యర్థుల 106 నామినేషన్లను ఆమోదించారు.

### మాగంటి సునీతపై ఫిర్యాదు!

బీఆర్ఎస్ అభ్యర్థి సునీతపై గోపినాథ్ మొదటి భార్య మాలిని కుమారుడు ప్రద్యుమ్న ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు ఓ లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తన తల్లికి విడాకులు ఇవ్వకుండా సునీతతో గోపినాథ్ కలిసి ఉన్నారని, వారు వివాహం చేసుకోలేదని, లివింగ్ రిలేషన్‌షిప్‌లో ఉన్నారని లేఖలో పేర్కొన్నారు. గోపినాథ్ భార్య అని సునీత చెబుతన్న దాంట్లో వాస్తవం లేనందున ఆమె నామినేషన్ తిరస్కరించాలంటూ ఈసీకి ఫిర్యాదు చేసినట్లుగా ప్రచారం జరిగింది. దీనిపై ఎన్నికల సంఘం అధికారులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందినట్లుగా పేర్కొన్నారు. అయితే ఈ ఫిర్యాదును ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోలేదు. సునీత.. గోపినాథ్ భార్యనా..? కాదా..? అన్నది తేల్చాల్సిన బాధ్యత తమది కాదని, ఈ వ్యవహారం కోర్టులో తేల్చుకోవాలని ఈసీ సూచించింది. ఇదిలా ఉంటే విదేశాల్లో ఉంటోన్న ప్రద్యుమ్న ఎక్కడా మాట్లాడినట్టు వీడియోలు లేకపోవడం గమనార్హం. కాగా.. ఈ లేఖపై తాను మాట్లాడదలుచుకోలేదని సునీత తెలిపారు. వాస్తవాలు ఏంటి అనేది ప్రజలకు తెలుసునని, తన అభ్యర్థిత్వాన్ని జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. తాను వేసిన నాలుగు సెట్ల నామినేషన్లను ఆమోదించినట్లు ఆమె తెలిపారు.

### పనికిమాలిన అభ్యంతరాలు: నవీన్‌యాదవ్

తన నామినేషన్లపై బీఆర్ఎస్ పనికిమాలిన అభ్యంతరాలను లేవనెత్తిందని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ ఆరోపించారు. తాను దాఖలు చేసిన మూడు సెట్ల నామినేషన్లు ఆమోదించినట్లు తెలిపారు. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని, తాను ఎవరి వ్యక్తిగత విషయాలపై వాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు.



టీజేఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మహేశ్ గౌడ్, కోదండరాం

# 'జూబ్లీహిల్స్'లో కాంగ్రెస్‌కు మద్దతివ్వండి

- కోదండరాంను కలిసి కోరిన టీపీసీసీ చీఫ్
- మాకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించండి
- ఉద్యమకారులను గుర్తించండి
- మహేశ్‌గౌడ్‌కు కోదండరాం వినతి

హైదరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని టీజేఎస్ అధినేత కోదండరాంను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కోరారు. టీజేఎస్ రాష్ట్ర కార్యాలయానికి బుధవారం వెళ్లిన మహేశ్‌గౌడ్.. కోదండరాంను కలిసి ఈ మేరకు మద్దతు కోరారు. అయితే, ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్‌కు కోదండరాం పలు ప్రతిపాదనలు పెట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం కార్యాచరణ చేపట్టాలని సూచించారు.టీజేఎస్‌కు ప్రభుత్వంలో తగిన భాగస్వామ్యం కల్పించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో టీజేఎస్ అభ్యర్థులకు తగినన్ని స్థానాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చేందుకు సుముఖంగానే ఉన్నామని, పార్టీలో చర్చించి తుది నిర్ణయం ప్రకటిస్తామన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ టీజేఎస్‌కు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. కాగా, కేంద్ర మంత్రి బండి సంజయ్ నోటికొచ్చినట్లు మాట్లాడడం విచారకరమని మహేశ్‌గౌడ్ అన్నారు. ఉప ఎన్నికలో మతవాద శక్తులకు బుద్ధిచెప్పాలని ఓటర్లను కోరారు.

# 5న 'జీశాట్-7ఆర్' ప్రయోగం

- నవంబరులో రెండు ప్రయోగాలకు ఇస్రో సిద్ధం
- షార్‌కు చేరిన బ్లూబర్డ్ బ్లాక్-2 ప్రయోగ పరికరాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నవంబరులో రెండు ప్రయోగాలకు సిద్ధమవుతోంది. తొలుత నవంబరు 5న ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా భారత నౌకాదళం సేవలకు ఉపయోగపడే అధునాతన బహుళ బ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-7ఆర్ (సీఎంఎస్-02)ను రోదసీలోకి పంపనుంది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి చేపట్టే ఈ ప్రయోగానికి సంబంధించి ఇప్పటికే వ్యాబ్‌లో రాకెట్ మూడు దశల అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తిచేసి ప్రయోగానికి సిద్ధం చేశారు. వాస్తవానికి ఈ నెల 25నే ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉంది. కానీ.. క్రయో దశలో చిన్నపాటి సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగాన్ని నవంబరు 5వ తేదీకి వాయిదా వేశారు. లోపాన్ని సరిచేసి రాకెట్‌ను రెండో ప్రయోగ వేదిక వద్దకు తరలించనున్నారు. ఈ ప్రయోగం తర్వాత నవంబరు నెలాఖరులో మరో వాణిజ్య ప్రయోగానికి ఇస్రో సిద్ధంగా ఉంది. ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన కమ్యూనికేషన్ ఉపగ్రమం బ్లూబర్డ్ బ్లాక్-2 ప్రయోగం చేపట్టనుంది. దీనికి సంబంధించిన రాకెట్ పరికరాలు రెండు ప్రత్యేక వాహనాల్లో బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ షార్‌కు తీసుకొచ్చారు. గురువారం నుంచి ఈ ప్రయోగ పనులు శరవేగంగా జరగనున్నాయి. ఈ ప్రయోగ పర్యవేక్షణ కోసం ఇప్పటికే అమెరికాకు చెందిన 8 మంది శాస్త్రవేత్తల బృందం షార్‌కు చేరుకుని ప్రయోగ ఏర్పాట్లలో పాలుపంచుకుంటున్నారు. నబంబరులో రెండు ప్రయోగాలు ఉండడంతో షార్‌లో శాస్త్రవేత్తలు బిజీబిజీగా ఉన్నారు.

# ఆబ్కారీ శాఖలో రిజ్వీ మంటలు

(మొదటిపేజీ తరువాయి)

చర్చనీయాంశంగా మారాయి.

### రిజ్వీపై చర్యలు తీసుకోవాల్సిందే: మంత్రి

రిజ్వీ వీఆర్ఎస్ దరఖాస్తు, ఆయనపై సీఎస్‌కు మంత్రి చేసిన ఫిర్యాదు బయటికి వచ్చిన అనంతరం.. సీఎస్‌కు మంత్రి జూపల్లి మరో లేఖ రాశారు. రిజ్వీ ఉద్దేశపూర్వకంగా విధులను ఉల్లంఘించారని, రాజ్యాంగ బద్ధమైన విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, మంత్రిగా తన విధుల నిర్వహణకు అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. అనుచిత ప్రవర్తన, క్రమశిక్షణ ఉల్లంఘన నేపథ్యంలో రిజ్వీపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### సీఎస్‌కు పంపిన నోట్‌లోని వివరాలివీ..

"మద్యం బాటిళ్లపై వేసే హోలోగ్రామ్ లేబుల్స్‌కు సంబంధించి 11 ఏళ్లుగా ఒకే కంపెనీకి సరఫరా కాంట్రాక్టు ఇస్తున్నారు. కొత్త సాంకేతితలతో, మరింత భద్రమైన లేబుల్స్ ఇచ్చేలా కొత్తగా టెండర్లు పిలవాలని మంత్రి ఆదేశించినా.. ముఖ్య కార్యదర్శి రిజ్వీ పాతవారికే అవకాశం కల్పించారు. చిట్టీ స్రుజన్ కేసులో బకాయిలు, కాంపౌండింగ్ ఫీజును పునః పరిశీలించాలని మంత్రి మూడు పర్యాయాలు ఆదేశించినా ముఖ్య కార్యదర్శి పట్టించుకోలేదు. క్యాప్రికార్న్ బ్లెండర్స్ నుంచి చట్టవిరుద్ధంగా రూ.6.15 కోట్ల డిమరేజ్ చార్జీలను వసూలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో.. సంబంధిత రికార్డులు అందజేయాలని మంత్రి కోరినా.. నివేదికల పేరుతో ముఖ్యకార్యదర్శి జాప్యం చేశారు. టీజీబీసీఎల్ ఎండీకి అవసరమైన వివరాలు ఇవ్వలేదు. ఏటీడీ లిమిటెడ్ కంపెనీ మద్యం ఉత్పత్తి, గరిష్ఠ అమ్మకం ధర విషయంలో అసాధారణ జాప్యంతో రాష్ట్ర ఖజానాకు భారీగా నష్టం కలిగిందనే ఫిర్యాదులపై ఎక్సైజ్ కమిషనర్‌ను మంత్రి వివరణ కోరినా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. ఇక అవసరం లేని ఫైళ్లను కూడా సీఎంవో కార్యాలయానికి పంపడం, మంత్రి తీసుకున్న నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం కావాలంటూ కోరడం వంటి చర్యలతో తీవ్ర జాప్యం చేస్తూ వచ్చారు. ఎంపీ (ఈఎంపీఈఈ) డిస్టలరీ విషయంలో ఎల్ఓఐ (లెటర్ ఆఫ్ ఇంటెన్ట్) జారీ చేయాలని మంత్రి ఆదేశించినా ముఖ్య కార్యదర్శి పట్టించుకోలేదు. బ్లూసీల్ వైనరీ విషయంలో మేనేజ్‌మెంట్ మార్పు ప్రక్రియ ఎన్నికల కోడ్ కారణంగా 5 నెలల 21 రోజులు జాప్యం జరిగింది. లైసెన్స్ పొందడంలో మేనేజ్‌మెంట్ తప్పు లేదని, అనుమతులు ఇవ్వాలని మంత్రి ఆదేశించగా.. మంత్రికి నిబంధనలు సడలించే అధికారం లేదని, ముఖ్యమంత్రికి మాత్రమే ఉందంటూ రిజ్వీ ఆ ఫైల్‌ను సీఎంవోకు పంపారు. ఏ నిబంధన కింద సీఎంకు ఈ ఫైల్ పంపారో తెలపాలని ముఖ్య కార్యదర్శిని మంత్రి అడగాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇలా సంబంధం లేని ఫైళ్లు పంపడం ద్వారా.. సీఎంవోపై అనవసరపు భారం మోపారు. డిస్టిలరీలకు సంబంధించి ఎల్ఓఐలను ఆమోదించే అధికారం మంత్రికే ఉన్నా.. మంత్రి మండలి ఆమోదం కావాలంటూ పెండింగ్‌లో పెట్టారు. ఇక బార్ అసోసియేషన్ ఫిర్యాదులు, ఏ4 దుకాణాల సంఘం నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి వీలుగా ఆయా అంశాల వివరాలతో నివేదిక ఇవ్వాలని ఈ ఏడాది ఆగస్టు 30న కమిషనర్‌ను మంత్రి కోరినా ఇంత వరకు నివేదిక ఇవ్వలేదు. కొన్ని లిక్కర్ సంస్థలకు సకాలంలో అనుమతులు ఇవ్వకపోవడంతో ఉత్పత్తి తగ్గిపోయి రాష్ట్ర ఖజానాకు రూ.223 కోట్ల నష్టం వాటిల్లేలా కమిషనర్ వ్యవహరించారు" అని నోట్‌లో పేర్కొన్నారు.

### పదేళ్ల సర్వీసు ఉండగానే వీఆర్ఎస్ నిర్ణయం

రాష్ట్ర వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి, 1999 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) కోసం బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. దానిని ప్రభుత్వం ఆమోదించింది. ఈ నెల 31 నుంచి ఆయన వీఆర్ఎస్ అమల్లోకి వస్తుందని సీఎస్ కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంకా పదేళ్ల సర్వీసు మిగిలి ఉండగానే ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేయడం గమనార్హం. అయితే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రిజ్వీకి ఫోన్ చేసి, వీఆర్ఎస్‌ను విరమించుకుని, తిరిగి విధుల్లో కొనసాగాలని సూచించినట్లు సమాచారం. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కాగా.. ప్రభుత్వం వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి అదనపు బాధ్యతలను ఆ శాఖ కమిషనర్ ఎం.రఘునందన్‌రావుకు అప్పగించింది. టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌కు దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ డైరెక్టర్ పోస్టు అదనపు బాధ్యతల నుంచి శైలజా రామయ్యర్‌ను రిలీవ్ చేసింది. ఐటీ శాఖ డిప్యూటీ కార్యదర్శి భవేష్ మిశ్రాకు గనులు, భూగర్భ వనరుల శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. సిద్దిపేట అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)ను బదిలీ చేసి రాజన్న-సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా నియమించింది.

# గంటకు 350 కి.మీ. వేగంతో రైళ్లు

- హైదరాబాద్ నుంచి రెండు ఎలివేటెడ్ రైల్ కారిడార్లు
- హైదరాబాద్-చెన్నై 760 కి.మీ; హైదరాబాద్-బెంగళూరు 605 కి.మీ.
- దక్షిణమధ్య రైల్వే ప్రతిపాదనలు.. రూట్ మ్యాప్ సిద్ధం



అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మీదుగా మరో భారీ రైల్వే ప్రాజెక్టు నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మెజారిటీ భాగం రాష్ట్రం మీదుగా వెళ్లేలా రెండు హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్లకు రూట్ మ్యాప్ సిద్ధం చేసింది. ఎస్సీఆర్ ప్రతిపాదనల మేరకు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైల్వే లైన్లను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌ను 605 కిలోమీటర్లు, హైదరాబాద్-చెన్నై కారిడార్‌ను 760 కిలోమీటర్ల దూరం నిర్మించనున్నారు. రెండు కలిపి 1,365 కిలోమీటర్ల పొడవు గల హై స్పీడ్ కారిడార్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ రెండు కారిడార్లు 767 కిలోమీటర్ల మేర ఆంధ్రప్రదేశ్ భూభాగంలో ఏర్పాటు కానున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు ఎస్సీఆర్ రూ.5.42 లక్షల కోట్ల వ్యయంతో అంచనాలు సిద్ధం చేసింది. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌కు రూ.2.38 లక్షల కోట్లు, హైదరాబాద్-చెన్నై కారిడార్‌కు రూ.3.04 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌కు సంబంధించి ఏపీలో 263 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణం చేపడతారు. 6 ప్రత్యేక స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే హైదరాబాద్-చెన్నై కారిడార్‌కు సంబంధించి ఏపీలో 9 ప్రత్యేక స్టేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు 504 కి.మీ. రైల్వే లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రెండు కారిడార్లలో ముఖ్యమైన పనులు ఏపీలోనే జరగనున్నాయి.

### హైదరాబాద్-బెంగళూర్ కారిడార్

హైదరాబాద్-బెంగళూర్ హై స్పీడ్ కారిడార్ ఏపీలో నాలుగు జిల్లాల మీదుగా ఏర్పాటు కానుంది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల గుండా కారిడార్ నిర్మాణం జరగనుంది. కర్నూలులో 46.56 కి.మీ., నంద్యాలలో 37.3 కి.మీ, అనంతపురంలో అత్యధికంగా 86.6 కి.మీ, శ్రీ సత్యసాయి జిల్లాలో 79.08 కి.మీ. పొడవున ఏర్పాటు కానున్న కారిడార్ నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలంటూ ఏపీ ప్రభుత్వానికి దక్షిణ మధ్య రైల్వే లేఖ రాసింది.

### హైదరాబాద్-చెన్నై కారిడార్..

హైదరాబాద్-చెన్నై కారిడార్ ఏపీలో ఏడు జిల్లాల మీదుగా వెళ్లనుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల మీదుగా కారిడార్ నిర్మాణం జరగనుంది. పల్నాడు జిల్లాలో 81 కి.మీ., గుంటూరులో 66.45, బాపట్లలో 43.21, ప్రకాశంలో 58.37, నెల్లూరులో 116.79, తిరుపతిలో 130.58, చిత్తూరులో 8.17 కి.మీ. కారిడార్ల కోసం కేటాయించాల్సిన అవసరం ఉందని ఎస్సీఆర్ ఏపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. కాగా, ఈ రెండు హై స్పీడ్ కారిడార్ల నిర్మాణంలో భాగంగా ఏపీలో 15 స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందూపురం వద్ద ప్రత్యేక స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్-చెన్నై కారిడార్‌లో దాచేపల్లి, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతిలో ప్రత్యేక స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి.

# ప్రభుత్వ ఆస్పత్రులపై తప్పుడు ప్రచారం

» ప్రైవేట్ ఆస్పత్రులకు లబ్ధి చేకూర్చేలా కొందరి తీరు: దామోదర

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్య సేవలందించే సర్కారీ దవాఖానలపై కొంత మంది బురద జల్లుతున్నారని మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం సన్నగిల్లేలా తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని ఓ ప్రకటనలో మండిపడ్డారు. బస్తీ దవాఖానల ద్వారా ప్రతి రోజూ 45 వేల మందికి వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. బస్తీ దవాఖానలకు వచ్చే రోగులకు డయాగ్నస్టిక్స్ హబ్స్ ద్వారా 134 రకాల వైద్య పరీక్షలు చేయిస్తున్నామని, 24గంటల లోపల ఫలితాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. బస్తీ దవాఖానల్లో మెరుగైన సేవలు అందుతుండడంతో గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులపై రోగుల రద్దీ తగ్గిందని పేర్కొన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్న వారి తీరును ప్రజలు గమనిస్తున్నారని పరోక్షంగా బీఆర్ఎస్ నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు. సరైన సమయంలో మరో సారి వారికి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇలాంటి కుట్రపూరిత చర్యలు తమ డాక్టర్లు, సిబ్బంది మనోధైర్యాన్ని దెబ్బతీయలేవని పేర్కొన్నారు.

# బీసీ గురుకుల పాఠశాలల్లో 100% ఫలితాలకు శ్రద్ధ వహించాలి: పొన్నం

మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించి, వంద శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో పర్యవేక్షణ లోపంతో ఉత్పన్నమైన సమస్యలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. బీసీ గురుకులాల కార్యదర్శి, సైదులు, ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, ఆర్సీవోలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదివారాలు ఇతర సెలవు దినాల్లోను విద్యార్థుల మరింత భద్రత, రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన విద్య అందించాలన్నారు. అన్ని బీసీ పాఠశాలలు, కళాశాలల్లో వందశాతం ఫలితాలు సాధించి తీరాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. విద్యార్థుల క్రమశిక్షణ పై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమన్నారు. నిర్దేశిత ఆహార మెనును కచ్చితంగా అమలు చేయాలన్నారు. వాష్‌రూమ్‌లు క్రమం తప్పకుండా శుభ్రపరచాలని, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల్లో భద్రత, రక్షణ చర్యలపై ప్రిన్సిపాళ్లు స్వయంగా చొరవ తీసుకుని పర్యవేక్షించాలన్నారు. ప్రాంతీయ సమన్వయ అధికారులు పాఠశాలలు, కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు జరపాలని మంత్రి నిర్దేశించారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల సమస్యలు పరిష్కరిస్తాం

» 25% పెండింగ్ బిల్లులు మంజూరు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

రాష్ట్రంలోని బడుగు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం 25 శాతం నిధులు విడుదల చేసినందుకు మంత్రిని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు సచివాలయంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఇప్పటికే 25 శాతం నిధులు విడుదల చేశామని, ఆర్థిక సమస్యలను అధిగమిస్తూ దశలవారీగా మిగిలిన సమస్యల పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. డైట్ చార్జీలను గ్రీన్ చానెల్ ద్వారా విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# వర్గీకరణ రోస్టర్ పాయింట్లలో అన్యాయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా: అద్దంకి దయాకర్

» రాజ్యాంగ హక్కుల సాధన సభ పోస్టర్ ఆవిష్కరణ

పంజాగుట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లలో జరిగిన అన్యాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చెప్పారు. దళితులపై దాడులకు నిరసనగా నవంబరు 26న చలో ఢిల్లీ పేరుతో చేపట్టనున్న రాజ్యాంగ హక్కుల సాధన సభ, ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని, అందుకోసం తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. దేశంలో దళితులు, ఆదివాసీలపై ఇప్పటికీ వివక్ష కొనసాగుతోందని దుయ్యబట్టారు. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం ఉందని, అదే రోజున జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో ధర్నా, రాజ్యాంగ హక్కుల సాధన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 35 దళిత గిరిజన ఆదివాసీ సంఘాలు పాల్గొంటాయని తెలిపారు.

## భారతికి ఫోన్ చేసిందెవరు?

# ఏం చెప్పారు?

» సీబీఐ తేల్చాలి.. తదుపరి దర్యాప్తునకు ఆదేశించండి

» లేదంటే అసలు వ్యక్తులు తప్పించుకుంటారు

» వివేకాహత్య కేసులో సీబీఐ కోర్టులో సునీతారెడ్డి పిటిషన్

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బాబాయి, తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో మరింత లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని.. తదుపరి దర్యాప్తు చేపట్టే విధంగా సీబీఐకి ఆదేశాలు జారీచేయాలంటూ నర్రెడ్డి సునీతారెడ్డి హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. తదుపరి దర్యాప్తు కావాలనుకుంటే సంబంధిత ట్రయల్ కోర్టులోనే పిటిషన్ దాఖలు చేసుకోవాలని ఇటీవల సుప్రీంకోర్టు సునీతారెడ్డికి సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమె తాజాగా సీబీఐ కోర్టును ఆశ్రయించారు. తన తండ్రి హత్య కేసులో లోతైన దర్యాప్తు జరగకపోతే అసలు వ్యక్తులు తప్పించుకునే ప్రమాదం ఉందని.. ఇప్పటికే తండ్రిని కోల్పోయిన తనకు మరింత అన్యాయం జరుగుతుందని తన పిటిషన్‌లో ఆమె అభ్యర్థించారు. సప్లమెంటరీ చార్జిషీటు దాఖలుచేయాలని సీబీఐని ఆదేశించాలని కోరారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరిగితేనే ఇప్పటికీ వెలుగుచూడని అసలు వాస్తవాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు.

### పిటిషన్‌లో ఏమున్నదంటే..

- ఏపీ చీఫ్ సెక్రటరీగా పనిచేసి రిటైర్ అయిన ఐఏఎస్ అజేయ కల్లం వివేకా హత్య కేసుకు సంబంధించి సీబీఐ ఎదుట సీఆర్పీసీ 161 కింద స్టేట్‌మెంట్ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో వైసీపీ పార్టీ మేనిఫెస్టో రూపకల్పనలో తాను సహాయం చేశానని, దీనికి సంబంధించిన సమావేశాలు హైదరాబాద్‌లోని జగన్ నివాసంలో తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో జరుగుతుండేవని పేర్కొన్నారు. వివేకా చనిపోయినరోజు (2019 మార్చి 15) తెల్లవారుజామున 5.30 గంటలకు తాను జగన్‌తో సమావేశంలో ఉండగా, అటెండర్ వచ్చి అమ్మ (వైఎస్ భారతి) పిలుస్తున్నారని తెలపగా, జగన్ వెళ్లారని ఆయన పేర్కొన్నారు. పది నిమిషాల తర్వాత తిరిగొచ్చిన జగన్.. చిన్నాన్న (వైఎస్ వివేకా) ఇక లేరని చెప్పారని.. దీంతో తామంతా షాక్‌కు గురయ్యామని తన స్టేట్‌మెంట్‌లో ఆయన పేర్కొన్నారు. అయితే వివేకా చనిపోయినట్టు ఫోన్ కాల్ ఎవరు చేశారు? ఫోన్‌కాల్ సారాంశం ఏంటి? అనే విషయాలు బయటకురావాల్సిన అవసరం ఉంది.
- వివేకా హత్యకేసులో 5వ నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డి కడప జైల్లో 4వ నిందితుడు దస్తగిరిని (అప్రూవర్) కలిసి ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు. మెడికల్ క్యాంప్ పేరుతో జైల్లో ప్రవేశించి దస్తగిరిని ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేశారు. ఈ అంశంపై దర్యాప్తు జరిగితేనే కొత్త వాస్తవాలు తెలుస్తాయి.
- సాక్షులను భయభ్రాంతులకు గురిచేయడానికి, వారిని ప్రభావితం చేయడానికి చాలా ప్రయత్నాలు జరిగాయని స్వయంగా సీబీఐ తెలిపింది. ఇదేవిషయం ఏపీ పోలీసులు సుప్రీంకోర్టు ఎదుట వివరంగా పేర్కొన్నారు.

# రెండేళ్లలో ఉస్మానియా కొత్త ఆస్పత్రి పూర్తవ్వాలి

## వందేళ్ల అవసరాలకు తగినట్లు వసతుల కల్పన

» పనుల వేగవంతానికి సమన్వయ కమిటీ

» అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఉస్మానియా నూతన ఆస్పత్రి నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆస్పత్రి నిర్మాణంపై తన నివాసంలో సీఎం బుధవారం సమీక్ష నిర్వహించారు. అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. పనులు జరిగే సమయంలో స్థానికులకు ఇబ్బందుల్లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అలాగే ఆస్పత్రికి వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. పనుల వేగవంతానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రతి 10 రోజులకోకసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని అన్నారు. నిర్మాణం పూర్తయ్యాక అక్కడి బందోబస్తు.. ట్రాఫిక్ విధుల నిర్వహణకు ముందుస్తుగానే తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులు, వైద్య కళాశాలల నిర్మాణానికి సంబంధించి ప్రతి నిర్మాణానికి ఒక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. నిర్మాణాలను నిరంతరం ఆ అధికారి పర్యవేక్షించేలా పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించాలని సీఎం సూచించారు. వచ్చే జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, డీజీపీ శివధర్ రెడ్డి, హెల్త్ సెక్రటరీ క్రిస్టియానా జోంగ్తూ, ఇలంబర్తి, ముషారఫ్ అలీ ఫరూఖీ, హరిచందన డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ తరువాతే.. స్థానికం

(మొదటిపేజీ తరువాయి)



సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మంత్రులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లపై చర్చ జరిగింది. ఈ కాన్ఫరెన్స్‌లో కూడా హైకోర్టు గడువు వరకు వేచి చూద్దామని, ఆలోపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కూడా ముగుస్తుందనే అభిప్రాయం వ్యక్తమైందని సమాచారం. దీనిపై మంత్రివర్గ సమావేశంలో లోతుగా చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఓవైపు అన్ని సామాజికవర్గాలకు కలిపి రిజర్వేషన్లు 50 శాతం మించకూడదనే సుప్రీంకోర్టు తీర్పు ఉండగా, మరోవైపు 50 శాతం సీట్లను ఓపెన్ క్యాటగిరీగా నోటిఫై చేసి ఎన్నికలు నిర్వహించుకోవచ్చునంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఎన్నికలకు ఎలా వెళ్లాలనే దానిపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది. అయితే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సమయంలో మాత్రం ఎట్టి పరిస్థితుల్లో బీసీలకు 42 శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయిస్తూనే ఎన్నికలకు వెళ్తామని కాంగ్రెస్ చెప్పింది. గురువారం క్యాబినెట్ భేటీలో ఈ అంశం కొలిక్కివచ్చే అవకాశం ఉందంటున్నారు.

### ఆ అపవాదు ఎందుకు అని..

రాష్ట్రంలో 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ తరువాత 2024 ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీలకు గడువు ముగిసింది. అప్పటినుంచి బీసీల రిజర్వేషన్ల వ్యవహారం నడుస్తుండడంతో దాదాపు 20 నెలలుగా తెలంగాణలో గ్రామ పంచాయతీల్లో పాలకమండళ్లు లేవు. ఫలితంగా కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు సహా పలు గ్రాంట్లు కూడా నిలిచిపోయాయి. దీంతో "అసలు ఎన్నికలు నిర్వహించలేదనే అపవాదు మనకెందుకు? బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం చేయాల్సిన మేరకు అన్ని ప్రయత్నాలు చేశాం కదా! రిజర్వేషన్ల పెంపునకు ఉన్న ఇబ్బందులు, ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ప్రజలకు వివరించి, ఎన్నికలకు వెళ్లడమే మేలు" అని పలువురు మంత్రులు అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారికంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుతోనే ఎన్నికలకు వెళ్లాలన్న అభిప్రాయంతో మరికొంత మంది మంత్రులు ఉన్నట్టు తెలిసింది. ఈ విషయంపై గురువారం మంత్రివర్గంలో కీలకంగా చర్చించనున్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం జారీ చేసిన ప్రత్యేక జీవోపై హైకోర్టు స్టే విధించడం, ఆపై ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లడం, స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడం తెలిసిందే. ఆ సందర్భంగా సుప్రీం సూచించిన పలు అంశాలపై అధ్యయనం చేసి, దాని ప్రకారం ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు, న్యాయనిపుణుల అధ్యయనం చేసిన నివేదిక గురువారం క్యాబినెట్ భేటీలో చర్చకు రానుంది.

### ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేతకు ఆమోదం..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం 2018 పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 213 (3)లో సవరణ చేయనున్నారు. అనంతరం ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ మేరకు సంబంధిత ఫైలు గురువారం క్యాబినెట్‌కు రానుంది. అక్కడ ఆమోదం పొందగానే దానిని గవర్నర్ ఆమోదం కోసం పంపనున్నారు. గవర్నర్ ఆమోదం తరువాత ఆర్డినెన్స్ జారీ చేయనున్నట్టు అధికారికవర్గాల ద్వారా సమాచారం. అలాగే క్యాబినెట్ సమావేశంలో పలు సాగునీటి ప్రాజెక్టుల డిజైన్లలో మార్పులు, అంచనాల్లో మార్పులకు సంబంధించి కూడా చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిసింది.

### పార్టీ పరంగా వద్దు.. చట్టపరంగానే కల్పించాలి: ఆర్.కృష్ణయ్య

రాంనగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ పరంగా కాకుండా చట్టపరంగా ఇచ్చేలా మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. లేదంటే బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు.

### పార్లమెంటులో 50 శాతం పరిమితిని ఎత్తివేసే బిల్లు పెట్టాలి: బీవీ రాఘవులు

బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేసేందుకు రాజ్యాంగ సవరణకు సంబంధించిన బిల్లు పెట్టాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీలో మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్రంలో అడ్డుకుంటూ మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

### కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు: మధుసూదనాచారి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడంపై కాంగ్రెస్ సర్కారుకు చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి ఆరోపించారు. ఢిల్లీ స్థాయిలో ఒత్తిడి తెచ్చి.. రాజ్యాంగ సవరణ చేస్తే తప్ప 42 శాతం సాధ్యం కాదన్నారు.



ఎర్త్ సైన్సెస్ వర్సిటీ వీసీ యోగితా రాణాతో సమావేశమైన మంత్రి తుమ్మల

# మన్మోహన్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి సీఎస్ఆర్ ద్వారా నిధులు

» నిర్మాణ ప్రణాళిక, నిధుల మంజూరుపై సీఎంతో చర్చించాక తుది నిర్ణయం

» అప్పటిలోగా వర్సిటీకి డిజైన్లు సిద్ధం చేయండి

» అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు

కొత్తగూడెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ అయిన కొత్తగూడెంలోని మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) ద్వారా నిధులను సమకూర్చి, మంజూరు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎన్ఎండీసీ, సింగరేణి, కోల్ ఇండియా సంస్థల ప్రతినిధులతో ఇప్పటికే చర్చించినట్టు ఆయన వివరించారు. సెక్రటేరియట్‌లో ఎర్త్‌సైన్సెస్ వర్సిటీ వీసీ, విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణాతో బుధవారం ఆయన సమావేశమై యూనివర్సిటీ నిర్మాణం గురించి చర్చించారు. వచ్చే వారం ముఖ్యమంత్రిని కలిసి యూనివర్సిటీ నిర్మాణ ప్రణాళిక, నిధుల అంశాలపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. అప్పటికల్లా వర్సిటీ డిజైన్‌లు, ఖర్చు అంచనాలను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కొత్తగూడెంలోని మైనింగ్ కాలేజీని ఎర్త్ సైన్సెస్ వర్సిటీగా మార్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ విద్యా చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని తుమ్మల అన్నారు. వర్సిటీకి మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ పేరు పెట్టడం ప్రభుత్వం తీసుకున్న గౌరవప్రదమైన నిర్ణయమన్నారు. కాగా, వర్సిటీ నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు అవసరం అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు.

# రవాణా శాఖ చెక్‌పోస్టుల తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

వద్ద బోర్డులు, బారికేడ్లు తొలగించాలని జిల్లా రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. చెక్‌పోస్టులకు సంబంధించి ఇప్పటి వరకు జరిగిన అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని కమిషనర్ స్పష్టం చేశారు. చెక్‌పోస్టుల్లో ఏసీబీ వరస తనిఖీలు, పెద్ద మొత్తంలో లెక్కల్లో లేని నగదు స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. రహదారులపై రవాణా శాఖ చెక్‌పోస్టులను ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరికొన్ని రాష్ట్రాలు ఇదివరకే ఎత్తివేశాయి. మొబైల్ పార్టీల ద్వారా ఆకస్మిక తనిఖీలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా తిరిగే వాహనాలపై చర్యలు తీసుకుంటున్నారు. ఇకపై రాష్ట్రంలోనూ అదే పద్ధతి కొనసాగనుంది. సీఎం ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న రవాణా చెక్‌పోస్టులన్నింటినీ అధికారులు తొలగించారు.

### రవాణా శాఖలో సమగ్ర మార్పులు: పొన్నం



రవాణా శాఖలో సమగ్ర మార్పులకు చర్యలు చేపట్టామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందులో భాగంగానే చెక్‌పోస్టులను రద్దు చేశామన్నారు. రాష్ట్రంలో ఈవీ పాలసీ తెచ్చిన తర్వాత రవాణా శాఖకు రావాల్సిన రూ.577 కోట్ల పన్నును ప్రభుత్వం మినహాయించిందని చెప్పారు. పన్ను మినహాయింపుతో విద్యుత్తు వాహనాల వాడకం భారీగా పెరిగిందన్నారు. ఢిల్లీలో కాలుష్యం విపరీతంగా పెరిగిందని, రాష్ట్రంలో ఆ పరిస్థితి లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈవీ-విధానాన్ని తీసుకొచ్చిందని వివరించారు. 'హైదరాబాద్‌లో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతి ఇచ్చాం. కేంద్రం తీసుకొచ్చిన వాహన్, సారథి పోర్టల్ సేవలు అమల్లోకి వచ్చాయి. గడువు తీరిన పాత వాహనాల్ని తుక్కు చేసేందుకు స్క్రాపింగ్ విధానాన్ని తీసుకొచ్చాం' అని పొన్నం చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణా చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు వాహనాలకు రేడియం స్టిక్కర్లు ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. దళారీ వ్యవస్థను అరికట్టేందుకు ఏఐ టెక్నాలజీని ఉపయోగించి రవాణా శాఖ కార్యాలయాల్లోకి అదేపనిగా వస్తున్నవారిని గుర్తిస్తున్నట్లు చెప్పారు.

### మైనింగ్ లారీలు, ట్రావెల్ బస్సులకు హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు

నిబంధనలకు విరుద్ధంగా ఒకే నంబరు ప్లేట్‌పై ఒకటి కంటే ఎక్కువ వాహనాలు తిరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో మైనింగ్ వాహనాలు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులకు హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పీ) తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మైనింగ్, మినరల్స్ వాహనాలు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నిబంధనలు అతిక్రమించి తిరుగుతున్నట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. అలాంటి వాహనాల్ని గుర్తించి, యాజమాన్యాలపై చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది.

# ఇక పట్టణాల్లోనూ 'ఇందిరమ్మ ఇల్లు'

## 400 చదరపు అడుగుల కంటే తక్కువ స్థలం ఉన్నా నిర్మించుకునే వెసులుబాటు

» జీ+1 విధానంలో ఇంటి నిర్మాణం

» 4 దశల్లో రూ.5 లక్షలు అందజేత

» జీవో 69 విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

» మురికివాడల్లో పేదలకు పక్కా ఇళ్లు: పొంగులేటి



హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇకపై పట్టణాల్లోనూ 'ఇందిరమ్మ ఇంటి'ని నిర్మించుకోవచ్చు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 400 నుంచి 600 చదరపు అడుగుల స్థలం ఉంటేనే అవకాశం కల్పిస్తుండగా.. ఇక నుంచి 400 చ.అ. కంటే తక్కువ స్థలం ఉన్నా ఇంటిని నిర్మించుకునే వీలు కల్పించింది. గ్రౌండ్+1 విధానంలో తక్కువ స్థలంలో ఇంటిని నిర్మించుకోవచ్చని తెలుపుతూ బుధవారం జీవో 69 విడుదల చేసింది. అందులో కొలతలతో సహా వివరాలను పేర్కొంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో తక్కువ స్థలం (400 చ.అడుగుల కంటే) ఉన్నవారు కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులవుతారని అధికారులు చెబుతున్నారు.

### మురికివాడల రూపురేఖలు మారతాయి

పేదవాడి సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చామని, ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పథకం శరవేగంగా అమలవుతున్న నేపథ్యంలో పట్టణ ప్రాంతాలపైనా దృష్టి సారించామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సచివాలయంలో సమీక్షించారు. పట్టణ ప్రాంతాల్లో ఇరుకు స్థలాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు పక్కా ఇంటిని సమకూర్చేలా ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని వర్తింపజేయనున్నట్లు తెలిపారు. పట్టణాల్లోని మురికివాడల రూపురేఖలు మారతాయన్నారు. 400 చ.అ. కంటే తక్కువ స్థలం ఉన్నా.. ఇంటి నిర్మాణానికి అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. దాని ప్రకారం కనీసం 30 చదరపు మీటర్ల (323 చ.అ.) విస్తీర్ణంలో జీ+1 విధానంలో ఇంటిని నిర్మించుకోవచ్చని వెల్లడించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 200 చ.అ., మొదటి అంతస్తులో 200 చ.అ. చొప్పున నిర్మించుకునేలా వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని పేదలకున్న స్థలాల కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ సడలింపులు ఇచ్చినట్లు చెప్పారు. పథకం ప్రారంభమైన తర్వాత పట్టణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాలపై అధ్యయనం చేశామన్నారు. చాలామంది 60 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలో రేకుల షెడ్లు, ఇతర తాత్కాలిక ఏర్పాట్లతో జీవిస్తున్నారని.. వారికి ఆర్‌సీసీతో పక్కా ఇంటిని నిర్మించాలనే జీ+1 ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చామని వివరించారు. ఈ విధానంలోనూ రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని 4 దశల్లో అందిస్తామన్నారు.

### జీ+1 ఇంటి నిర్మాణం ఇలా..

జీ+1 విధానంలో పట్టణ ప్రాంతాల్లో 96 చ.అ., 70 చ.అ. విస్తీర్ణంతో వేర్వేరుగా రెండు గదులతో పాటు కనీసం 35.5 చ.అడుగుల్లో వంటగదిని నిర్మించుకోవాలి. ప్రతి ఇంటికీ ప్రత్యేకంగా మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలి. ఆర్‌సీసీతో స్లాబ్ ఉండాలని, దానికి హౌసింగ్ శాఖ డీఈఈ అనుమతి ఉండాలని జీవోలో పొందుపర్చారు. మొదటి అంతస్తులో రూ.లక్ష, గ్రౌండ్ ఫ్లోర్ రూఫ్ లెవల్ తర్వాత రూ.లక్ష, మొదటి అంతస్తులో కాలమ్స్, స్లాబ్, గోడల నిర్మాణాలు పూర్తయ్యాక రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మరో రూ.లక్ష కలిపి మొత్తం రూ.5 లక్షలను 4 దశల్లో అందించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# గోరక్షక్ దళ సభ్యుడిపై కాల్పులు

## గోవుల తరలింపును అడ్డుకున్నాడన్న కక్షతో వ్యక్తి దారుణం.. ఆస్పత్రిలో బాధితుడు.. నిలకడగా ఆరోగ్యం

» పరారీలో నిందితుడు.. మేడ్చల్ జిల్లాలో ఘటన



ప్రశాంత్‌సింగ్ (ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్/రెజిమెంటల్ బజార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గోవులు తరలింపును అడ్డుకుంటున్నాడన్న కక్షతో చర్చల నెపంతో పిలిపించుకొని గోరక్షకదళ సభ్యుడిపై కాల్పులు జరిపాడో వ్యక్తి. మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పరిధిలోని యంనంపేట్‌లో ఈ ఘటన జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. బహదూర్‌పురకు చెందిన ఇబ్రహీం పలు జిల్లాల్లోని పశువుల సంతల్లో ఆవులను కొనుగోలు చేసి నగరంలోని కబేళాలకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. కీసర మండలం రాంపల్లి ఆర్ఎల్ నగర్‌లో నివాసం ఉంటున్న ప్రశాంత్‌సింగ్ అలియాస్ సోను(25) గోరక్షక్ దళ సభ్యుడిగా పనిచేస్తూ గోవుల తరలింపును అడ్డుకుంటున్నాడు. వారం క్రితం ఇబ్రహీంకు చెందిన ఆవులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. ప్రశాంత్‌పై కక్ష పెంచుకున్న ఇబ్రహీం చర్చల కోసం శ్రీకాంత్ అనే మధ్యవర్తి ద్వారా అతడికి కబురు పెట్టాడు. బుధవారం ప్రశాంత్ సింగ్ తన కారులో యంనంపేట్‌కు చేరుకున్నాడు. చర్చలు జరుగుతుండగా.. ఒకదశలో సహనం కోల్పోయిన ఇబ్రహీం తన వెంట తెచ్చుకున్న రివాల్వర్‌ను బయటకు తీశాడు. మూడు రౌండ్లు గాల్లోకి పేల్చి.. నాలుగో రౌండ్‌ను ప్రశాంత్‌వైపు కాల్చాడు. ఆ తూటా ప్రశాంత్ ఛాతీ కింది భాగంలో దిగింది. రక్షించండి.. రక్షించండి అని కేకలు వేసుకుంటూ ప్రశాంత్ రోడ్డు మీదకు పరుగులు తీశాడు. వెంటనే అక్కడి నుంచి ఇబ్రహీం పరారయ్యాడు. గమనించిన స్థానికులు 100కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ప్రశాంత్‌ను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నిందితుడు ఇబ్రహీం కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనాస్థలాన్ని రాచకొండ సీపీ సుధీర్‌బాబు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీంను రప్పించి కాల్పులు జరిగిన చోట ఆధారాలు సేకరించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రశాంత్‌సింగ్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. అక్కడున్న ప్రశాంత్‌సింగ్ తల్లిదండ్రులను ఓదార్చారు. గోవధకు పాల్పడుతున్న వారిని పోలీసులు రక్షిస్తూ.. గోరక్షక్ దళ సభ్యులపై కేసులు పెడుతున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. గోరక్షక సభ్యులు ఇటు మాఫియాతో అటు పోలీసులతో పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు ఇలానే వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రశాంత్ పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉందని, అతడికి శస్త్రచికిత్స చేయాల్సి ఉందని చెప్పారు.

# మావోయిస్టు మద్దతుదారులపై నజర్!

- సోషల్ మీడియా పోస్టులపై కేంద్ర బృందాలు, రాష్ట్ర పోలీసుల నిఘా
- నక్సల్స్ ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్ల తర్వాత స్పందించిన వారిపై కన్ను

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా ఓవైపు భద్రతా బలగాలు ముందుకు సాగుతుండగా.. మరోవైపు మావోయిస్టు దళాలకు, నాయకత్వానికి పట్టణ ప్రాంతాల నుంచి ఆర్థిక , సైద్ధాంతిక మద్దతునిస్తున్న వారిపై కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఇటీవల మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్.. పార్టీ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ఆయుధాలతో లొంగిపోయిన సందర్భంలో, అంతకు ముందు ఆయన చేసిన ప్రకటనలపై స్పందించిన వ్యక్తులు, సంస్థల కార్యకలాపాలపై పోలీసులు దృష్టి పెట్టారు. ఈ క్రమంలో సోషల్ మీడియా పోస్టులనూ నిఘా వర్గాలు జల్లెడ పడుతున్నాయి. మల్లోజులతో పాటు ఆశన్న తదితరులు లొంగిపోవడం, పార్టీని పునర్‌నిర్మిస్తామన్న మావోయిస్టుల తాజా ప్రకటనల నేపథ్యంలో ఆయా అంశాలపై స్పందిస్తున్న వారెవరన్న దానిపై ఆరా తీస్తున్నారు. వారి కుటుంబ, ఉద్యోగ వివరాలు, ఆర్థిక లావాదేవీలను సైతం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో పోస్టులు తాత్కాలిక ఆవేశానికి గురై పెట్టారా? లేక మావోయిస్టు పార్టీతో సుదీర్ఘమైన అనుబంధాన్ని కొనసాగిస్తూ బహిరంగంగా నైతిక మద్దతు తెలుపుతున్నారా? అనే అంశాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**వారంతా ఇప్పుడేం చేస్తున్నారు?**

మావోయిస్టు పార్టీపై దేశవ్యాప్త నిషేధం అమలవుతున్న క్రమంలో దానికి అనుబంధంగా బహిరంగంగా పనిచేస్తున్న పలు ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల పైనా కేంద్ర, రాష్ట్రాలు నిషేధం విధించి అమలు చేస్తున్నాయి. ఆయా ఫ్రంటల్ ఆర్గనైజేషన్లలో గతంలో యాక్టివ్‌గా ఉన్నవారు ఇప్పుడేం చేస్తున్నారు? ప్రస్తుతం మావోయిస్టు పార్టీకి రహస్యంగా ఏమైనా పనిచేస్తున్నారా? అనే విషయాలను నిఘా అధికారులు పరిశీలిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా మావోయిస్టు పార్టీని లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పదేపదే ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆలోగా మావోయిస్టులకు మద్దతిచ్చే పట్టణ ప్రాంతాల్లోని అర్బన్ నకలైట్లను ఏరివేయాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఆ మేరకే అన్ని జిల్లా యూనిట్లకు ఈ విషయంలో ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. పట్టణ ప్రాంతం నుంచి మావోయిస్టుల్లోకి పంపడానికి యువతను ఎవరైనా సంసిద్ధం చేస్తున్నారా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు. గతంలో గ్రామీణ పేదల సం ఘం, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస), రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ), విప్లవ కార్మిక సమాఖ్య, ఆలిండియా రివల్యూషనరీ స్టూడెం ట్స్ ఫెడరేషన్ తదితర ఫ్రంటల్ ఆర్గనైజేషన్లను మా వోయిస్టు పార్టీతోపాటు నిషేధించారు. 2015 నుంచి ప్రతి ఏడాది వీటిపై నిషేధాన్ని పొడిగిస్తూ వస్తున్నారు.



కొండా లక్ష్మారెడ్డి దశ దినకర్మ కార్యక్రమానికి హాజరైన ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ, చిత్రంలో లక్ష్మారెడ్డి కుమారులు విజిత్‌రెడ్డి, శైలేందర్‌రెడ్డి, కొండా రాఘవరెడ్డి, కొండా వంశీధర్‌రెడ్డి

## కొండా లక్ష్మారెడ్డికి వేమూరి రాధాకృష్ణ నివాళి

- లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్(ఎన్ఎస్ఎస్) వార్తా ఏజెన్సీ వ్యవస్థాపకుడు కొండా లక్ష్మారెడ్డి దశదినకర్మ కార్యక్రమం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని పింగళి వెంకటరామారెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగింది. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ ఈ కార్యక్రమానికి హాజరై లక్ష్మారెడ్డికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. లక్ష్మారెడ్డి కుమారులు విజిత్‌రెడ్డి, శైలేందర్‌రెడ్డిలను పరామర్శించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, మర్రి రవీందర్‌రెడ్డి, కొండా రాఘవరెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్టు ఐ.వెంకట్రావు, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు తదితరులు లక్ష్మారెడ్డికి నివాళులర్పించారు.

## తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద కారులో 49 కిలోల గంజాయి

- సినీఫక్కీలో పట్టుకున్న టాస్క్‌ఫోర్స్
- టోల్‌ప్లాజా గేటును కారుతో ఢీకొట్టి పరారయ్యేందుకు నిందితుల యత్నం
- పోలీసు వాహనాన్ని ఢీకొట్టి కారు బోల్తా
- ముగ్గురు యువకులు, ఇద్దరు మహిళలు, ఇద్దరు పిల్లలు అదుపులోకి

తూప్రాన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్‌లోని టోల్‌ప్లాజా వద్ద ఓ కారులో దాదాపు రూ.10లక్షల విలువైన 49 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం సినీఫక్కీలో పట్టుకున్నారు. కారులో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్న తూప్రాన్ పోలీసులు.. ఆ కారులో ప్రయాణిస్తున్న ము గ్గురు యువకులు, మరో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులను అదుపులోకి తీసుకున్నారు. . మహరాష్ట్ర నాగ్‌పూర్ నుంచి ఓ కారులో పెద్ద ఎత్తున గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు నిఘా పెట్టగా.. బిక్నూర్ టోల్‌ప్లాజా వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసుల నుంచి ఆ కారు తప్పించుకుంది. ఆ కారు కోసం తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద బుధవారం రాత్రి పోలీసులు వేచి ఉన్నారు. టోల్‌గేట్ బూతులన్నింటినీ మూసేసి ఒకే బూత్ తెరిచి దాని ద్వారా వాహనాలను పంపిస్తున్నారు. అయితే, పోలీసు తనిఖీలను గుర్తించిన ఆ కారులోని వారు తమ వాహనంతో టోల్‌గేట్ గేటును ఢీకొట్టి దూసుకెళ్లేందుకు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు ఆ కారుకు తమ వాహనాన్ని అడ్డంపెట్టగా.. పోలీసు వాహనాన్ని ఢీకొట్టి ఆ కారు బోల్తా పడింది. ఈ క్రమంలో కారులో నుంచి మంటలు చెలరేగగా టోల్ ప్లాజా సిబ్బంది అదుపు చేశారు. అనంతరంలో కారులోని ప్రయాణికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారులో తనిఖీ చేసి నాలుగు బ్యాగుల్లో ఉన్న గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కాగా, పట్టుబడిన ముగ్గురు యువకుల్లో ఒకరిని మహ్మద్ చాంద్ పాషాగా పోలీసులు గుర్తించారు. కారు బోల్తా పడడంతో గాయపడిన అందులోని మహిళలు పారిపోయేందుకు యత్నించగా పోలీసులు వారిని పట్టుకున్నారు.

# పోక్సో కేసులో దోషికి 32 ఏళ్ల జైలు

**బాలిక అపహరణ, లైంగిక దాడి, బాల్య వివాహం కేసులో నల్లగొండ పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు**

### బాధిత బాలికకు 10 లక్షల పరిహారం

నల్లగొండ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలిక అపహరణ, లైంగిక దాడి, బాల్యవివాహం కేసులో నిందితుడికి మూడు సెక్షన్ల కింద 32 సంవత్సరాల జైలు శిక్ష, రూ.75 వేల జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు అదనపు జడ్జి, నల్లగొండ పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయాధికారి రోజారమణి బుధవారం తీర్పు చెప్పారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఓ ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని పానగల్ ప్రాంతానికి చెందిన గురజాల చందు ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. నల్లగొండకు సమీపంలో ఉండే ఓ మైనర్ బాలికను పరిచయం చేసుకుని తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. 2022 సెప్టెంబరు 19న నల్లగొండ వచ్చిన బాలికకు మాయమాటలు చెప్పి తన ఆటోలో బయటకు తీసుకువెళ్లాడు. బాలిక కనిపించకపోవటంతో కుటుంబసభ్యులు నల్లగొండ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసి.. నిందితుడు సెప్టెంబరు 25న ఆ బాలికను నల్లగొండలో దింపి వెళ్లిపోయాడు. ఆమెను నల్లగొండలోని భరోసా కేంద్రానికి తరలించిన పోలీసులు వాంగ్మూలాన్ని నమోదు చేశారు. తనను ఓ గుడికి తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడని, అతని కుటుంబ సభ్యుల ఇంటికి తీసుకువెళ్లి భార్యాభర్తలమని చెప్పి పలుమార్లు తనపై లైంగిక దాడి చేసినట్లు ఆమె వాంగ్మూలం ఇచ్చింది. నిందితుడిపై సెక్షన్ 366, 376(2), పోక్సో చట్టం సెక్షన్ 5 కింద కేసులు నమోదు చేసి... 2022 నవంబరు 15న కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణ తర్వాత కోర్టు నిందితుడిని దోషిగా తేల్చింది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేసినందుకు పోక్సో చట్టం సెక్షన్ 5(1) కింద 20 సంవత్సరాల జైలు, రూ.25 వేల జరిమానా, బాలికను ప్రలోభపెట్టి కిడ్నాప్ చేసినందుకు సెక్షన్ 366, 376(2) కింద 10 సంవత్సరాల జైలు, రూ.25 వేల జరిమానా విధించింది. ఈ రెండు శిక్షలూ ఏకకాలంలో అమలవుతాయి. బాల్య వివాహ నిషేధ చట్టం కింద రెండు సంవత్సరాల జైలు, రూ.25వేల జరిమానా విధించింది. మొత్తంగా నిందితుడికి మూడు సెక్షన్ల కింద 32 సంవత్సరాల జైలు, రూ.75 వేల జరిమానా విధించిన కోర్టు బాధితురాలికి డీఎస్ఎల్ఏ ద్వారా రూ.10 లక్షలు పరిహారంగా అందించాలని తీర్పులో పేర్కొంది.

### అత్యాచారం కేసులో జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం: బాలికను అపహరించి.. అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు 10 వేల జరిమానా విధిస్తూ సంగారెడ్డి పోక్సో కోర్టు న్యాయాధికారి కె.జయంతి తీర్పు చెప్పారు. కోహీర్ మండలం గురజాడ గ్రామానికి చెందిన తలారి లక్ష్మీనారాయణ (20) డ్రైవర్. 2018లో ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. జహీరాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరిపి.. సాక్ష్యాధారాలు కోర్టులో సమర్పించారు. జడ్జి విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో దోషి లక్ష్మీనారాయణకు జీవిత ఖైదు, జరిమానా విధించారు.

### విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు.. అరెస్టు

కూసుమంచి: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ ఉపాధ్యాయుడిని పోలీసులు పోక్సో కేసులో అరెస్టు చేశారు. అతనిపై డీఈవో సస్పెన్షన్ వేటు వేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గుడిపుడి వీరయ్య కొంతకాలంగా పలువురు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నెల 16న బాధిత విద్యార్థినులు హెచ్ఎం శివకుమార్‌కు చెప్పగా ఆయన జిల్లా విద్యాశాఖ అధికారులు, కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంఈవో రామాచారి విచారణ జరిపారు. విద్యార్థులు, తల్లితండ్రులు, సహ ఉపాధ్యాయులను విచారించి, నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. నివేదిక ఆధారంగా వీరయ్యను సస్పెండ్ చేస్తూ ఇన్‌చార్జి డీఈవో శ్రీజ ఉత్తర్వులిచ్చారు. పోలీసులు వీరయ్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అయితే దీనికి కొద్దిరోజుల ముందే వీరయ్య తన పలుకుబడిని ఉపయోగించి డిప్యూటేషన్‌పై ఖమ్మం అర్బన్ మండలానికి బదిలీ చేయించుకోవడం గమనార్హం. అతను 2016లో ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో ఇలాంటి వ్యవహార శైలితోనే సస్పెన్షన్‌కు గురైనట్టు చర్చ జరుగుతోంది.

## ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సమ్మె బాట

- ఉప ముఖ్యమంత్రికి నోటీసు ఇచ్చిన సమాఖ్య ప్రతినిధులు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైనందున నవంబరు 3 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సంఘాల సమాఖ్య (ఫాతీ) ప్రకటించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సచివాలయంలో బుధవారం కలిసిన ఫాతీ ప్రతినిధులు సమ్మె నోటీసు అందించారు. గతంలో జరిగిన చర్చల్లో దసరాలోపు రూ. 600 కోట్లు, దీపావళిలోపు రూ.600 కోట్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కాని రూ.300 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ప్రతినిధులు డిప్యూటీ సీఎంకు తెలిపారు. విడుదల చేసిన వాటిలోనూ సగం ప్రభుత్వ విద్యాసంస్థలే ఉన్నాయని, మైనార్టీ కాలేజీలకు ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. మిగిలిన రూ.900 కోట్లను నవంబరు 1లోపు విడుదల చేయాలని భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో అనేక కాలేజీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, నిర్వహణ భారంగా మారిందని సమాఖ్య అధ్యక్షుడు నిమ్మటూరి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కేఎస్ రవికుమార్, ప్రతినిధులు కె.సునీల్ కుమార్, కృష్ణారావు, రామదాసు తెలిపారు. సమ్మెతో విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని, గత్యంతరం లేకనే సమ్మె నిర్ణయం తీసుకున్నామని వారు ఉప ముఖ్యమంత్రికి తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

## ఐఫోన్ ఆర్డర్ చేస్తే.. ఐకూ ఫోన్ డెలివరీ!

- అమెజాన్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంట్లు

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐఫోన్ ఆర్డర్ చేసిన కస్టమర్‌కు ఐకూ ఫోన్ డెలివరీ చేసిన కేసులో.. జిల్లా వినియోగదారుల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను ఖాతరు చేయని అమెజాన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)తో పాటు మరో ఇద్దరికి అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. ఈ మేరకు ఏపీలోని కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్ కరణం కిశోర్ కుమార్ బుధవారం ఆదేశాలు జారీచేశారు. కర్నూలు జిల్లా సి.బెళగల్ గ్రామానికి చెందిన ఫిర్యాది కురువ వీరేశ్... 2024 సెప్టెంబరు 29న అమెజాన్‌లో యాపిల్ ఐఫోన్ 15ప్లస్ సెల్‌ఫోన్‌ను బుక్ చేశారు. దీనికోసం ఆయన రూ.79,900 ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. అయితే అమెజాన్ సంస్థ.. సదరు వినియోగదారుడు ఆర్డర్ చేసిన 'ఐఫోన్ 15ప్లస్'కు బదులుగా.. 'ఐకూ నియో9ప్రో' ఫోన్‌ను అందజేసింది. తాను పెట్టిన ఆర్డర్‌కు బదులుగా వేరే మోడల్ ఫోన్‌ను డెలివరీ చేయడంతో వీరేశ్.. జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు కమిషన్ అమెజాన్ కంపెనీ ఎండీతో పాటు మరో ఇద్దరికి నోటీసులు జారీ చేసినా వారు కమిషన్ ముందు హాజరుకాలేదు. దీంతో ఐఫోన్ 15ప్లస్ ఖరీదు కోసం చెల్లించిన రూ.79,900లకు 12% వడ్డీ జోడించి, అతని మానసిక ఆవేదన, కోర్టు ఖర్చుల కింద మరో రూ.35వేలు ఫిర్యాదికి 45 రోజుల్లోపు అందజేయాలని గతంలో ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ అమెజాన్ కంపెనీతో పాటు ప్రతివాదులు కమిషన్ ఆదేశాలను ఖాతరు చేయలేదు. దీంతో ఆగ్రహించిన కమిషన్ అమెజాన్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఈ కేసు విచారణను ఈ ఏడాది నవంబరు 21వ తేదీకి వాయిదా వేస్తూ కమిషన్ చైర్మన్ కరణం కిశోర్ కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నజీమా కౌసర్ ఆదేశాలు జారీ చేశారు.

# వివేక్, హరీశ్ మధ్య మాటల యుద్ధం

- కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఎప్పుడిస్తారని ప్రశ్నించిన హరీశ్‌రావు
- హామీలన్నీ అమలు చేస్తున్నామన్న వివేక్
- గత ప్రభుత్వ అప్పులే చెల్లిస్తున్నామని వెల్లడి



సమావేశంలో మాట్లాడుకుంటున్న మంత్రి వివేక్, మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీలపై మంత్రి గడ్డం వివేక్, మాజీ మంత్రి హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం జరిగింది. సిద్దిపేట కలెక్టరేట్‌లో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసే కార్యక్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఎప్పుడిస్తారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ, ఫ్యూచర్‌సిటీ కోసం లక్షల కోట్లు వెచ్చిస్తామని చెబుతున్న ప్రభుత్వం.. ఆరు గ్యారంటీల అమలుకు డబ్బుల్లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై మంత్రి వివేక్ స్పందిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం అవసరమైన చోట డబ్బులు ఖర్చు పెట్టకుండా.. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుకే లక్ష కోట్లు వెచ్చించిందని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులను తాము చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. కాగా, సమావేశంలో మంత్రి వివేక్ మాట్లాడుతూ సన్నబియ్యం ఇస్తున్నారా అని అడగ్గా.. ఇవ్వడం లేదని మహిళలు చెప్పారు. ఈ విషయమై దృష్టి సారించాలని కలెక్టర్ హైమావతికి మంత్రి సూచించారు.

## ఫెయిలా.. డబ్బిస్తే గ్రేస్ మార్కులతో పాస్!

- అటానమస్ కాలేజీల ఆగడాలను అరికట్టాలి: విద్యార్థి సంఘాల

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ పరిధిలోని కొన్ని అటానమస్ కాలేజీలు పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల నుంచి డబ్బు వసూలు చేసి గ్రేస్ మార్కులు కలిపి పాస్ చేస్తున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు అటానమస్ కాలేజీల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ జేఎన్టీయూలో బుధవారం ఆందోళన చేశాయి. ఘట్‌కేసర్ ప్రాంతంలోని కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో బీటెక్ ఫైనలియర్‌లో ఫెయిలైన విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి గ్రేస్ మార్కుల పేరిట పాస్ చేస్తున్నాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గ్రేస్ మార్కుల అంశంపై విచారణ జరిపి, ఆయా కాలేజీలకు యూజీసీ ఇచ్చిన అటానమస్ హోదా రద్దుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరారు. జేఎన్టీయూ స్నాతకోత్సవంలో ఒరిజినల్ డిగ్రీ పొందేందుకు దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అర్హులైన విద్యార్థులు తమ ఒరిజినల్ డిగ్రీలు పొందేందుకు అవసరమైన డేటాను తెప్పించేందుకు జేఎన్టీయూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాయి. ఈ మేరకు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఓ వినతిపత్రం సమర్పించారు.

## ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకానికి వచ్చేవారం నుంచి జియో మ్యాగ్నటిక్ సర్వే

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎస్ఎల్‌బీసీ) సొరంగం తవ్వకంలో భాగంగా వచ్చే వారం నుంచి హెలికాప్టర్ ద్వారా జియో మ్యాగ్నటిక్ సర్వే ప్రారంభం కానుంది. హెలికాప్టర్ ద్వారా ఆయస్కాంత తరంగాలు పంపించి.. భూమి లోపలి రాతి పొరల సమాచారం సేకరించి.. తదుపరి తవ్వకాలు ఏ విధంగా చేపట్టాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. అడవి లోపల తిరుగుతూ సర్వే చేయాలంటే అటవీ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉండటంతో.. హెలికాప్టర్ ద్వారా సర్వేకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జియో మ్యాగ్నటిక్ సర్వేలో భూమిపై ఆయస్కాంత తరంగాలు పంపిస్తే.. 1000 మీటర్ల లోతు దాకా ఉన్న రాతి పొరల గురించి తెలుసుకోవచ్చు. గత ఫిబ్రవరి 11వ తేదీన శ్రీశైలం(ఇన్‌లెట్) వైపున ప్రమాదం జరిగి.. 8 మంది కార్మికులు మృతి చెందిన విషయం విదితమే. ఆ తర్వాత ఇన్‌లెట్ వైపు టన్నెలింగ్ పూర్తిగా ఆగింది. ఇక ఔట్‌లెట్ (మన్నెవారిపల్లి, అచ్చంపేట) వైపు టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం) కోసం ప్రత్యేకంగా అమెరికా నుంచి బేరింగ్ తెప్పించినా.. మళ్లీ సమస్యలు వస్తాయని నిర్ధారించుకున్న తర్వాత పక్కనపెట్టారు. దాంతో తాజాగా రెండువైపులా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం(డీబీఎం) ద్వారానే టన్నెల్ తవ్వకం చేపట్టనున్నారు. దీనికోసం హెలికాప్టర్ సర్వేను వచ్చే వారం నుంచి చేపట్టనున్నారు. ఇక గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఎస్ఎల్‌బీసీ సవరణ అంచనాలకు ఆమోదించనున్నారు. శ్రీశైలం నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడానికి వీలుగా 43.931 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వాల్సి ఉండగా.. ఇన్‌లెట్ వైపు నుంచి 13.93 కిలోమీటర్ల దాకా తవ్వగా.. ఇంకా 9.559 కిలోమీటర్ల మేర తవ్వాల్సి ఉంది. దాంతో టీబీఎంలతో సొరంగం తవ్వకం సాధ్యం కాదని గుర్తించి.. డీబీఎం విధానాన్ని ఎంచుకున్నారు. జియో మ్యాగ్నటిక్ సర్వే పూర్తయిన తర్వాత టన్నెలింగ్ చేపట్టడానికి తదుపరి అడుగులు వేయనున్నారు. దాంతో ఈ సర్వే అత్యంత కీలకం కానుంది.

## అంబేడ్కర్ వర్సిటీ ఫీజు గడువు పెంపు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజును నవంబరు 13 లోపు చెల్లించుకోవచ్చని విద్యార్థి సేవల విభాగ డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2019-24 వరకు యూనివర్సిటీలో చేరిన డిగ్రీ (బీఏ/బీకాం/బీఎస్సీ) ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు గడువులోగా ఫీజు చెల్లించాలని ఆయన సూచించారు. అలాగే, 2022 నుంచి 2024 సంవత్సరాలలో పీజీ (ఎంఏ/ఎంకాం/ఎమ్మెస్సీ) కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు కూడా తమ ద్వితీయ సంవత్సరం ట్యూషన్ ఫీజును 13 లోపు చెల్లించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఫీజు రిజిస్ట్రేషన్ కోసం యూనివర్సిటీ పోర్టల్ ww-w.braouonline.inలో సందర్శించాలన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో గానీ, 040-23680 333/444/555 ఫోన్ నంబర్లలో గానీ సంప్రదించాలని వెంకటేశ్వర్లు సూచించారు.

# జగన్ తప్పుడు నంబర్ ఇచ్చారు

- కోర్టును తప్పుదోవ పట్టించారు
- ఇక విదేశీ పర్యటనలకు అనుమతి ఇవ్వొద్దు
- ప్రత్యేక కోర్టులో సీబీఐ వాదనలు
- జగన్ ఫోనే వాడరు...ఆయన తరఫు న్యాయవాదులు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడు (ఏ1), ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లండన్ పర్యటనకు న్యాయస్థానం విధించిన షరతులను ఉల్లంఘించారని సీబీఐ పేర్కొంది. తప్పుడు ఫోన్ నంబర్ ఇచ్చి వెళ్లారని, కోర్టును తప్పుదోవ పట్టించారని తెలిపింది. ఇకపై ఆయన విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వొద్దని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టును అభ్యర్థించింది. అయితే జగన్ అసలు ఫోనే వాడరని.. గతంలో విదేశాలకు వెళ్లినప్పుడు కూడా తన సిబ్బంది ఫోన్ నంబర్లను ఇచ్చారని ఆయన తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. బుధవారం ఇరు పక్షాల వాదనలు ముగియడంతో.. తీర్పును 28వ తేదీన వెల్లడిస్తామని కోర్టు తెలిపింది. ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య 15 రోజుల పాటు జగన్ లండన్‌లోని తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు షరతులతో కూడిన అనుమతిని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చింది. పర్యటన పూర్తి వివరాలతో పాటు ఆయన ఉపయోగించే ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ, అక్కడి బసకు సంబంధించిన సమాచారం సమర్పించాలని.. పర్యటన నుంచి తిరిగి వచ్చాక ప్రత్యక్షంగా కోర్టులో హాజరు కావాలని స్పష్టంచేసింది. ఈ నెల 11వ తేదీన లండన్ వెళ్లిన జగన్‌కు.. సీబీఐ అధికారులు మూడు సార్లు ఫోన్ చేయగా ఆ నంబర్ పని చేయలేదు. దీంతో లండన్ పర్యటనకు వెళ్లేందుకు కోర్టు విధించిన బెయిల్ షరతులను జగన్ ఉల్లంఘించారని సీబీఐ గత వారం పిటిషన్ దాఖలు చేసింది. దానిపై బుధవారం ప్రత్యేక కోర్టు న్యాయాధికారి టి.రఘురాం విచారణ జరిపారు. సీబీఐ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. తప్పుడు నంబర్ ఇచ్చి కోర్టును జగన్ తప్పుదోవ పట్టించారని.. పర్యటన కోసం ఇచ్చిన అనుమతిని తక్షణమే రద్దు చేయడంతో పాటు మరోసారి విదేశాలకు వెళ్లేందుకు ఆయనకు పర్మిషన్ ఇవ్వొద్దని గట్టిగా కోరారు. జగన్ తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. అసలు ఆయన ఫోనే ఉపయోగించరని, గతంలో విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు కూడా తన వ్యక్తిగత సహాయకులు, సిబ్బంది ఫోన్ నంబర్లే కోర్టుకు సమర్పించారని తెలిపారు.

**రాకియా పిటిషన్‌పై నిమ్మగడ్డకు కోర్టు నోటీసులు**

వాన్‌పిక్ వ్యవహారంలో నిమ్మగడ్డ ప్రసాద్ రూ.600 కోట్లు చెల్లించేలా ఆదేశించాలంటూ రాకియా దాఖలు చేసిన పిటిషన్‌పై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఆయనకు నోటీసులు జారీచేసింది. ఈ వ్యవహారంలో తమకు రూ.600 కోట్లు చెల్లించాలని రస్అల్‌ఖైమా కోర్టు గతంలో ఇచ్చిన తీర్పు అమలు కోసం రాకియా సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై త్వరగా తేల్చాలని ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో సివిల్ కోర్టు విచారణ చేపట్టింది. బుధవారం నిమ్మగడ్డకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను 24వ తేదీకి వాయిదా వేసింది.

## తగ్గుతున్న అమెరికా మోజు!

**అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థుల్లో 63 శాతం తగ్గుదల**

**జర్మనీ, బ్రిటన్, ఐర్లాండ్‌కు భారీగా పెరిగిన ఆదరణ**

న్యూఢిల్లీ, అక్టోబరు 22: డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలతో ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లాలనుకుంటున్న భారతీయ విద్యార్థుల సంఖ్య రోజురోజుకీ పడిపోతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ విద్యార్థులు అమెరికా కంటే యూరప్‌లోని జర్మనీ, బ్రిటన్, ఐర్లాండ్ దేశాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారని విద్యా ఫైనాన్సింగ్ ప్లాట్‌ఫాం జ్ఞాన్‌ధన్ తాజా నివేదిక తెలిపింది. 2023 నుంచి 2025 మధ్యకాలంలో అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్యలో 63 శాతం తగ్గుదల కనిపించిందని ఈ అధ్యయనం పేర్కొంది. ఒకప్పుడు ఉన్నత విద్యకు గమ్యస్థానంగా ఉన్న అమెరికాలో పెరుగుతున్న ట్యూషన్ ఫీజులు, కఠినమైన వీసా నిబంధనలు, హెచ్-1బీ వీసా ఫీజు పెంపు.. వంటి అంశాలు భారతీయ విద్యార్థుల అడ్మిషన్లు తగ్గిపోవడానికి కారణమని జ్ఞాన్‌ధన్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో అంకిత్ మెహ్రాఅన్నారు. 2023లో విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థుల్లో 54 శాతం మంది అమెరికాకు వెళ్లగా.. 2024లో ఆ సంఖ్య 26 శాతానికి, 2025లో 20 శాతానికి పడిపోయింది. అదే సమయంలో భారతీయ విద్యార్థుల చూపు యూరప్‌పై పడింది. 2023 నుంచి జర్మనీ, బ్రిటన్, ఐర్లాండ్ దేశాలకు వెళ్తున్న విదార్థులు విపరీతంగా పెరిగారు. ఈ మూడేళ్లలో జర్మనీకి వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఏకంగా 125 శాతం పెరగగా.. ఐర్లాండ్‌కు 153 శాతం, బ్రిటన్‌కు 143 శాతం పెరిగింది

## అటవీ విస్తీర్ణంలో ముందడుగు

**ప్రపంచంలో 9వ స్థానానికి ఎగబాకిన భారత్**

**వార్షిక అడవుల విస్తరణలో నిలకడగా 3వ స్థానం**

న్యూఢిల్లీ, అక్టోబరు 22: అటవీ విస్తీర్ణంలో ప్రపంచంలో భారత్ 9వ స్థానానికి చేరుకుంది. వార్షిక అటవీ విస్తీర్ణంలో మన దేశం నిలకడగా 3వ స్థానంలో ఉంది. చైనా, రష్యాల తరువాతి స్థానం ఇప్పటికీ మనదేశానిదే. ఐక్య రాజ్య సమితిలోని ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) బాలిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో 'గ్లోబల్ ఫారెస్ట్ రిసోర్స్ అసెస్‌మెంట్ 2025' నివేదికను విడుదల చేసింది. దీనిపై పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ ఎక్స్‌లో స్పందించారు. 'ఇది యావన్మంది భారతీయులూ సంతోషించదగ్గ విషయం. అటవీ విస్తీర్ణంలో ప్రపంచంలో మనం 9వ స్థానాన్ని సాధించాం. గతంలో మనం 10వ స్థానంలో ఉన్నాం. వార్షిక పెరుగుదలలో గతంలో వచ్చిన 3వ స్థానాన్ని నిలబెట్టుకున్నాం. ఇది గొప్ప విజయం. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, ప్రజా భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమయింది. మొక్కల పెంపకంపై కేంద్ర ప్రభుత్వం 'అమ్మ కోసం ఓ చెట్టు' పేరుతో నిర్వహించిన విస్తృత ప్రచారానికి విశేష ఆదరణ లభించింది' అని యాదవ్ పేర్కొన్నారు. భూగోళంలోని 32% భూమిలో అంటే 41,400 లక్షల ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. దీనిలో సగం కంటే ఎక్కువ... 54% అటవీ ప్రాంతం రష్యా, బ్రెజిల్, కెనడా, అమెరికా, చైనాల్లోనే ఉంది. ఆస్ట్రేలియా, కాంగో, ఇండోనేసియాల తరువాత మన దేశం ఉంది. వార్షిక అటవీ విస్తీర్ణం పెంపుదలలో చైనా మొదటి స్థానంలో నిలవగా ఆ తరువాతి స్థానాల్లో రష్యా, ఇండియా వచ్చాయి. చైనా, భారత్‌ల కారణంగా 1990 నుంచి 2025 వరకూ ఆసియా ప్రాంతంలో రికార్డు స్థాయిలో అటవీ విస్తీర్ణం పెరిగింది. అదే సమయంలో 2015-25ల మధ్య కాలంలో అడవుల నరికివేత సగానికిపైగా తగ్గింది. అడవుల క్షీణతలో దక్షిణ అమెరికా, ఆఫ్రికాలదే అగ్రతాంబూలం. ప్రపంచంలోని 20 శాతం అడవులు రక్షిత ప్రాంతాలు కాగా... దీర్ఘకాలిక ప్రణాళికలతో 55 శాతం అడవులను రక్షించుకోగలుగుతున్నారని నివేదిక పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.